

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
మంగళవారం | 29 జనవరి 2019 | హైదరాబాద్
సంపుటి 12 | సంచిక 90
| పేజీలు 12+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



అనుగ్రహం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, బహుళ పక్ష తిథి : నవమి రా.8.04, నక్షత్రం. విశాఖ రా.7.52, వర్జ్యం రా.11.56 నుంచి 1.33 వరకు
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా. 10.46 నుంచి 11.36 వరకు సూర్యోదయం : ఉ.6.35 గం; సూర్యాస్తమయం: సా.5.55

పేదోడికి కనీస ఆదాయం


• పేదరికంతో నవభారతాన్ని నిర్మించలేం • రాహుల్ గాంధీ సంచలన ప్రకటన

• యూపీఏ తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తాం • అధికారంలోకి వస్తే పేదవాడి అవసరాలు తీరుస్తానన్న కాంగ్రెస్ అధ్యక్షుడు • కాంగ్రెస్ గతంలో అనేక చారిత్రక నిర్ణయాలను తీసుకుంది • ఆకలి, పేదరికం లేని నవభారత నిర్మాణమే లక్ష్యం • టేపుల వ్యవహారంలో పారికర్‌పై చర్యలేవీ? • దర్యాప్తునకు ఆదేశించడం ఇంత వరకూ జరగలేదు • ఆ టేపులతో రాఫెల్ సీక్రెట్లు బయటపడతాయి • ఛత్తీస్‌గఢ్ సభలో సంచలన ప్రకటన



రాయ్‌బరేలి: ఎన్నికల ముంగిట రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ కనీస ఆదాయం వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. పేదరికంతో నవభారతాన్ని నిర్మించలేమని రాహుల్ తెలిపారు. ఎన్డీయే సర్కారును ఎలాగైనా ఓడించాలనే కసితో ఉన్న రాహుల్ గాంధీ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రియాంక గాంధీని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చిన ఆయన.. పేదలను ఆకర్షించేందుకు సంచలన ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వస్తే.. దేశంలోని పేదలందరికీ కనీస ఆదాయాన్ని అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సోమవారం రాయ్‌బరేలిలో మాట్లాడిన రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఇది కొనసాగింపుగా భావించొచ్చు. 100 రోజుల పని పథకం.. యూపీఏ తిరిగి అధికారంలోకి రావడానికి దోహదం చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ గతంలో అనేక చారిత్రక నిర్ణయాలను తీసుకుందన్న రాహుల్.. 2019లో అధికారంలోకి వస్తే మరో మిగతా 6లో

బ్యాంకర్లతో ఆర్‌బిఐ గవర్నర్ భేటీ


5లో

• బ్యాంకింగ్ రంగంపై శక్తికాంత్ చర్చలు • 7న ఆర్‌బిఐ పరపతి విధానం సమీక్ష • వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం

కివీస్‌పై ఇండియా ఘన విజయం


12లో

• అదరగొట్టిన కోహ్లి-శర్మ బ్యాటింగ్ విన్యాసం • రోహిత్ శర్మ అర్ధ శతకం • హార్దిక్ పాండ్య అద్భుతమైన క్యాచ్ • ఇక హాయిగా విశ్రమిస్తా: కోహ్లి • పాండ్యాపై కోహ్లి ప్రశంసలు • ధావన్ త్రోపై పాండ్యా అసహనం!

చంద్రబాబుతో కోట్ల భేటీ


2లో

అంతా బీసీల వెనుకే

గెలుపును వన్‌సైడ్ చేసే శక్తిగా బీసీలు









• బీసీ ఓటు బ్యాంకుపై టీడీపీ.. వైసీపీ.. టీఆర్ఎస్.. కాంగ్రెస్ వ్యూహ.. ప్రతి వ్యూహాలు • ఇప్పటికే టీడీపీ బీసీ జయహోతో దూకుడు? • బీసీ గర్జనతో బీసీలపై పట్టుకు వైసీపీ యత్నం • బాబుకు కేసీఆర్ రిటర్న్ గిఫ్ట్.. బీసీ ఓటు బ్యాంకు టీడీపీకి దూరం చేసే ఎత్తుగడ? • ఏ పార్టీకి బీసీల ఆదరణ లభిస్తుంది • పార్టీ పదవుల్లో, చట్టసభల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిందే: బీసీ వర్గాల డిమాండ్

(ఏపీ-పొలిటికల్‌బ్యూరో): ఎన్నికల సంగ్రామం సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీలు గెలుపును నిర్ణయించే బీసీ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మురం చేశాయి. ఒక్కోపార్టీ ఒక్కోరీతిలో బీసీలను ఆకట్టుకొనే వ్యూహాలు రచిస్తోంది. బీసీ ఓటు బ్యాంకును సాధించుకోవటంపైనే కాకుండా ప్రత్యర్థిపార్టీలు బీసీల చేంత చేరుకోకుండా చిత్తుచేయడం కూడా ప్రధాన పార్టీల వ్యూహాలలోని అంశాలుగా మారుతున్నాయి. ఇటీవల జయహో బీసీ కార్యక్రమాని టీడీపీ నాయకత్వం రాజమండ్రిలో చేపట్టింది. ఈ సభతో మిగతా 6లో

రాష్ట్రాలకు ఈసీ లేఖలు

• బదలీలు, నియామకాలపై స్పష్టమైన సూచనలు • పార్లమెంట్ ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు • రాష్ట్రాల సీఇఓ, సీఎస్, డీజీపీలతో కేంద్ర సీఇఓ వీడియో కాన్ఫరెన్స్ • అసెంబ్లీ స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ • కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారికి సీఎస్ వివరణ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గత డిసెంబర్ లో జరిగిన శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా, ఎటువంటి సంఘటనలు జరగకుండా నిర్వహించామని, అదే స్ఫూర్తితో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.కె.జోషి తెలిపారు. సోమవారం ఢిల్లీ నుండి భారత ఎన్నికల ప్రధాన అధికారి సునీల్ ఆరోరా అన్ని రాష్ట్రాల సి.యస్, లు డిజిపి, సిఈఓలు, ఐటి ఇతర అధికారులతో పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్ల సన్నద్ధతపై వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో డిజిపి మహేందర్ రెడ్డి, సిఈఓ రజత్ కుమార్, ముఖ్యకార్యదర్శులు సోమేష్ కుమార్, రాజీవ్ త్రివేది, అడిషనల్ డిజి జితేందర్, ఎన్నికల అధికారులు ఆమ్రపాలి, సత్యవాణి, ఐటి అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ స్టేషన్‌లో అన్ని వసతులు కల్పిస్తామని సీఎస్ అన్నారు. వికలాంగులకు పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం ప్రధమ అవార్డు మిగతా 6లో

ముందస్తు కసరత్తు

పార్లమెంటు ఎన్నికలపై కేసీఆర్ నజర్

• పార్టీ పరిస్థితి, అభ్యర్థులపై సర్వే
• సర్వే ఆధారంగానే టికెట్ల కేటాయింపు
• అసెంబ్లీలాగే ముందస్తుగా అభ్యర్థుల ప్రకటన
• ఫిబ్రవరి రెండో వారంలో అభ్యర్థుల ప్రకటన



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గులాబిదళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై ముందస్తు 'స్కెచ్'తో ముందుకు సాగుతున్నారు. ఇటీవల సహస్ర చండీ యాగంతో బిజీగా ఉన్న కేసీఆర్ ఆ యాగం పూర్తి కావడంతో పార్లమెంట్‌ల వారీగా అభ్యర్థుల గెలుపు, పార్టీ పరిస్థితిపై సర్వేలు చేయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఆయన పలు సర్వేలు నిర్వహించి అభ్యర్థులను మూడు మాసాల ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే!. అసెంబ్లీ మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే



బీసీలకు కించిత్తు ఉపకారం చేశారా?

• నీలాంటి వారివల్లే సమసమాజం రాలేదు • బీసీలకు ఏమీ చేయలేదు కాబట్టే జయహో అని డబ్బా కొట్టారు • ఒక్క బీసీనైనా రాజ్యసభకు పంపారా.. కేంద్ర మంత్రిని చేశారా.. జడ్జీలు అయ్యేందుకు కృషిచేశారా • బీసీల పట్ల మీ వివక్షపై జస్టిస్ ఈశ్వరయ్య ప్రశ్నలకు సమాధానం చెప్పండి • ఏపి ముఖ్యమంత్రిపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు ఫైర్

విజయవాడ, మేజర్‌న్యూస్: అధికారంలో ఉండగా బీసీలకు కించిత్తు ఉపకారం చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. మాయమాటలతో బీసీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా బీసీలకు అన్యాయం చేసిన చంద్రబాబుకు జయహో బీసీ అనే అధికారం లేదన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోస పోవడడానికి బీసీలు సిద్ధంగా లేరన్నారు. ఐదేళ్ల కాలంలో బీసీలకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ మిగతా 6లో


జయహోకు దీటుగా బీసీ గర్జన


2లో

• వైసీపీ నాయకత్వం కసరత్తు • ఫిబ్రవరి 19న బీసీ గర్జన • బీసీ ముఖ్యనేతలతో చర్చించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ • బీసీ గర్జనలో స్పష్టమైన బీసీ మేనిఫెస్టో ప్రకటించే అవకాశం? • జయహో సభ వరాలకు దీటుగా వైసీపీ కూడా హామీల వర్షం

చంద్రబాబుతో కోట్ల భేటీ - సైకిల్ ఎక్కడం ఖాయం





కర్నూలు, సూర్య ప్రతినిధి : కర్నూలు జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నేత కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడటం దాదాపు ఖాయమైనట్టు కనిపిస్తోంది. ఇప్పటికే ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన అభిమానుల సమావేశంలో తెలుగుదేశంలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈమేరకు ఆయన ఈభేటీకి తన సతీమణి సుజాతమ్మ, కుమారుడు రాఘవేంద్రలతో కలసి టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును కలిసేందుకు ఉదయమే విజయవాడ బయలు దేరి వెళ్లినా, పోలవరం సమావేశంలో ఉండటంతో రాత్రి 10 గంటలకు కలిసారు. పార్టీలో చేరికకు తెలుగుదేశం పార్టీ నుంచి సమ్మతి ఉన్నప్పటికీ తనకు కర్నూలు ఎంపీ స్థానంతో పాటు డోన్, ఆలూరు శాసనసభ స్థానాలను తన వర్గానికి కేటాయించాల్సిందిగా సూర్యప్రకాశ్‌రెడ్డి కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సిఎం ఏం చెప్పారన్నదానిపై స్పష్టత లేదు.

అయితే కోట్ల చేరికపై తనకు ఎలాంటి సమాచారం లేదని తెలుగుదేశం సీనియర్ నేత ఉపముఖ్యమంత్రి కెయి కృష్ణమూర్తి మీడియాకు చెప్పడం విశేషం.

ఇప్పటికే కోట్ల కుటుంబం టీడీపీలో చేరికను హర్షిస్తు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు యువజన కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

జయహోకు దీటుగా బీసీ గర్జన

• వైసీపీ నాయకత్వం కసరత్తు • ఫిబ్రవరి 19న బీసీ గర్జన జయహోకు దీటుగా బల ప్రదర్శన • బీసీ ముఖ్యనేతలతో చర్చించిన వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ • బీసీ గర్జనలో స్పష్టమైన బీసీ మేనిఫెస్టో ప్రకటించే అవకాశం? • జయహో సభ వరాలకు దీటుగా వైసీపీ కూడా హామీల వర్షం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: అధికార టీడీపీ నాయకత్వం రాజమండ్రిలో జయహో బీసీ సభను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో బీసీలకు సీఎం చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ సోమవారంనాడు బీసీ నేతలతో సమావేశమయ్యారు. హైదరాబాద్ లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీకి బొత్స సత్యనారాయణ, జోగి రమేశ్, పార్థసారథి, జంగా కృష్ణమూర్తి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పేర్ని నాని తదితర బీసీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యనేతలతో చర్చించిన వై.ఎస్.జగన్ వచ్చే నెల 19వ తేదీన బీసీ గర్జనను నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే వైసీపీ నియమించిన బీసీ అధ్యయన కమిటీ గత 6 నెలలుగా రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా పలు నిర్ణయాలు తీసుకుంటారని సమాచారం. ఈ బీసీ గర్జన సదస్సులో చంద్రబాబు హామీలకు కౌంటర్ గా పలు ఆకర్షణీయమైన పథకాలను జగన్ ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న ఆంధ్రప్రదేశ్‌లో బీసీ గర్జన నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ బీసీ అధ్యయన కమిటీ చైర్మన్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో భేటీ అనంతరం పలు కీలక విషయాలు మీడియాకు వెల్లడించారు. సోమవారం హైదరాబాద్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఈ గర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీసీ కులాల స్థితిగతులను, జీవన ప్రమాణాలను తెలుసుకునే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏడాదిన్నర క్రితం బీసీ అధ్యయన కమిటీ నియమించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ అధ్యయన సమావేశాలు నిర్వహించామని, అధ్యయన కమిటీ ద్వారా అనేక అంశాలతో కూడిన నివేదికను సోమవారం వైఎస్ జగన్‌కు అందజేశామని పేర్కొన్నారు. వాటి గురించి వైఎస్ జగన్ పూర్తి స్థాయిలో సమీక్షించారని తెలిపారు.

నవరత్నాలు కాపీ కొడుతున్నారు : వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలను కాపీ కొట్టి చంద్రబాబు వాటినే మళ్లీ కొత్తగా చెబుతున్నారని కృష్ణమూర్తి మండిపడ్డారు. 2014 మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను టీడీపీ ఏమేరకు అమలు చేసిందని ప్రశ్నించారు. టీడీపీ నేతలు బీసీలను అణగదొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను ప్రలోభ పెట్టి, వారి ఓట్లు వేయించుకుని చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. బీసీ న్యాయవాదులను న్యాయమూర్తులు కాకుండా అడ్డుకున్నది చంద్రబాబేనని, ఈ విషయాన్ని స్వయంగా జస్టిస్ ఈశ్వరయ్య చెప్పారని పేర్కొన్నారు. బీసీలకు అన్ని విధాలా అన్యాయం చేసిన చంద్రబాబుకు జయహో బీసీ అనే అర్హత లేదని విమర్శించారు. తమ అధ్యయనంలో భాగంగా సంచార జాతులను కూడా కలిశామని. కొంత మంది బీసీలకు తమ కులం ఏమిటో కూడా స్పష్టంగా తెలియదనడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

ఓట్లు కొల్లగొట్టాలనే ఆలోచన తప్ప బీసీల పట్ల చంద్రబాబుకు ప్రేమ లేదని వై సీపీ నేత కొలుసు పార్థసారథి విమర్శించారు. మెడికల్ సీట్ల



విషయంలో బీసీలు నష్టపోతున్నా టీడీపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఒక్కమాట కూడా మాట్లాడని చంద్రబాబు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రతి కాబినెట్ మీటింగ్‌లో భూములు, ఇసుక గురించి చర్చించారు. ఒక్క బీసీకైనా ఎకరా భూమి కేటాయించారా అని ప్రశ్నించారు. బీసీల జీవితాలు మార్చడానికి చంద్రబాబు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఫెడరల్ ఫ్రంట్ విషయమై కేటీఆర్. జగన్‌ని కలిస్తే నిస్సిగ్గుగా చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ పథకాలనే కాపీ కొడుతున్న చంద్రబాబుకు అసలు సిగ్గుందా అంటూ ధ్వజమెత్తారు.

ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నా



తూర్పు గోదావరి, మేజర్‌న్యూస్:తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. సోమవారం ఆయన అన్నవరంలో మీడియాతో మాట్లాడుతూ బీసీ సభలు పెట్టి బీసీలకు అది చేస్తాను, ఇది చేస్తాను అంటున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటిసారిగా బీసీ వ్యక్తి ప్రధానమంత్రి అయితే అతన్ని దింపుతానంటూ తిరుగుతున్నాడని మండిపడ్డారు. తెలంగాణ వెళ్లి తాను లేఖ ఇవ్వటం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అక్కడ మాట్లాడి, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాష్ట్రాన్ని అన్యాయంగా విడదీశారంటు చంద్రబాబు వ్యాఖ్యానిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తనజీవితంలో ప్రాంతీయ పార్టీ (తెలుగుదేశం) పెట్టి పెద్ద తప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ మేనిఫెస్టోలో హోదా హామీ ఉంది



విజయవాడ, మేజర్‌న్యూస్ః ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా 10 సంవత్సరాలు ఇస్తామని బీజేపీ మేనిఫెస్టోలో ఉందని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ విషయంలో అందరికన్నా ఎక్కువగా వెంకయ్యనాయుడు మాట్లాడారని అన్నారు. ఈ విషయాలన్నీ మర్చిపోయి అసలు బీజేపీ మేనిఫెస్టోలో హోదా విషయమే లేదనీ, మోదీ ఎలాంటి హామీ ఇవ్వలేదని ఏపీ బీజేపీ చీఫ్ కన్నా లక్ష్మీనారాయణ చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో అధికారం అనుభవించిన కన్నా ఇప్పుడు బీజేపీలో చేరి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏపీని దోచుకున్నవారికి చంద్రబాబు మద్దతు ఇస్తున్నారని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ వైద్య రంగాన్ని చంద్రబాబు కార్పొరేట్ పరం చేశారని విమర్శించారు. ఏపీలో ఎన్నడూ లేనంత అవినీతి ప్రస్తుతం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఈ లంచగొండి ప్రభుత్వం పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఏపీ ప్రతిపక్ష నేత జగన్ అధికారంలోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు కేటాయించిన రూ.350 కోట్ల నిధులను కేంద్రం వెనక్కు తీసుకోవడంతో పాటు గత రెండేళ్లుగా ఈ నిధులను మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీకి రూ.16 వేల కోట్ల సాయం చేయాల్సి ఉండగా, రూ.3 వేల కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని పేర్కొన్నారు.

మరోసారి తెరపైకి ప్రత్యేక హోదా



• నేడు ఉండవల్లి ఆధ్వర్యంలో అఖిల పక్షం • హాజరుకానున్న టీడీపీ ప్రతినిధులు • రేపు టీడీపీ నాయకత్వంలో సమావేశం • ఫిబ్రవరి ఒకటిన సమితి బంద్

విజయవాడ, సూర్య ప్రతినిధి: ప్రత్యేక హోదా... ఇది నవ్యాంధ్ర ప్రదేశ్ తీరని కోరిక. ఈ హామీ నెరవేర్చని కారణంగానే ఎన్డీయే నుంచి తెలుగుదేశం పార్టీ బయటకొచ్చింది. బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శిస్తున్నారు. ఎన్నికలు దగ్గరకొస్తున్న కొద్దీ మళ్ళీ రాష్ట్రంలో ప్రత్యేక హోదా వేడి రాజుకుంది. రావాల్సిన విభజన హామీల సాధనపై డిమాండ్లు పెరుగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు భాజపా నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం సిద్ధమవుతోంది. సాధారణ ఎన్నికలు దగ్గరకొచ్చేస్తున్నాయి. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీలకు ఇంతకంటే చక్కని అవకాశమేముంటుంది.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలు తదితర అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రేపు అంటే బుధవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటవుతోంది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఈ అంశంపై సమావేశమయ్యారు. తాజా సమావేశం మూడోది అవుతుంది. కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న తరుణంలో తదుపరి వ్యూహం ఎలా అనుసరించాలనే దానిపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అన్ని రాజకీయ పక్షాలతో పాటు ప్రత్యేక హోదా, విభజన సమస్యలపై పోరాడే వివిధ సంఘాలను కూడా ఈ సమావేశాలకు పిలవనున్నారు. ఇదే అంశంపై మంగళవారం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విజయవాడలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటవుతోంది. దీనికి ప్రభుత్వం తెదేపా తరవున మంత్రులు సోమిరెడ్డి, నక్కా ఆనంద్ బాబు, ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు హాజరుకానున్నారు. మరోవైపు ఫిబ్రవరి 1న ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర బంద్‌కు పిలుపిచ్చింది. ఈ బంద్‌కు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు పలికారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ఏకమై ఒకే గొంతుకను వినిపిద్దామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పిలుపిచ్చారు. హోదా సాధన కోసం చివరి అస్త్రంగా గట్టిగా ఉద్యమిద్దామని, దీనికి అన్ని రాజకీయ పక్షాలు కలిసి రావాలని గుంటూరులో ఆదివారం నిర్వహించిన జనసేన శంఖారావం సభ వేదికగా పిలుపునిచ్చారు. దీంతో రానున్న రోజుల్లో హోదా, విభజన హామీల అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరగనుంది.

తొలి కియా కారును విడుదల చేయనున్న సీఎం



అనంతవురం, సూర్య ప్రతినిధి : పెనుకొండ మండలం, అమ్మవారి పల్లి దగ్గర ప్రతిష్టత్మకంగా ఏర్పాటైన కియా పరిశ్రమలో తయారైన మొట్ట మొదటి కారుయల్ రన్‌కు సిద్ధమైంది. మంగళ వారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కియా కారును లాంచ్ చేయనున్నారు. ఈ మేరకు కారు తుది మెరుగులు దిద్దుకుంటోంది. ప్రతి ఆరు నెలలకు ఓ కొత్త మోడల్ కారును మార్కెట్‌లోకి విడు దల చేసేలా కియా కంపెనీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకు అనుగుణంగా అత్యాధునిక రోబోటెక్ టెక్నాలజీతో యంత్రాలను ఏర్పాటు చేశారు. అనంతవురం కార్మి కులు బిగించిన కియా తొలి కారును చంద్రబాబు విడుదల చేసి స్వయంగా నడువుతారు.

అగ్రకులాల రిజర్వేషన్లను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిల్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య సోమవారం సుప్రీంకోర్టు లో కేసు వేశారు. ఈ సందర్బంగా ఆయన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదు.ఆర్థికాభివృద్ధి పథకం అంతకంటే కాదు. అగ్రకులాలోని పేదరికానికి అభివృద్ధి పరచాలంటే ఆర్థిక పరమైన స్కీములు, పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి పరచాలి. అంతే గాని రిజర్వేషన్ల వలన పేదరికం నిర్మూలించలేమని తెలిపారు. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టడానికి రెండు సిద్ధాంత ప్రతిపాదకలు ఉన్నవి 1). సామాజిక వెనుకబాటుతనం. పేద కులాలు అస్పృశ్యత అంటరానితనం, సాంఘిక వివక్షతకు గురవుతున్న కులాలకు రిజర్వేషన్లు కల్పించాలి. (2) విద్యా, ఉద్యోగా, పాలన రంగంలో ప్రాతినిధ్యం లేని కులాలను గుర్తించి వారికి ప్రాతినిథ్యం కల్పించడం. ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి, ప్రతి వర్గానికీ ఈ సమాజాన్ని నడపడంలో ముఖ్యంగా ప్రభుత్వ పాలనలో, అధికారంలో ఆయా కులాల జనాభా ప్రకారం వాటా ఇచ్చి భాగస్వామ్యం కల్పించడం. ఈ రెండు ప్రతిపాదకల్లో రిజర్వేషన్ లో పెట్టారు తప్ప ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి రిజర్వేషన్లు పెట్టలేదు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదు. పేదకులాల అభివృద్ధికి ఆర్థికపరమైన సంక్షేమ పథకాలు సరిపోతాయి. కానీ ఆత్మగౌరవానికి, సామాజిక హోదా పెంచడానికి అధికారం కోసం రిజర్వేషన్లు కావాలి. అసలు అగ్ర కులాలలోని పేదవారికి రిజర్వేషన్లు పెట్టడానికి సరయైన ప్రతిపాదికే లేదు. ముఖ్యంగా అంటరానితనం సామాజిక వెనుకబడినతనం, నిరక్షరాస్యత, విద్యారంగంలో వెనుకబడినతనం- కులాన్ని తక్కువ చూపు చూడడం లాంటి లక్షణాలు ఉన్నవారికి ఈ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. అనేక మంది సామాజిక వేత్తలు, బి.సి కమిషన్లు, సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తుల తీర్పులలో కూడా సామాజిక వెనుకబడిన తనాన్నే ప్రతిపాదిక రిజర్వేషన్లు పెట్టాలని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగాలలో, ప్రభుత్వాదికార పదవులలో, విద్యాసంస్థలలో ప్రాతినిథ్యం లేని కులాలకు వారి జనభా ప్రకారం ప్రాతినిథ్యం కల్పించడానికి రిజర్వేషన్లు పెట్టాలనేది మరో లక్ష్యం. అగ్రకులాలు 64 శాతం ఉద్యోగులు ఉన్నట్లు తెలిది. 15 శాతం జనాభా ఉన్న అగ్రకులాలకు 64 శాతం ఉద్యోగులుంటే ఇంకా వీరికి రిజర్వేషన్లా. అగ్ర కులాలకు ఉద్యోగాలలో వారి జనాభాకు మించి 5 నుంచి 6 రెట్ల వరకు ప్రాతినిథ్యం కల్పించబడింది. ప్రభుత్వ గణాంకా వివరాలే ఈ వాస్తవాలను తెలుపుతాయి.

ఏపీలో అమిత్‌షా బస్సు యాత్ర

• పాల్గొననున్న జాతీయ అధ్యక్షుడు అమిత్ షా • ఫిబ్రవరి 4 న పలాస నుంచి ప్రారంభం • శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రారంభం,కర్నూలు జిల్లా ఆదోనిలో ముగింపు • ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



గుంటూరు,సూర్యబ్యూరో: ఏపీలో ఎన్నికలు దగ్గరపడుతుండటంతో తమ సత్తా ఏంటో చూపడానికి కమలనాథులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు, కార్యకర్తలతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఏపీ వ్యాప్తంగా బస్సు యాత్ర చేయాలని కమలనాథులు సిద్ధమయ్యారు. ఈ యాత్రకు ఏపీ బీజేపీ నేతలతో పాటు జాతీయస్థాయి నేతలు కూడా రానున్నారు. కాగా ఫిబ్రవరి 4న పలాసలో బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా బస్సుయాత్రను ప్రారంభించనున్నారు. బస్సుయాత్ర శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రారంభమై కర్నూలు జిల్లా ఆదోనిలో ముగియనుంది. కాగా ఈ యాత్ర నిర్వహణకు 8 కమిటీలను ఏర్పాటు చేసినట్లు బీజేపీ నేతలు తెలిపారు. 15రోజుల్లో 85 నియోజకవర్గాల మీదగా కొనసాగనున్న బస్సుయాత్ర సాగనుంది. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, కేంద్రం సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బస్సుయాత్ర సాగనున్నట్లు కమలనాథులు చెబుతున్నారు. బస్సుయాత్రలో భాగంగా జిల్లా కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని ఏపీ బీజేపీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక్కో కేంద్ర మంత్రులు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధిష్టానం చెబుతోంది. యాత్రను విజయవంతం చేసేందుకు జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జులతో కన్నా సమావేశమై వివరాలు వెల్లడించారు. ఈయాత్రకు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు తురగ నాగభూషణం యాత్ర ప్రముఖ్‌గా వ్యవహరిస్తారు. కంట్రోల్ రూమ్ ఇంచార్జీగా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్, యాత్ర సహా ప్రముఖ్,రూట్ ఇంచార్జీ, బహిరంగసభల నిర్వహణ, రాష్ట్ర కార్యదర్శి అడపా శివవాగేంద్రరావు, కొలా ఆనంద్, శశిభూషన్‌రెడ్డి, ప్రదాన కార్యాలయం ఇన్ చార్జీ వామరాజు, సత్యమూర్తి, బహిరంగ సభ ల వ్యవహారాలు శ్రీనివాసరాజు, పబ్లిసిటీ సునీల్‌ఇస్కా, యాత్ర సభ్యుల బస యళ్ల దొరబాబు, భోజనసదుపాయం,రామచంద్రబరాజు,ఆర్థికవ్యవ హారాలు,పకలపాటి సన్యాసిరాజు,తదితరులను నియమించి మీడియాకు విడుదల చేశారని రాష్ట్ర సెల కన్వీనర్ గంగాధర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించిన రాజాసింగ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ అసెంబ్లీలో ఏకైక బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గోసంరక్షణ కార్యక్రమాల్లో చాలా చురుకుగా ఉంటారనే విషయం తెలిసిందే. తాజాగా కబేళాకు అక్రమంగా తరలిస్తున్న 100 ఆవులను ఆయన కాపాడారు. సోమవారం ఉదయం గోవులను వ్యానులో కబేళాకు అక్రమంగా తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజాసింగ్... క్షణం కూడా ఆలస్యం చేయకుండా వ్యానును వెంబడించారు. హైదరాబాద్ సమీపంలోని షామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యానును అడ్డుకున్నారు. వ్యానుపైకి ఎక్కి ఆవులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ, ఆవులను చంపడం హిందూ ధర్మం కాదని, వాటిన రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

అత్యాధునిక హంగులతో జనసేన ప్రచార రథాలు


• 17 ప్రచార రథాలను ప్రారంభించిన పవన్ కల్యాణ్ • పార్టీ గుర్తు, సిద్ధాంతాలు, మ్యానిఫెస్టో ఊరూరా ప్రచారం





గుంటూరు : జనసేన పార్టీ గుర్తు, సిద్ధాంతాలు, మ్యానిఫెస్టోకు ప్రజలలో మరింత విస్తృత ప్రచారం కల్పించేలా ప్రచార రథాలను జనజేన పార్టీ సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రరం చేసేందుకు ఏర్పాటు చేసిన 17 ప్రచార రథాలను జనజేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పూజ కార్యక్రమాలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. ప్రతి ప్రచార రథం రోజుకు 10 గ్రామాల్లో అంటే మొత్తం 17 ప్రచార రథాలు రోజుకు 170 గ్రామాల్లో పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టో ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇంకా 17 రథాలు సిద్ధం అవుతున్నాయి. ప్రచారంలో భాగంగా పార్టీ గుర్తు గాజు గ్లాస్‌తో ప్రజల టీ ఇవ్వడంతో పాటు సభ్యత్వ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ప్రచార రథాల్లో అమర్చిన ఎల్ఈడీల ద్వారా వోటర్లను ఆకట్టుకునే విధంగా రోజుకు రెండు మెయిన్ సెంటర్లలో పవన్ కల్యాణ్ ప్రసంగాలు ప్రసారం చేయనున్నారు. పార్టీ గుర్తు, పార్టీ సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ప్రసంగాలను ఊరూరా ప్రచారం చేస్తూ ప్రజలకు పార్టీ గుర్తు గాజు గ్లాస్ గుర్తుండిపోయేలా చేయనున్నాయి. అలాగే ప్రచార రథాలపై పార్టీ సిద్ధాంతాలు, గాజు గ్లాస్ గుర్తుకే వోటు వేయాలనే నినాదాలతో పాటు పార్టీ మ్యానిఫెస్టోలోని కొన్ని హామీలను ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేశారు.

దగ్గుబాటి మారని పార్టీలు లేవు



(వెలగపూడి సూర్య ప్రధాన ప్రతినిధి) : అధికారం కోసమే దగ్గుబాటి కుటుంబం వైసీపీలో చేరుతోందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. దగ్గుబాటి మారని పార్టీలు లేవన్న ఆయన, ఆర్ఎస్ఎస్‌తోపాటు అన్నిపార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో పురందేశ్వరి కేంద్రమంత్రి అయితే దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆ తర్వాత కాంగ్రెస్‌ను వదిలేసి బీజేపీలో చేరారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ వైసీపీలో చేరుతున్నారన్నారు. వీళ్ల ఫిరాయింపులన్నీ అధికారం కోసమేనని చంద్రబాబు మండిపడ్డారు. లక్ష్మీపార్వతి కూడా అందుకే ఆ పార్టీతో కుమ్మక్కయ్యారని చంద్రబాబు దుయ్యబట్టారు. అవకాశవాదంతోనే ఆనాడు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ను వాడుకున్నారని, దాంతోనే ఆయనకు అప్రతిష్ఠ తీసుకొచ్చారని తీవ్రస్థాయిలో విమర్శించారు. అలాంటి వాళ్లందరూ ఇప్పుడు ఒక చోటికే చేరారన్నారు. వాళ్ల డొల్లతనాన్ని ప్రజల్లో ఎండగట్టాలని నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎలక్షన్ మిషన్ 2019పై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

జయహో బీసీ సభ 'మూడ్‌ఆఫ్ ది స్టేట్'కు నిదర్శనం...

రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన "జయహో బీసీ" చరిత్రాత్మక సభ అని చంద్రబాబు అన్నారు. ఆ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. జయహో బీసీ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సభలో బీసీలకు ఇచ్చిన హామీలను విస్త తంగా ప్రచారం చేయాలని నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. బీసీ హామీలన్నింటినీ ఫ్లెక్సీలతో ప్రచారం చేయాలని సూచించారు. ఈ వారం రోజులు దీనిపై ఉద్ధ తంగా ప్రచారం నిర్వహించాలని నేతలకు పిలువునిచ్చారు. రాజమండ్రి సభ "మూడ్ఆ ఆఫ్ ది స్టేట్"కు నిదర్శనమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెదేపా గెలువు ఏకపక్షం కానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



ఎన్నికల పిటిషన్లు : హైకోర్టు కీలక నిర్ణయం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అక్రమాలకు పాల్పడ్డారంటూ, పోలింగ్‌కు కౌంటింగ్‌కు మధ్య ఓట్ల శాతం భారీగా వ్యత్యాసం ఉందని, దీంతో టీఆర్ఎస్ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలంటూ కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్స్‌పై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. తమపై గెలుపొందిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ 12 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, ఒక టీడీపీ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. .కొడంగల్ అధికార పార్టీ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డి ఎన్నికల నియమావాలిని ఉల్లంఘించారని, ఎన్నికల్లో రూ. 6.5 కోట్లు ఖర్చు చేసినట్లు డైరీ దొరికిందని కాంగ్రెస్‌నేత రేవంత్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. ధర్మపురి టీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికను రద్దు చేయాలని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిటిషన్ వేసారు. కొంత మంది అధికారులు కొప్పుల ఈశ్వర్‌తో కుమ్మక్కై ఈవీఎంల టాంపరింగ్ చేశారని, ఈవీఎంలు భద్రపరిచిన గదులకు కనీసం సీల్ కూడా వేయలదని, భద్రతను గాలి కొదిలేశారని పిటిషన్‌లో పేర్కొ న్నారు. ఎన్నికల జరిగిన 45 రోజులు లోపు మాత్రమే కోర్టును ఆశ్రయించే అవ కాశం ఉండడంతో కాంగ్రెస్ నేతలు డీకే అరుణ, దాసోసు శ్రవణ్ కుమార్, నాగం జనార్దన్ రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ , పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, ఫిరోజ్ ఖాన్ ,టీడీపీ అభ్యర్థి చంద్ర శేఖర్‌లు పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే!.

జనసేనలో హైటెన్షన్

- పార్లమెంటరీ కమిటీల కూర్పు
- కమిటీల్లో చోటు కోసం ఆత్రుత
- త్వరలోనే కీలక ప్రకటన చేయనున్న పవన్

అమరావతి,సూర్యబ్యూరో:: జన సైన్యంలో ఎనలేని ఉత్కంఠ, రాబోయే కమిటీలో తమకు స్థానం దక్కుతుందా, లేదా అనే అనుమానం. ఏ పరిస్థితుల్లోనూ సామాజిక వర్గాల వారీగా చోటు ఖాయమంటూ మరికొంత ధీమా. జనసేనాధిపతి అన్నీ పరిశీలించిన తరువాతే జాబితాలో అర్హులకే అవకాశం ఇస్తారంటూ ఇప్పటి నుంచే ఇంకొందరి ఊరడింపు. ఈ కమిటీల్లో మహిళలకు అవకాశం ఇస్తారా అంటూ ప్రశ్నలు. ఇవన్నీ ఎందుకంటే రాబోయే జనసేన పార్లమెంటరీ కమిటీల్లో చోటు కోసం. సరాసరిన పార్లమెంటరీ కమిటీలో 25 మందికి తగ్గకుండా అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఈ మధ్యన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జిల్లా నేతలతో జనసేనాధిపతి పవన్ తాజా రాజకీయ పరిస్థితులపై విడివిడిగా చర్చించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీపరంగా ఎలా ముందడుగు వేయాలో హాజరైన వారందరికీ అర్ధమయ్యే రీతిలో స్థూలంగా చెప్పారు. అడుగు ముందుకే మడమ తిప్పేదిలేదంటూ పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. కలిసికట్టుగా సాగాల్సిందిగా కేడర్‌కు ముందస్తు పాఠం చెప్పారు. పనిలో పనిగా త్వరలోనే పార్లమెంటరీ కమిటీలు వేయబోతున్నట్టు వెల్లడించారు. ఇక అప్పటి నుంచి జనసైన్యంలో ఎనలేని ఉత్కంఠ, చర్చోప చర్చలు మొదలైనవి. సామాజిక వర్గాల వారీగా ఎవరికి అవకాశం లభించనుందోనని అంచనాలు. ముందు సంస్థాగతంగా బలపడాలి. కేడర్ సిద్ధాంతపరమైన అంశాలను వంటపట్టించుకోవాలని నలు దిక్కులకు చేర్చాలి. ప్రజలను సమ్మోహితం చేయాలి. అర్ధమయ్యే భాషలో అందరికీ వివరించాలి. పార్టీ అసలుసిసలైన వైఖరి ఏమిటనే అనుమానంతో ఉన్న వారిని సమాధానపర్చాలని జనసేన అధినేత పేర్కొన్నట్లు సమాచారం. స్పష్టమైన వైఖరిని ప్రతిబింబించాలి. రాబోయే ఎన్నికల్లో మార్పు దిశగా జనం అడుగులు కదిపేలా జనసైన్యం ఊరూరా తిరగాలి. గడపగడపకు ప్రచారం చేయాలని అంతకంటే మించి పార్టీ బలపడేందుకు అన్ని వర్గాల మద్ధతును కూడగట్టుకోవాలని కార్యకర్తలకు తెలిపారు. గడిచిన కొన్నాళ్ళుగా జనసేన ధోరణి ఇది. మరి ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఉండవా, కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పటిష్ఠ బాధ్యతలు ఎవరికీ ఉండవా.. ఈ ప్రశ్నలకు ఈ మధ్యనే జనసేనాధిపతి పవన్‌కల్యాణ్ ఎవరూ ఊహించని విధంగా సరికొత్త కార్యాచరణ ప్రకటించారు. ప్రతీ పార్లమెంటు స్థానానికి ఒక కమిటీని నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఇదే జనసేన నేతల్లో సరికొత్త ఆశలు రేపింది. రాబోయే ఎన్నికల్లో పోటీకి ఆసక్తిని పెంచింది. జిల్లాస్థాయిలో ఎదగాలన్న కాంక్షను రేపింది. అంతకంటే మించి పార్టీకి క్షేత్రస్థాయిలో మరింత బలం చేకూరేలా పని చేసేందుకు వీలు ఉంటుందని ధైర్యాన్ని నింపింది. ఇక్కడితో ఆగకుండా పార్టీలో కాస్తంత పేరొందిన నాయకులంతా రాబోయే కమిటీలో చోటు కోసం ఉవ్విళ్ళూరుతున్నారు. సంక్రాంతి పండగకు ముందే ఈ కమిటీ కూర్పు పూర్తవుతుందని అధికారికంగా ప్రకటిస్తారని అంచనా వేసినా సాధ్యం కాలేదు. ప్రతీ కమిటీలోనూ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరేసి చొప్పున ప్రాతినిధ్యం కలిగేలా చూసేందుకు అంతర్గతంగా ముమ్మర కసరత్తు సాగుతుంది. వాస్తవానికి ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇద్దరి కంటే మించి ఆశావహులు ఉన్నారు. పార్లమెంటరీ స్థాయిలో ఇప్పటిదాకా ఎవరి పేరు ప్రతిపాదన స్థాయి వరకు రాలేదు. ఉదాహరణకు నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో ఆశావహుల సంఖ్య అత్యధికంగా ఉంది. ఇదే నియోజకవర్గం నుంచి ఉభయ గోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ కలవకొలను తులసీరావు అన్నారు. రాజకీయాల్లో ఆరితేరిన తులసీరావు పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధంగా ఉన్నారు. కాని ఇదే తరుణంలో మరో నలుగురు కూడా పోటీకి దిగుతుండడంతో పార్టీలోనూ కాస్తంత ఆసక్తి పెరిగింది. ఇదే తరుణంలో ఏలూరు వంటి నియోజకవర్గంలో కూడా జనసేన నేతల మధ్య పోటీ ఉధృతంగానే ఉంది. వీరి మధ్యన అంతర్గత కలహాలు రేగడంతో కొన్నాళ్ళ క్రితం పార్టీ సీనియర్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అధిష్టానం దృష్టికి అసలు విషయం వెళ్ళింది. కొంత సర్దుబాటు చేసినా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని చెబుతున్నారు. భీమవరం నుంచి యర్రింకి సూర్యారావు, ఆచంట నుంచి మల్లినీడి బాబీ, తాడేపల్లిగూడెం నుంచి యర్రా నవీన్ వంటి వారు పార్టీలో పూర్తి స్థాయి ప్రాధాన్యత ఆశిస్తున్నారు. ఇప్పటికే అప్పగించిన బాధ్యతను వీరంతా పట్టుదలతో నిర్వర్తిస్తున్నారు. వీరికి పార్లమెంటరీ కమిటీల్లో స్థానం కల్పించవచ్చుని భావిస్తున్నారు. పార్లమెంటరీ కమిటీల్లో చోటు దక్కిన వారికే అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తారన్న ప్రచారం కాస్తా పార్టీలో ఉత్కంఠ రేపింది. దీనికనుగుణంగానే అందరి దృష్టి పార్లమెంటరీ కమిటీలపై పడింది. సభ్యుల సంఖ్య పాతిక వరకు ఉండేటట్టు మరోవైపు ప్రచారం జరుగుతుండగా, ప్రస్తుత పరిస్థితుల్లో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా మిగతా వాటిలో ఇద్దరేసి పేర్లకు తగ్గకుండా ప్రతిపాదించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. అందుకనే పార్టీలో ఉన్నవారంతా సాధ్యమైనంత మేర పైకి గుంభనంగానే కనిపిస్తున్నా.. లోలోన ఒకింత హైటెన్షన్‌కు గురవుతున్నారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టిలో తాము ఏ స్థాయిలో ఉన్నది తెలుసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికల్లా ఈ కమిటీలకు తుది రూపు తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.



'వివేక్'కు టీఆర్ఎస్ ఝలక్

- అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనపై ఆరోపణలు
- అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః టీఆర్ ఎస్ పార్టీ తెలంగాణలో రెండోసారి అధికారంలోకి వచ్చాక క్రమంగా కొందరి ముఖ్య నేతల ప్రాధాన్యత తగ్గుతూ వస్తుంది. ఇందులో ప్రస్తుతం ప్రముఖంగా వినిపిస్తున్న పేరు వివేక్ దే. తాజాగా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలతో టీఆర్ ఎస్ వివేక్‌ను దూరం చేస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతుంది.

దివంగత గడ్డం వెంకటస్వామి(కాకా) కుటుంబానికి టీఆర్ఎస్‌తో దాదాపు సంబంధాలు తెగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంటే ఆ పార్టీకి చెందిన ముఖ్యనేతలు అవుననే సమాధానం చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్‌లో చేరిన వినోద్ సోదరులు గత అసెంబ్లీ –లోక్‌సభ ఎన్నికల ముందూ తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అప్పట్లో అన్నదమ్ముల్లో ఒకరు అసెంబ్లీకి, మరొకరు వినోద్ పార్లమెంట్‌కు పోటీ చేశారు. అయితే టీఆర్ఎస్ అభ్యర్థుల చేతిలో ఇద్దరు ఓడిపోయారు. కొత కాలం పాటు అలాగే ఉన్న అన్నదమ్ములు రాష్ట్రం ఏర్పాటయ్యాక గడ్డం వినోద్, వివేక్ లు టీఆర్ ఎస్ లో చేరారు. వివేక్‌ను గులాబిదళపతి ప్రభుత్వ సలహాదారుగా(కేబినెట్‌హోదా) నియమించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో వివేక్ సోదరుడు వినోద్‌కు టీఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తన సోదరుడికి ఎన్నికల్లో సహాయం అందజేశారంటూ ఆయనపై అధికార టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు జిల్లాకు చెందిన సీనియర్‌నేతలు బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పాటు సీఎం కేసీఆర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆయన ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఆయన ఉండటమేమిటని, ఆయనను పార్టీ దూరంగా పెట్టిందని రాష్ట్రపార్టీ బాధ్యుడొకరు తెలిపారు.

ఈ నేపథ్యంలో లోక్ సభ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ టికెట్ వివేక్ కు కేటాయించకపోవచ్చనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా కేసీఆర్ చెప్పినా వినిపించుకోకుండా దినపత్రిక స్థాపించడం ఒకటి. ఆ పత్రిక ప్రస్తుతానికి టీఆర్ఎస్ కు అనుకూలంగా ఉన్నా రానున్న రోజుల్లో ఏకు మేకుగా మారుతుందనిసీఎంతో పాటు పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నట్లు సమాచారం.

వినోద్‌ను అపలేకపోయారు...

అంతేకాకుండా టీఆర్ఎస్ పై తిరుగుబావుట ఎగురవేయకుండా తన అన్న వినోద్ ను అడ్డుకోకుండా సహకరించారని కేసీఆర్ ఆగ్రహంతో ఉన్నారని సమాచారం. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి చెన్నూరు బెల్లంపల్లి నియోజకవర్గాల్లో టీఆర్ ఎస్ అభ్యర్థుల ఓటమి కోసం పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధిష్టానం ఆయనకు ఎంపీ టికెట్ కేటాయించకపోవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతుంది.

తాజాగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించే అవకాశం కరీంనగర్ కు చెందిన ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ కు కేసీఆర్ ఇచ్చారు. ఆయనకు ఇప్పటికే కేబినెట్ లో స్థానం కల్పించారనే ప్రచారం జరుగుతోంది. ఆయనకు మంచి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జిల్లాలో వివేక్ ప్రత్యామ్నాయ నేతను తయారు చేసుకుంటున్నారు. తాజా పరిణామాలన్నీ చూస్తుంటే వివేక్ ప్రాధాన్యం టీఆర్ ఎస్ లో రోజురోజుకు తగ్గుతుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వివేక్ తన అన్నలాగా టీఆర్ ఎస్ పై తిరుగుబాటు జెండా ఎగురవేస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరీ వివేక్ టీఆర్ ఎస్ లో కొనసాగుతారా? లేక సొంత గూటికి చేరతారా అనేది పార్లమెంట్ ఎన్నికల వరకు తేలడం ఖాయంగా కనిపిస్తుంది. అంతవరకు వేచి చూడాల్సిందే మరీ..!.

ముగిసిన మూడో విడత

- పంచాయతీ ప్రచారం
- భారీ ఎత్తున ప్రలోభాలు
- 3,529 పంచాయతీలకు 30న పోలింగ్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు ప్రచారం సోమవారం అయిదు గంటలకు ముగిసింది. ఈ నెల 30న జరగనున్న చివరి విడత ఎన్నికలకు ఎన్నికల యంత్రాంగం సమయాత్తమవుతోంది. మొత్తం 12,732 పంచాయతీల్లో ఇప్పటికే రెండు విడతలకు ఎన్నికలు పూర్తవగా.. మిగిలి ఉన్న 4,116 పంచాయతీలు మూడో విడత పోలింగ్‌కు సిద్ధమయ్యాయి. ఇందులో 573 గ్రామాల్లో సర్పంచి పదవులు ఏకగ్రీవం కాగా మిగిలి ఉన్న 3,529 గ్రామాల్లో 30న సర్పంచి ఎన్నిక జరగనుంది. మొత్తం 11,667 మంది అభ్యర్థులు సర్పంచి పదవికి బరిలో నిలిచారు.ఇక ఈ గ్రామాల పరిధిలో మొత్తం 36,729 వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీకాగా.. 8,956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలి ఉన్న 27,583 వార్డులకు గానూ 67,316 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నల్గొండ, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాలలోని మూడు పంచాయతీల పరిధిలో నిలిచిపోయిన పలు వార్డులకు కూడా ఈ నెల 30న ఎన్నికలు నిర్వహించి.. అదే రోజున ఫలితాలు వెల్లడించనున్నారు. దీంతో ఆ గ్రామాల పరిధిలో నిలిచిపోయిన ఉపసర్పంచి ఎన్నికకు మార్గం సుగమమం కానుంది.మూడో విడతలో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లను భారీ ఎత్తున ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఆదాయం ఉన్న పంచాయితీలు, అలాగే హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పంచాయితీల్లో కోట్లు ఖర్చుచేస్తున్నట్లు సమాచారం. కొంత మంది అభ్యర్థులకు తమ గుర్తులను ఓటర్లకు బహుమతిగా అందజేస్తున్నారు. పంచాయితీల్లో అభ్యర్థుల ఖర్చుపై పటిష్టమైన నిఘా ఉంచడంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలమయ్యింది.

పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ, సూర్యప్రధానప్రతినిధిః పోలవరం ఏడు ముంపు మండలాలను ఏపీలో కలుపుతు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయి పిటిషన్‌ను కొట్టివేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. రాజ్యాంగ విరుద్ధంగా 7 మండలాలను ఏపీలో కలిపారని శశిధర్ రెడ్డి తర పు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న అనంతరం ఈ కేసులో జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. 7 మండలాలను ఏపీలో కలుపుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌ను గతేడాది నవంబర్‌లో హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

రైతు కన్నీరు

- ఆకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు
- కల్లాల్లోనే తడిసిన మిర్చి పంట
- వరి, పత్తి, మక్క పంటలకూ నష్టం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః కాలం కాని కాలంలో వర్షాలు పడటంతో రైతన్నకు కన్నీళ్లు మిగిల్చింది. ఆరుగాలం కష్టించి పంట చేతికందే సమయంలో ఆకాల వర్షాలు ముంచెత్తడంతో రైతన్నలను కష్టాల్లో ముంచింది. రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్ని పంటలు దెబ్బ తిన్నాయి. పెట్టిన పెట్టుబడి అంతా నీటి పాలయిందని, తాము కోలుకునేదెలా అంటూ రైతులు కన్నీరుమున్నీరువుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పల్లి పంట వేశారు. అకాల వర్షం కారణంగా సోమవారం వనపర్తి మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టలేదు. అప్పటికే అక్కడ ఉన్న 20వేలకు పైగా పల్లి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. జిల్లాలో సుమారు 3 వేల ఎకరాల్లో పల్లి పంటను పీకి ఆరబెట్టారు. చేలల్లో ఉండగానే వర్షం వల్ల పంటంతా తడిసిపోయింది. నాగర్‌కర్నూల్, షాద్‌నగర్ తదితర మార్కెట్లలో 4,500 కందుల బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలో అకాల వర్షాలకు మిరప, పొగాకు, వరి పంటలు తడిసిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో వేరుశనగ, మిర్చి పంటలు తడిసి ముద్దయ్యాయి.

మిర్చీకి అపార నష్టం : మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, జిల్లాలోని కొన్ని మండలాల్లో కల్లాల్లోనే ఉన్న మిర్చి పంట తడిసి ముద్దయిపోయింది. ఈ జిల్లాలలో కోట్ల విలువైన మిర్చి పంటకు నష్టంవాటిల్లింది. ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, భూపాలపల్లి, వికారాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. మరోవైపు.. టోకెన్లు ఇచ్చి కందులను తూకాలు వేయడంలేదని నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా నర్వ సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. వర్షానికి వందల క్వింటాళ్ల కందులు తడిసిపోవడంతో తమకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్వామీ నీ నెగటీవ్ యాట్టిట్యూడ్ మార్చుకో

- ప్రియాంక రాకతో బీజేపీ నేతల్లో కలవరం
- కాంగ్రెస్ నేత వీహెచ్




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః బీజేపీ సీనియర్‌నేత సుబ్రమణ్యస్వామి తన నెగిటీవ్ యాక్టిట్యూడ్ మార్చుకోవాలని కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావుహితవు పలికారు. నిందించడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం నీ రోగం స్వామీ అని ఆయన మండిపడ్డారు. ప్రియాంక గాంధీకి జబ్బులు ఉన్నాయని విమర్శించిన సుబ్రమణ్యస్వామీకే నెగిటీవ్ యాక్టిట్యూడ్ జబ్బు ఉందని ఆయన విమర్శించారు. స్వామీకి అన్ని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు అని పేర్కొన్నారు. బయట ఉంటే ఏదో ఒక సమస్య తీసుకొస్తాడన్న ఉద్దేశంతోనే సుబ్రమణ్యస్వామీకి నరేంద్రమోడీ రాజ్యసభ సీటును కట్టబెట్టారని వ్యాఖ్యానించారు. అంతేతప్పా స్వామీ పై ప్రేమ ఉండి మోడీ రాజ్యసభ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌కి చేయూతనిచ్చేందుకే ప్రియాంక రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి నెగిటివ్ మనిషి అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. ప్రియాంక రాకతో బీజేపీ నేతలు కలవరపడుతున్నారన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రియాంకా గాంధీ ఎప్పుడైతే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గా నియమింపబడ్డారో అప్పటినుండి బీజేపీ నాయకులు కలవరపడుతున్నారని తెలిపారు.ప్రియాంకకు 'బైపొలార్డ డిసార్డర్' అనే వ్యాధి ఉంది అని సుబ్రమణ్య స్వామి ఆరోపిస్తున్నారు.ఇలాంటి వ్యాధి ఉంటే సంతోషం,కోపం అన్నీ ఎక్కువగా ఉంటాయి అని ఆరోపిస్తున్నాడు. ఒకరు ప్రియాంకా అందంగా ఉంటుంది, చాక్‌లెట్ లాగా ఉంటుంది,తెల్లగా ఉంటుంది అని అంటున్నారని ఇది మంచిది కాదన్నారు. రాహుల్ ఫెయిల్ అయ్యాడు అందుకే ప్రియాంక వచ్చింది అని. ఇప్పుడు వ్యాధి ఉంది అని కూడా అంటున్నారని విమర్శించారు.రాహుల్ కు చేయూత నివ్వడానికి ప్రియాంక రాజకీయాల్లోకి వచ్చిందని వీహెచ్ తెలిపారు ప్రియాంక ప్రజలకు మంచి సేవ చేస్తారన్నారు.సుబ్రమణ్య స్వామి నెగిటివ్ మనిషి.బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తారంటూ ఆరోపించారు. ఇంతకు ముందు జయలలిత వెంట ఉన్నారు,తరువాత ఆమె పైనే కేసులు వేశారని అలాంటి వ్యక్తిని పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు.రాజకీయాలలో వ్యక్తిగతంగా విమర్శలు మానుకోవాలని వీహెచ్ హితవుపలికారు. ఇకనైనా బీజేపీ నాయకులు హుందా రాజకీయాలు చేయాలని ఆయన కోరారు. ఇందిరా గాంధీలా ప్రియాంక గాంధీ బడుగు, బలహీనవర్గాల పక్షాన నిలిచేందుకే వచ్చారని పేర్కొన్నారు.

కృష్ణారావుకు సాహిత్య అకాడమీ అవార్డు : సీఎం హర్షం




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః పాలమూరు జిల్లాకు చెందిన అప్పరసు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడంపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. అప్పరసు కృష్ణారావు పాత్రికేయ వృత్తిలో, సాహిత్య రంగంలో మరింత ఎదిగి రాష్ట్రానికి పేరు తేవాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. అప్పరసు కృష్ణారావు పాత్రికేయుడు, కవి, రచయితగా సేవలందించారు.

హెచ్ఎండీఏ కమిషనర్ జనార్ధన్ రెడ్డి బదిలీ




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కమిషనర్ బి.జనార్ధన్ రెడ్డిపై బదిలీ వేటు పడింది. సోమవారం ఉదయం ఆయనను తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది. హెచ్ఎండీఏ కమిషనర్‌గా మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం జనార్ధన్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన పర్యటన నుంచి రాగానే సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్‌చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అంతకు ముందు ఆయన జీహెచ్ఎంసీ కమీషనర్‌గా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను అక్కడి నుంచి ముందగానే బదిలీ చేసి హెచ్ఎండీఏ కమీషనర్‌గా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే!.

ఆపరేషన్ స్మైల్ ద్వారా 325 మంది పిల్లల్ని రక్షించాం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం చాలా మంచి ఫలితాలిస్తుందని హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ అంజనీ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనవరి1, 2019 నుంచి ఆపరేష్ స్మైల్ నిర్వహిసున్నామని తెలిపారు. తప్పిపోయిన పిల్లల్ని ట్రేస్ చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. దీని కోసం అడిషనల్ సీపీ క్రైం నేతృత్వంలోని 17 బృందాలు పాల్గొన్నాయి అని తెలిపారు.అంతేకాక ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఇప్పటివరకూ 325 మంది చిన్నారులను కాపాడినట్లు తెలిపారు. వీరిలో 11 మంది బాలికలు ఉన్నారని వివరించారు. ఇలా కాపాడిన పిల్లల్లో 272 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించాము. 53 మందిని రెస్క్యూ హోమ్‌లో చేర్పించామని తెలిపారు. దర్పణ్ అనే ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా ఈ పిల్లలను కనిపెట్టగలిగినట్లుగా సీపీ చెప్పారు. అంతేకాక చిన్నారుల చేత పనులు చేయిస్తున్న 14 మంది మీద కేసులు నమోదు చేశామని తెలిపారు.మా పిల్లల్ని క్షేమంగా మా వద్దకు చేర్చిన హైదరాబాద్ పోలీసులకు రుణపడి ఉంటామంటూ పిల్లల తల్లిదండ్రులు పోలీసులను కొనియాడుతున్నారు. మా పిల్లల కోసం ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నాం. మాయమాటలు చెప్పి పిల్లల్ని తీసుకెళ్లి వారిని బాలకార్మికులుగా మారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వీరిని కఠినంగా శిక్షించాలని బాధిత పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నేడు దక్షిణాది కిషాన్ కాంగ్రెస్ సమావేశం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః దక్షిణాది కిసాన్ కాంగ్రెస్ సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కిషాన్‌కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం గాంధీభవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కిసాన్ కాంగ్రెస్ నాయకులు హాజరు అవుతారన్నారు. రాహుల్ గాంధీ ఏఐసీసీ అధ్యక్ష్యుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సమావేశమన్నారు. ఈ సమావేశంలో మొత్తం రైతుల సంక్షేమం, అభివృద్ధిపైనే ఉంటుందన్నారు. రైతులకు ఏవిధమైన మేలు చేయాలి అనే విషయంపై రాహుల్ ప్రత్యేక దృష్టి పెట్టారని అందుకనుగుణంగా సమావేశంలో తీర్మాణాలుంటాయన్నారు.వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ కిసాన్ కాంగ్రెస్ కు బాధ్యతలు అప్పజెప్పారని తెలిపారు. ఎన్నికల ముందు మోడీ అనేక వాగ్దానాలు ఇచ్చారు కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. పసల్ భీమా యోజనలో మార్పులు చేశారు,కానీ ఇన్సూరెన్స్ విషయంలో ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు పంటకాలం అంచనా వేసేవారు దానివల్ల రైతు కష్ట నష్టాలపై అంచనా ఉండేది. రైతుల ఆత్మహత్యలు దేశంలో పెరిగిపోయాయి. భూసేకరణ చట్టం రైతుకు ఏవిదంగా లాభం జరుగుతుంది అనీ విషయాలపై ఈ కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో ఇలాంటి రైతు సమస్యలు అన్నీ చర్చకు వస్తాయి. కొత్త పాస్ పుస్తకం కోసం తహసీల్దార్ లక్ష రూపాయలు లంచం అడిగారు అని రైతు కుటుంబం బజార్లో బిక్షం ఎత్తుకున్నారని, ఇది రాష్ట్రంలో ఉన్న పరిస్థితి అని ఆరోపించారు.

సమావేశం ఏజెండా : ఉదయం 9:30 లకు జెండా ఆవిష్కరణ.
10వేదిక వద్దకు చేరిక, 10:20 కి రైతు అంశాలపై చర్చ, మధ్యాహ్నం 1:30 నుండి 2 వరకు లంచ్, 2గంటల తరువాత మిగిలిన అంశాలపై చర్చ.

బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం



అమరావతి,సూర్యబ్యూరో: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈవో ఎం.శారదాకుమారి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ 9న స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతా యన్నారు. 10వ తేదీ ఆదివారం రాత్రి8 గంటలకు స్వామి కల్యాణం, 11న రథోత్సవం జరుగుతాయని వివరించారు.

సంపాదకీయం

editpage@suryaa.com

ఒక్క సిగరెట్ 51 మందిని బలి తీసుకుంది

ఖాట్మండు : గత ఏడాది మార్చిలో నేపాల్ రాజధాని ఖాట్మండు అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ప్రమాదంలో 51 మంది మరణించిన సంగతి విదితమే. అయితే ఏడాది తరువాత ఈ ప్రమాదానికి గల కారణాలు వెలుగులోకి వచ్చాయి. విమానం నడుపుతున్న పైలట్ కాక్‌పిట్‌లో సిగరెట్ తాగడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు విచారణలో తేల్చారు. అయితే, ప్రమాదం జరిగిన సమయంలో ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. దీనితో అధికారులు దర్యాప్తు కోసం ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా ప్యానెల్ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (బ్లాక్‌బాక్స్)ను పరిశీలించింది. విమానం నడుపుతున్న సమయంలో పైలట్ నిబంధనలకు విరుద్ధంగా కాక్‌పిట్‌లోనే పొగ తాగినట్లు అధికారులు గుర్తించారు. కాక్‌పిట్‌లోని సిబ్బంది నిర్లక్ష్యం, ల్యాండింగ్ సమయంలో పరిస్థితిపై అవగాహన కోల్పోవడం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. గత ఏడాది మార్చిలో యుఎస్‌బంగ్లా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ డాష్ 8 క్యూ 400 విమానం 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి ఖాట్మండుకు బయలుదేరింది. నేపాల్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో ఖాట్మండు విమానాశ్రయంలో దిగుతుండగా ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు సిబ్బంది సహా 51 మంది చనిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో మొత్తం 67 మంది ఉన్నారు.



బిసి బాటలో అన్ని పార్టీలు!

స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుండి నేటి వరకు బిసిలు కేవలం ఓటు బ్యాంక్‌గానే మిగిలిపోతున్నారని, అన్ని పార్టీలు ఆ విధంగానే చూస్తుండటంతో ఇకనైనా అందరూ ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని నిర్ణయించే విధంగా స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలని బిసి నేతలు ఇటీవల కొంత కాలంగా చేస్తున్న ప్రకటనలతో అన్ని పార్టీలలో చలనం కలిగినట్టే కనిపిస్తోంది. తెలుగు నాట దాదాపు అన్ని పార్టీలు రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిసిలకు జైకొట్టడం ఆరంభించాయి. జనాభా దామాషా ప్రకారం బిసిలకు అందాల్సిన ఫలాలు దక్కడం లేదని, విద్య, రాజకీయ, ఉద్యోగ అవకాశాలలో వెనకబడిపోయామని, అందువల్లే బిసిలు ఎదగడం లేదని ఆవేదన ఆయా వర్గాలలో ఉంది. తమ కులానికి చెందిన నేతలంతా కలసికట్టుగా చిత్తశుద్ధి, అంకితభావంతో ముందుకు వెళితే మంచి ఫలితాలు ప్రభుత్వాల నుంచి రాబట్టగలమన్నది బిసివర్గాల మాట. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాల్లో బిసిలు జనాభా ప్రాతిపదికన తమకు సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌ని వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార, ప్రతిపక్ష పార్టీలు బిసిల సంక్షేమ కోసం ఎనలేని పథకాలను ప్రవేశ పడతామంటూ హామీల వర్షం ప్రకటించడం ఆరంభించాయి. ఇటు అధికార తెలుగుదేశం పార్టీ ఇప్పటికే జయహో బిసి పేరుతో సభను నిర్వహించించి అనేక సంక్షేమ పథకాలను తెరపైకి తీసుకువచ్చింది. దాదాపు 10 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే కాపులను బిసిలోకి చేరుస్తామంటూ హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ కేంద్ర ఇచ్చిన ఇబిసి రిజర్వేషన్‌లో కొంత కాపులకు కేటాయించి ప్రత్యేక బిసి వర్గంగా గుర్తించాలని చూస్తోంది. ఒక వేళ కావుల్ని బిసిలుగా గుర్తిస్తే వాళ్లు బిసి కోటాలో వాటాకు వస్తారు. కావుల్ని బిసిల్లో చేర్చి మొత్తం కోటాను 5% పెంచినా కావుల జనాభాతో పోలిస్తే ఈ 5% ఏ మూలకూ చాలదు. ఈ వియంలో బిసి నాయకులలో కూడా గందరగోళం ఉంది – దీన్ని కొంత మంది స్వాగతిస్తున్నారు, మరి కొందరు వ్యతిరేకిస్తున్నారు. నిజానికి బిసిలు ఆనందించాలి. . బిసిల మజ్జిగ మరీ పల్చన కాకుండా ఉంటుంది. అసలు ఉద్యోగాలు ఎక్కడున్నాయి? అని చాలామంది అడుగుతున్నా, ఉపాధి అవకాశాలకే పెద్ద పీట వేయాలంటూ టిడిపి బిసి నేతలు వత్తిడి చేస్తున్నట్టు కనిపిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష నేత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజమహేంద్రవరం పార్లమెంట్ సీటును బలహీన వర్గాలకు కేటాయించి, గెలిపించుకుంటామంటూ ప్రకటించడంతో బడుగులు తమవైపు మళ్లే ఆస్కారం ఉందని ఆ పార్టీ వర్గాల భావిస్తున్నాయి. మరి కొందరు బిసీ నేతలను పార్టీలోకి రప్పించి మరిన్ని సీట్లను కేటాయించడం ద్వారా పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న ప్రయత్నంలో ఆ పార్టీ నేతలున్నారు. ఇంకో వైపె తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల తెలంగాణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని అభ్యర్థులను నిలబెట్టడంతో పాటు పెద్ద ఎత్తున ప్రచారం చేసినందుకు తాము కూడా రిటర్న్ గిఫ్ట్ ఇస్తామంటూ ప్రకటించి తెలంగాణ రాష్ట్ర సమితి సైతం ఈ సారి ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని స్థానాలలో పోటీ చేయాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పటికే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని రంగంలోకి దించింది. కేసీఆర్ వ్యూహరచనలలో భాగంగానే తలసాని విజయవాడలో జరిగిన యాదవ సభకు హాజరై, తెలుగురాష్ట్రాలలో బిసిలకు తనే నాయకత్వ బాధ్యతలు అందుకుంటానని చెప్పడం వెనుక ఆర్ కృష్ణయ్యను పక్కన పెట్టించడం ద్వారా ఝలక్ ఇవ్వటంతో పాటు ఏపిలోని బిసిలను తమ ఫ్రంట్‌లో భాగమవుతున్న వైసిపి వైపుకు నడిపించాలన్న లక్ష్యం ఉందన్నది విశ్లేషకుల వాదన. ఇక బిసిల కోసమే పుట్టిన ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో కలసిపోవటంతో తనకు కులవాసనే గిట్టదంటూ కొత్త పార్టీ పెట్టిన సినీ నటుడు పవన్ కళ్యాణ్ తన జనసేన ఆరంభించి ఐదేళ్లు కావస్తోంది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించేందుకు ఇంకా వందరోజులు కూడా సమయం లేని పరిస్థితి నెలకొన్న ఈ సమయంలో ఆయన కాపులు అధికంగా ఉండే ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాలలో మీదే ఆయన తన దృష్టిని కేంద్రీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి బిసి పాలసీ ప్రకటించకపోవటం పట్ల ఆ పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి. ఇక బిజెపి కేంద్ర ప్రకటించిన 10% ఒబిసి రిజర్వేషన్లనే తమ గొప్పతనంగా రంగంలోకి దిగాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా పలువురు బిసి నేతలను పార్టీలోకి ఆహ్వానించి, టిక్కెట్లు ఎక్కువగా ఇవ్వాలన్న యోచనలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఉన్నట్టు సమాచారం అయితే సంస్థాగతంలో బలం లేని పరిస్థితిలో ఎన్ని స్థానాలలో పోటీకి దిగినా అధికార పక్ష ఓట్ల చీలికకు మాత్రమే ఉపయోగపడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కన్నా వ్యూహం ఏమేరకు ఫలిస్తుందో తెలియాలి. ఇక బిసి నినాదాన్ని ఎత్తుకుని క్రైస్తవ మత ప్రచారకుడు కె.ఏ పాల్ ఎన్నికల క్షేత్రంలోకి దిగుతున్నారు. ఆతని ప్రజాశాంతి పార్టీ ప్రభావం పెద్దగా ఉండక పోవచ్చని కొందరు చెప్పినా, బిసిలకు భారీ ఎత్తున టిక్కెట్ ఇచ్చే పార్టీగా అవతరించే ఆస్కారం ఉంది. ఇలా అన్ని పార్టీలు బిసిల గళాన్ని వినిపిస్తున్న నేపథ్యంలో బలహీన వర్గాలు ఎటువైపు నడుస్తాయన్నది వేచి చూడాలి. ఏది ఏమైనా బిసి ఓట్లే ఈ పర్యాయం ఏపిలో ప్రభుత్వ ఏర్పాటును నిర్దేశిస్తాయనటంలో సందేహం లేదు.

వృద్ధులకు ఏపీ ప్రభుత్వం అండ

పట్టణీకరణ, సాంకేతిక, జీవన శైలిలో మార్పులతో మానవసంబంధాలు, కుటుంబ సంబంధాలలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. కుటుంబ వ్యవస్థకు, ముఖ్యంగా ఉమ్మడి కుటుంబానికి ప్రాధాన్యత తగ్గిపోతోంది. దాంతో రానురాను వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా ఏ ఆధారంలేని వృద్ధుల జీవనం దుర్భరమైంది. ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధులకు ప్రతి నెలా ఇచ్చే పెన్షన్ ను రూ.1000ల నుంచి ఒక్కసారిగా రెట్టింపు చేసి రూ.2వేలకు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పండుగ రోజు ఈ ప్రకటన చేయడంతో పండుటాకుల కళ్లలో ఆనందం తాండవించింది. చివరిదశలో కుటుంబ సభ్యులు సరిగా చూడక, ఒక్కరినే వదిలివేసి పట్టణాలకు వెళ్లడం, ఆర్థికంగా ఏమాత్రం ఆధారంలేని వారికి కావలసింది ఆ కాస్త భరోసానే. ఎన్టీఆర్ హయాంలో కడుపు నిండా అన్నం తినని పేదలు ఉన్నారని తెలుసుకొని కిలో రూ.2 లకు బియ్యం పథకం ప్రవేశపెట్టారు. ఆయన ప్రవేశపెట్టినవాటిలో ఇప్పటికీ అత్యంత ప్రజాధరణ పొందిన పథకం అదే. కిలో రూపాయికి తగ్గించినా జనంలో అది అన్న పథకంగానే గుర్తింపు పొందింది. ఆయన ఆలోచనలు, ఆయన భావాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ఈ పెన్షన్ పథకానికి ఎన్టీఆర్ భరోసా అని పేరు పెట్టింది. గతంలో రూ.200లు మాత్రమే ఇచ్చే పెన్షన్ ను 2014 అక్టోబర్ 2 నుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతో రూ.1000లకు పెంచింది. మళ్లీ ఇప్పుడు దానిని రూ.2వేలకు పెంచారు. ఈ నెలలో ఇప్పటికే లబ్ధిదారులు పెన్షన్ అందుకున్నారు. మిగిలిన రూ.1000లు, ఫిబ్రవరి నెల పెన్షన్ రూ.2వేలు కలిపి రూ.3వేలు అందజేస్తారు. దివ్యాంగులకు, హిజ్రాలకు ఇచ్చే పెన్షన్ ను రూ.1500ల నుంచి రూ.3వేలకు పెంచారు. డయాలసిస్ రోగులు ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందేవారు 3,373 మంది, సామాజిక భద్రత పెన్షన్లు అందుకుంటున్నారు. మొత్తం 50,61,906 మందికి ప్రభుత్వం 10 రకాల పెన్షన్లు అందజేస్తోంది. 2018 డిసెంబర్ నాటికి 50,62,008 మందికి పెన్షన్ రూపంలో రూ.560,79,49,000 అందజేసింది. వృద్ధులకు భద్రత, భరోసా కల్పించడం అభినందనీయం.

– శిరందాసు నాగార్జున, విజయవాడ

'అగ్ర' కోటాతో బి.సి. రిజర్వేషన్లకు నష్టం లేదు!



పాలూరు రామకృష్ణయ్య,
జాతీయ అధ్యక్షుడు
బీసీ యునైటెడ్ ఫ్రంట్

- పి.వి హయాంలో ఇచ్చిన ఒబిసి రిజర్వేషన్లు రద్దు
- 2011కులగణన లెక్కలు విడుదల చేయాలి
- ఇప్పటికే రిజర్వేషన్ల కోసం పలు రాష్ట్రాలలో ఉద్యమాలు
- పలు కులాలను బిసిలుగా గుర్తించిన శాసనసభలు
- రాష్ట్రాలు పంపిన బిల్లులకు ఆమోదం తెలపని కేంద్రం
- తాజాగా ఒబిసిలకు 10% రిజర్వేషన్లకు ఆమోదం

ఆర్థికంగా వెనుకబడిన కులాలకు కేంద్రప్రభుత్వం కల్పించిన 10 శాతం కోటాతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లకు ఎలాంటి నష్టము లేదు! కానీ తెలంగాణ ముఖ్యమంత్రి వాగ్దానాలలోని 12% ముస్లిం రిజర్వేషన్లు, యస్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అవి బి.సి. రిజర్వేషన్లకు అపార నష్టాన్ని కలిగించే అవకాశాలున్నాయి. ఎందుకంటే సుప్రీం కోర్టు బి.సి., యస్సీ, యస్టీ రిజర్వేషన్లు అన్నీ కలిపి 50 శాతానికి మించకూడదని అదేశాలిచ్చింది. ప్రస్తుతం ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు బి.సిలకు ఎలా నష్టం కలిగించదో ఒకసారి పరిశీలిద్దాం!!

1990 సంవత్సరం మండల్ కమీషన్ సిఫారసులలో కొన్నింటిని అప్పటి వి.పి.సింగ్ ప్రభుత్వం, అమలుచేసే దిశలో ఆదేశాలు జారీచేసింది. అందులో ముఖ్యంగా 27శాతాన్ని ఇతర వెనుకబడిన తరగతులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లను కల్పించింది. తదనంతరం, పై రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అగ్రకుల విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. వీటికి నిరసనగా బీసీ, యస్సీ, యస్టీ విద్యార్థులు 27 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా ఆందోళనలను చేపట్టారు. పదేళ్ళ క్రితం బి.పి. మండల్ అధ్యక్షతన కమీషన్ సమర్పించిన నివేదికను బూజు దులిపి, ఆ నివేదికను ఉభయ సభలలో ఆమోదింపజేసి, బి.సి.లకు రిజర్వేషన్లను కల్పించారు వి.పి.సింగ్. ఆయన చర్యకు మద్దతుగా, వ్యతిరేకంగా దేశం నలుమూలలా రేగిన ఉద్యమాల తీవ్రతను భరించలేక పదవికి రాజీనామా చేయటం అందరికీ తెలిసిన విషయమే. 1991 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించింది. పి.వి.నరసింహారావు ప్రధాని అయ్యారు. దేశవ్యాప్తంగా చెలరేగుతున్న ఉద్యమాల తీవ్రతను తగ్గించేందుకు విపి సింగ్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇందులో 10 శాతం రిజర్వేషన్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లను కల్పించింది. ఇంద్రసహానీ అనే వ్యక్తి దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసువేశారు. ముందుగా ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించి, 9మంది జడ్జిల ధర్మాసనానికి బదిలీ చేసింది. వాదప్రతివాదనల అనంతరం సుప్రీం కోర్టు 16.11.1992 న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను ముఖ్యమైన అంశంగా అంగీకరించింది. మొత్తం రిజర్వేషన్లు బి.సి., యస్సీ, యస్టీలకు కలిపి 50 శాతానికి మించకూడదని తీర్పిచ్చింది. క్రీమిలేయర్ అంశాన్ని తెరపైకి తెచ్చింది. వెనుకబడిన తరగతులలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని ఈ రిజర్వేషన్ పరిధి నుండి తొలగించింది. క్రీమీలేయర్ పరిధిలోకి వచ్చిన వెనుకబడిన తరగతుల అభ్యర్థులను జనరల్ క్యాటగిరిగా గుర్తించి ఉద్యోగ ప్రవేశాలను కల్పించమని ఆదేశించింది. ఆర్థికంగా వెనుకడిన వర్గానికి పి.వి. కల్పించిన 10శాతం రిజర్వేషన్లను రద్దు చేసింది! ఎందుకంటే కేవలం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు మాత్రమే ఉద్యోగాలలో రిజర్వేషన్లను కల్పించవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్16(4) లో చెబుతోంది. సుప్రీం కోర్టు 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం 6-3 మెజారిటీతో తీర్పు చెప్పింది. కేంద్ర ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వాలకూ ఈ తీర్పే దిక్సూచిగా మారింది.

పై రిజర్వేషన్లు కొనసాగుతున్న దశలో, 2008 సంవత్సరంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం బి.సి.లకు విద్యారంగంలో 27శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ చేసిన బిల్లు ఉభయసభల్లో ఆమోదంపొందింది. అప్పటి నుంచికేంద్ర పరిధిలోని విద్యాలయాల్లో 27శాతం రిజర్వేషన్లను ఓబీసీలకు కల్పించింది. అప్పటినుండి, తమ విద్యార్థులను కూడా రిజర్వేషన్ల పరిధిలోకి తీసుకు రావాలని వెనుకబడిన తరగతుల జాబితాలో తమ కులాలను చేర్చాలనీ, హర్యానాలో జూట్‌లు, గుజరాత్‌లో పటేల్‌లు, రాజస్థాన్ లో గుజ్జర్లు, మహారాష్ట్రలో మరాఠాలు, ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులు, ఉద్యమాలు ప్రారంభించారు. ఫలితంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జూట్‌లు, గుజ్జర్లకు బి.సి. జాబితాలో చోటు కల్పించాయి. వాటిని సుప్రీం కోర్టు రద్దుచేసింది. ఈ మధ్యనే మహారాష్ట్ర కూడ మరాఠాలకు బి.సి. జాబితాలో చోటు కల్పించింది. ఈ చర్యపై కూడా బి.సి.లు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కాపు కులమని రికార్డుల్లో రాసి, పేరు చివర రెడ్డి అని చేర్చుకుంటున్నారు. వారిని రెడ్లు అని పిలుస్తున్నారు. వీరిలోనే ఒక వర్గాన్ని మున్నూరు కాపులని వ్యవహరిస్తున్నారు. వారు సామాజికంగానూ విద్యాపరంగానూ వెనుకబడిన వారని అనంతరామ్ కమిషన్ గుర్తించి వెనుకబడిన జాబితాలో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కాపులు అన్ని జిల్లాలలో ఉన్నారు. రాయలసీమలో రెడ్డి అని చివర పెట్టుకుంటున్న వారు కూడా కులపరంగా కాపులే! కోస్తా ప్రాంతంలో కాపులు వీరిని వారి వర్గంగా గుర్తించినా, వారు రాజకీయంగా అగ్రస్థానంలో వున్నారు కాబట్టి వారిని కలుపుకుని వెళితే తమను బి.సి. జాబితాలో చేర్చే అవకాశముండదని భావించి, వారు తమ కాపు కులానికి ఇటు సామాజికంగా గానీ అటు వృత్తిపరంగా కానీ ఏ మాత్రం సంబంధం లేని బలిజ కులన్ని తమ వర్గంగా కలుపుకున్నారు. కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలు ఒకే వర్గమని ప్రకటించుకున్నారు. రాయలసీమ బలిజలు సంఖ్యాపరంగా పెద్ద కులం. రాయలసీమ కాపు రెడ్లను రాజకీయాల్లో ఎదుర్కొనే సత్తా కలిగిన కులం. ఈ దిశలో డాక్టరు అంబేద్కర్ చెప్పిన ఒక సూక్తిని గుర్తుకు తెచ్చుకోవలసిన అవసరముంది. ఏ కులమైనా, వర్గమైనా అభివృద్ధి చెందాలంటే రాజకీయ అధికారమే మాస్టర్ కీ! అంటే రాజకీయంగా అభివృద్ధి చెంది, అసెంబ్లీలో మొదటి స్థానంలో ఉన్న కులాన్ని కాపు అని విద్యారంగంలో రికార్డు చేయించుకొన్న వారందరూ కాపులను గుర్తిస్తే, రాయలసీమ కాపులు, కోస్తా కాపులు కలిసి అసెంబ్లీలో సుమారు 54 మంది ఉన్నారు. ఉత్తరాంధ్రలోని తూర్పుకాపులు 8మంది, అలానే కేవలం సుమారు 1.5 శాతమున్న కమ్మ కులస్థులు సుమారు 33 మంది ఉన్నారు. ఈ మూడు వర్గాలు కలిపి 175 మంది ఎమ్మెల్యేలకూ 95 మంది ఉన్నారు. అంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అసెంబ్లీలో 88మంది సభ్యులు కావలసివుంటే పై రెండు కులాలు కలిపి 95 మంది ఉన్నారు. కాపు, కమ్మ ఎమ్మెల్యేలు ఎవ్వరి సహాయం లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలరు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులకు 1000 కోట్లతో కార్పొరేషన్, మంత్రివర్గంలో నలుగురికి స్థానం కల్పించారు. వారిని బి.సి. జాబితాలో చేర్చాలనీ, బిల్లు పెట్టి రెండు సభల్లో ఆమోదింపచేసి, కేంద్రానికి పంపారు. దీని వెనుక అంశాన్ని గమనించి, కేంద్రం ఈ బిల్లును బుట్టదాఖలు చేసింది. రాష్ట్రంలో రిజర్వేషన్లకు, కేంద్రంలో ఒ.బి.సి. రిజర్వేషన్లకు పరస్పర సంబంధం లేదు. ఏపీ ముఖ్యమంత్రికి కాపులకు రిజర్వేషన్లను కల్పించాలన్న దృఢమైన సంకల్పముంటే అందుకు వీలుగా సుప్రీం కోర్టు తీర్పులు అనేకమున్నాయి. అయితే ఆయన



కేంద్రానికి పంపి మమ అనిపించుకున్నారు. హర్యానాలో జూట్‌లు, రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పటేల్‌లు, మహారాష్ట్రలో మరాఠాల విషయంలోనూ, ఏపీలో కాపుల మాదిరే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించడానికి కేంద్రానికి ఒకటే దారి. అదే ఆర్థికంగా వెనుకబడి రిజర్వేషన్లు లేని అగ్రకులాలకు రిజర్వేషన్లు కల్పించడం. సుప్రీం కోర్టు ఈ రిజర్వేషన్లను రద్దు చేయకుండా ఉండాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఉభయ సభల్లో ఆమోదింపజేసి, రాజ్యాంగ సవరణ చేశారు. ఈ ఆర్థికంగా వెనుకబడిన ఇతర కులాల విద్యార్థుల రిజర్వేషన్లను కొందరు వెనుకబడిన తరగతుల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. బి.సి.ల రిజర్వేషన్లకు ఏ మాత్రం నష్టం కలగదని అందరికీ తెలుసు. బి.సి. నాయకులకూ తెలుసు, కానీ వ్యతిరేకిస్తున్నారంటే కారణాలు వారికే తెలియాలి. తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలలో అన్యాయం జరిగింది! రాజ్యాంగంలో ఇటు స్థానిక సంస్థలలోనూ, అటు పురపాలక సంస్థలలోనూ, బి.సి. రిజర్వేషన్లు ఎంత శాతముండాలి అనే నిర్ణయించే అధికారాన్ని అసెంబ్లీలకిచ్చింది. ఈ దశలోనే 1994లో స్థానిక సంస్థల చట్టాలను ఉభయ సభలలో ప్రవేశపెట్టి, అప్పటి బి.సి. జనాభా అయిన 39.39 శాతంగా అధికారిక గణాంకాలున్న దిశలో 34శాతంగా ఆమోదించాయి. గవర్నర్ ఆమోదంతో అది చట్టమయ్యింది. తెలంగాణ రాష్ట్ర బి.సి. జనాభా గణాంకాలు సమగ్ర సర్వే ద్వారా 51.08 శాతమని ప్రకటించి, తెలంగాణ ప్రభుత్వ గణాంకాలను ఇటు హైకోర్టుకూ అటు సుప్రీం కోర్టుకూ తెలుపకుండా కేవలం ముస్లిం రిజర్వేషన్లను 4 శాతం నుండి 12 శాతానికి పెంచాలని చూసింది. ఈ దిశలో మొత్తం రిజర్వేషన్లు సుప్రీం కోర్టు గరిష్ట పరిమితిమైన 50 శాతానికి మించిపోతాయనీ, తమిళనాడులో 69శాతం అమలులో ఉన్నాయి కాబట్టి తెలంగాణకి ఆమోదించాలనీ ఎస్‌పిఎల్ దాఖలు చేశారు. బి.సి. అధికారిక గణాంకాల శాతం 51.08 అని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు దీనికి అంగీకరించలేదు. రిజర్వేషన్లను 50శాతానికి కుదించాలని ఆదేశించింది. వెంటనే స్పెషల్ లీవు పిటీషన్ వెనక్కితీసికొని ఆగమేఘాలమీద 50 శాతానికి కుదించింది. బి.సి.లకు 34శాతం నుండి 22 శాతానికి తగ్గించింది. ఆమేరకు ఆర్డినెన్సు విడుదల చేసింది. బి.సి.లకు స్థానిక సంస్థల రిజర్వేషన్లలో పూర్తిగా అన్యాయం చేసింది. బి.సి.ల జనాభా 51.08 ఉన్న దశలో బి.సి.ల రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 51.08 శాతానికి పెంచవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు పేర్కొటూ బి.సి.ల అధికారిక గణాంకాలను సమర్పించగా తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను కొనసాగించింది. అదే తీర్పులో కర్నాటక ప్రభుత్వం బి.సి.ల అధికారిక గణాంకాలు తమవద్దే లేవని చెప్పడంతో అక్కడ రిజర్వేషన్లను 50 శాతానికి కుదించింది.

ఇవన్నీ తెలంగాణ ప్రభాత్వానికీ అధికారులకు తెలిసి కూడా బి.సి.ల రిజర్వేషన్లకు గండికొట్టారు. రాజ్యాధికారాన్ని అనుభవించిన నాయకులు గానీ లేక న్యాయ వ్యవస్థలో పనిచేసిన బి.సి. నాయకులు గానీ వీటి మీద తగిన చర్యలు తీసుకోకుండా ఆర్థికంగా వెనుకబడిన 10 శాతం రిజర్వేషన్లతో బి.సి.లకు నష్టం లేదని వాదిస్తున్నారు. ఈ చర్య ఒక విధంగా అగ్రకులాలు బి.సి. జాబితాలోకి రాకుండా చేసిన ప్రయత్నమని గమనించకుండా, ఈ చర్యకు వ్యతిరేకంగా మీడియా ముందు ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇకనైనా బి.సి. రిజర్వేషన్లను అధికారిక గణాంకాలకు అనుగుణంగా పెంచేందుకు వీలుగా కేంద్రం చేపట్టిన 2011 సంవత్సరం కులాల జనాభా గణాంకాలను బహిర్గతం చేయాలి. దీని వల్ల భారత దేశంలో బి.సి. సమస్యలు అన్ని కోణాల్లోనూ పరిష్కారమవుతాయి. తదనుగుణంగా బి.సి.ల రిజర్వేషన్లను 52 శాతానికి పెంచవచ్చునని కేంద్రంపై ఒత్తిడి తేవాలి. ఈ దిశలోనే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బి.సి.ల రిజర్వేషన్లను 27 శాతం నుంచి 52 శాతానికి పెంచుతామనీ, తమ మేనిఫెస్టోలో పెడతామని ప్రకటించారు. బి.సి నాయకులందరూ ఈ దిశగా ఉద్యమాలు చేయాలి. అప్పుడు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన పెంచే అవకాశం ఉంటుంది.

ప్రజాగ్రహం నివారణకు మోడీ మ్యాజిక్ ఏమిటి?



మల్యాలపల్లిరాజు
రాజకీయ విశ్లేషకులు

- ప్రతిపక్షాల అనైక్యత కమలానికి కలిసొచ్చే అంశం
- పాత హామీలతో మళ్లీ మభ్యపెట్టడం ఈసారి అసాధ్యం
- ఈబీఎస్ కోటా ఓట్లు కురిపిస్తుంటున్న కమలనాథులు
- రాఫెల్ ఒప్పందం పక్కలో బల్లెంగా మారటం ఖాయం
- ఉద్యోగ, ఉపాధి కల్పనలలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం

దేశంలో ఎన్నికల వాతావరణం అప్పుడే వేడెక్కుతోంది. పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ.. రాజకీయ వాతావరణంలో కూడా పెనుమార్పులు చోటు చేసుకుంటున్నా యి. 2014లో ఆరంభమైన నరేంద్రమోడీ పాలనలో సాధించిన ప్రగతి కన్నా.. పొందిన ప్రజాగ్రహం ఎక్కువగా కన్పిస్తోంది. ఈ ప్రజాగ్రహాన్ని నివారించి, 2019లో తిరిగి అధికారంలోకి వచ్చేం దుకు బీజేపీ, ఎన్డీఏ కూటమి ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తాయన్న అంశంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. మోదీ ఏ మ్యాజిక్ చేస్తారు. ఏ హామీలు ఇచ్చి ప్రజాగ్రహాన్ని తగ్గించి, విజయం సాధిస్తారన్నదే ప్రస్తుత ప్రశ్న.

2014లో నరేంద్రమోదీ పెద్దపెద్ద హామీలతో, దాదాపు అన్ని వర్గాలను ఆకట్టుకుని ప్రభంజనం సృష్టించారు. అప్పటివరకూ అవినీతితో దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనతో విసిగి పోయిన ప్రజలకు కొత్త ఆశలు కల్పించారు. స్వచ్ఛమైన పాలన అందిస్తామన్న భరోసా కల్పించి కేంద్రంలో పాగా వేశారు. 2019లో పరిస్థితి వేరు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ఈ నాలుగున్నర ఏళ్లలో తీసుకున్న నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. హఠాత్ గా పెద్దనోట్ల రద్దుతో సామాన్యప్రజలు, చిన్న, పెద్ద వ్యాపారులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పరిశ్రమలు బంద్ అయిన కారణంగా దాదాపు 35 లక్షల మంది ఉపాధికోల్పోయి, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నల్లధనం అరికట్టేందుకే ఈ చర్య తీసుకున్నట్లు మోదీ సర్కార్ ప్రకటించినా, బ్యాంకుల్లో జమ అయిన నల్లధనం పెద్దగా లేదని తేలిపోయింది. ఇక జీఎస్టీ పేరుతో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన వస్తు, సేవా పన్ను అమలులో తలెత్తిన ఇబ్బందులవల్ల కలిగిన కష్టాలు ఎన్నో. ప్రతి వస్తువుపైనా పన్నుబాదుడే. హోటల్ కు వెళ్లి భోజనం చేసినా, మంచినీళ్ల సీసా కొనుక్కున్నా.. పన్నే.. ఇది జనాలకు తీవ్రంగా కోపం తెప్పించింది. ఈ రెండు చర్యల వల్ల మోదీ ప్రభుత్వం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమయింది. సామాన్య జనంలో మోదీ పట్ల ఆగ్రహం పెల్లుబికింది. నరేంద్రమోదీ గ్రాఫ్ పడిపోయింది. నరేంద్రమోదీ ఈ నాలుగున్నర ఏళ్లలో విదేశీ పర్యటనలకు అయిన ఖర్చు ఓ పెద్ద రాష్ట్రం వార్షిక బడ్జెట్ ను మించిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. మోదీ పర్యటనల పుణ్యమా అని దేశంలో వచ్చిన పరిశ్రమలు, లభించిన ఉపాధి అవకాశాలు నామమాత్రమే. విదేశీ బ్యాంకుల్లో నిల్వ ఉన్న నల్లధనాన్ని తెచ్చి దేశంలో ఉన్న ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు బ్యాంకుల్లో వేస్తానని మోదీ చేసిన ఎన్నికల వాగ్దానం ఓ పెద్ద ప్రహసనంగా, జోక్‌గా మారింది. ఈ ఐదేళ్లలో మోదీ సర్కార్ విదేశీ బ్యాంకుల్లోని నల్ల ధనంలో ఒక్కవంతుకూడా వెనక్కి తప్పించలేదు సరికదా, విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం నిల్వలు మరో 50 శాతానికి పెరగడం ఆశ్చర్యకరమైన పరిణామం. కోట్లాది మందికి ఉద్యోగం కల్పిస్తామన్న మోదీ వాగ్దానం కాగితాలకే పరిమితం కావడంతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. రాఫెల్ యుద్ధ



విమానాల కొనుగోలులో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ప్రతిపక్షాలు.. దేశ అనర్థాలకు మోదీ సర్కార్ కారణమని దుమ్మెత్తి పోస్తున్నాయి. ఇక రైతాంగం మోదీ సర్కార్ వస్తే దేశంలోతమ స్థితి గతులే మారిపోతాయని ఆశించాయి. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, తమకూ అచ్ఛేదిన్ వస్తుందని భావించారు. బీజేపీ కేంద్రప్రభుత్వం హయాంలో వ్యవసాయం సంక్షోభంలో పడింది. రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. చెరకు రైతులకు బకాయిలు అందలేదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలోని ఉల్లి, వెల్లుల్లి రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కాదు కదా కనీస ధర లభించక, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన కూలీ కూడా దక్కక ఆత్మహత్యలు చేసుకోవల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఆ రైతులు, ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం ఫలితంగానే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లలో బీజేపీ అధికారానికి దూరమైంది. గోరక్షణ పేరుతో, గోవధ, గోమాంస భక్షణ పేరుతో బీజేపీ, ఆరెస్సెస్, భజరంగ్ దళ్, హిందూ వాహిని కార్యకర్తలు సాగిస్తున్న దారుణాలు, హింసాకాండ ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఈ పరిణామాల కారణంగా జనం దృష్టిలో బీజేపీ, సంఘ్ పరివార్ పట్ల గౌరవం మంటగలిసింది.

2019 ఎన్నికలు వచ్చేస్తున్నాయి. మార్చి నెలలో లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇప్పటికే ప్రతిపక్షాలన్నీ ఎన్నికల సన్నాహాలు ఆరంభించాయి. ఈ తరుణంలో ప్రధాని నరేంద్రమోదీ తిరిగి అధికారంలోకి రావాలంటే, తనపై జనంలో ఉన్న ఆగ్రహాన్ని తగ్గించి, తిరిగి ప్రజలంతా తనకు, తన పార్టీకి ఓటు వేసి గెలిపించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఈ విషయంపై ఇప్పటికే ఎన్డీఏ సర్కార్ దృష్టి పెట్టింది. అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చట్టం చేసింది. సామాజిక, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన అన్నికులాల వారికి 10 శాతం రిజర్వేషన్లు వర్తింప జేసేందుకు సిద్ధమైంది. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ లబ్దిదారుల ఎంపికకు కొన్ని సంపద పరిమితులను కూడా ఖరారు చేసింది. ఐదు ఎకరాలకు పైబడి భూమి, 8 లక్షల రూపాయలకు మించిన వార్షికాదాయం, నగరాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి నివాసస్థలం ఉన్నవారు అర్హులు కాదని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఆ పరిమితులకు లోబడి సంపద కలవారంతా 10 శాతం రిజర్వేషన్లకు అర్హులే. ఈ నిర్ణయం ద్వారా కొన్ని దశాబ్దాలుగా రిజర్వేషన్లు కోరుతున్న జాట్లు, పటేళ్లు, మరాఠాలు, కాపులు, ఇతర అగ్రవర్ణాలను ప్రసన్నం చేసుకునేందుకు నరేంద్రమోదీ సర్కార్ గొప్ప చట్టమే



తెచ్చింది. పార్లమెంటులో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, తమ రాజకీయ విభేధాలను పక్కన పెట్టి ఈ బిల్లుకు మద్దతు తెలిపేలా చేయడంలో మోదీ సర్కార్ గొప్ప విజయాన్నే సాధించింది. ప్రస్తుతం రైతులకు పెద్ద ఎత్తున మేలు చేసే పథకాలపై దృష్టి పెడుతున్నది. గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున కేటాయింపులు చేసేందుకు, వ్యవసాయదారులకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పించేందుకు పథక రచన చేస్తున్నది. రైతులకు పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలు అమలు చేసేందుకు ప్రత్యేక యంత్రాంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసే వ్యవసాయ ఉత్పత్తుల పరిమితి పెంపు వంటి ప్రతిపాదనలను అమలు చేసేందుకు మోదీ సర్కార్ సిద్ధమవుతోంది. నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు తాయిలాలను సిద్ధం చేస్తున్నది. ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తామని, హిందువులను సంతృప్తి పరిచేందుకు రామజన్మభూమి విషయంలో సుప్రీం కోర్టు తీర్పు రాగానే చర్యలు చేపడతామనే వాగ్దానం కూడా చేయవచ్చు. ఎన్నికల మేనిఫెస్టోలో మరెన్నో కొత్త హామీలను గుప్పించే వ్యూహంలో ఉంది. మోదీ సర్కార్ కొత్త ప్రతిపాదనలు, వాగ్దానాలు ఎంతవరకూ ఫలిస్తాయో తెలియదు కానీ, దేశంలో ప్రతిపక్షాల మధ్య అనైక్యత మాత్రం మోదీ సర్కార్ కు వరంగా పరిణమించే అవకాశం కల్పిస్తున్నది. ప్రతిపక్షాలన్ని సమైక్య పోరాటానికి సిద్ధం కాకుండా, పలు కూటములుగా ఏర్పడి, అధికారంకోసం అర్రులు చాస్తున్నాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓ కూటమి, బీజేపీకి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మరో కూటమి, యూపీలో ఎస్పీ, బీఎస్పీ ఆధ్వర్యంలో మినీ కూటమి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలో మరో కూటమి, విడిగా కమ్యూనిస్ట్ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ప్రతిపక్షాల మధ్య అనైక్యత, విబేధాలు మోదీకి, బీజేపీకి, ఎన్డీఏకి శ్రీరామ రక్షగా పరిణమించేలా ఉన్నాయి.



భారత్‌లో విడుదలైన రియల్‌మీ సీ1

న్యూఢిల్లీ : రియల్‌మీ సీ1లోని 2 జీబీ ర్యామ్/16 జీబీ ర్యామ్ వేరియంట్‌ను ఇటీవల భారత్‌లో విడుదల చేసిన రియల్‌మీ ఇప్పుడు ఇందులోని మరో రెండు వేరియంట్లను భారత్‌లో విడుదల చేసింది. రియల్‌మీ సీ1 (2019) 2 జీబీ ర్యామ్/32 జీబీ వేరియంట్, 3 జీబీ ర్యామ్/32 జీబీ వేరియంట్‌లను భారత్‌లో విడుదల చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. శాంసంగ్ త్వరలోనే గెలాక్సీ ఎం సిరీస్ బడ్జెట్ స్మార్ట్ ఫోన్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చిన నేపథ్యంలో రియల్‌మీ వ్యూహాత్మకంగా ఈ వేరియంట్లను విడుదల చేసింది. రియల్‌మీ సీ1 (2019) 2 జీబీ ర్యామ్/32 జీబీ వేరియంట్ ధర భారత్‌లో రూ. 7499 కాగా, 3 జీబీ ర్యామ్/32 జీబీ వేరియంట్ ధర రూ. 8499. ఫిబ్రవరి 5 నుంచి ఈ రెండింటినీ ఫ్లిప్‌కార్ట్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు. రియల్‌మీ సీ1ని గత ఏడాది సెప్టెంబర్‌లో భారత్‌లో విడుదల చేసింది. ధర రూ. 6999. రియల్‌మీ సీ1 (2019) స్పెసిఫికేషన్లు, ఫీచర్లు: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)తో కూడిన డ్యూయల్ రియర్, సెల్ఫీ కెమెరాలు ఉన్నాయి. ఫేసియల్ అన్‌లాక్, స్మార్ట్ క్లాక్ ఫీచర్, పవర్ సేవింగ్ ఫీచర్లు, యాప్ ఫ్రీజింగ్ పవర్ సేవర్, క్విక్ యాప్ ఫ్రీజింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 6.2 అంగుళాల పూర్తి హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, డ్యూయల్ సిమ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో ఓఎస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్యానెల్, డిస్‌ప్లే నాచ్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 450 ఎస్ఓసీ, మెమొరీని పెంచుకునే వెసులుబాటు ఉన్న ఈ ఫోన్‌లో 4230 ఎంఏహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీని ఉపయోగించారు.

ఉక్కు ఉత్పత్తిలో రెండో స్థానానికి భారత్




న్యూఢిల్లీ : ఉక్కు ఉత్పత్తిలో జపాన్‌ను వెనుకకు నెట్టి భారత్ రెండవ స్థానానికి ఎగబాకింది. ప్రపంచ వ్యాప్తంగా స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న వివిధ దేశాల జాబితాను వరల్డ్ స్టీల్ అసోసియేషన్ సోమవారం ప్రకటించింది. ఈ జాబితాలో 51శాతం వాటాతో చైనా అగ్ర భాగాన నిలిచింది. అయితే, 2017లో 870.9 మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తితో 50.3 శాతం వాటా కలిగిన చైనా దానిని 2018లో 928.3 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసి 51.3 శాతానికి పెంచుకుంది. భారత్ 2017లో 101.5 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయగా, 2018లో 4.9 శాతం వృద్ధితో 106.5 మెట్రిక్ టన్నులకు పెంచుకుంది. 2018లో జపాన్ 104.3 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసి మూడో స్థానంతో సరిపెట్టుకుంది. అమెరికా (4), దక్షిణ కొరియా (5), రష్యా (6), జర్మనీ (7), టర్కీ (8), బ్రెజిల్ (9), ఇరాన్ (10) స్థానాల్లో ఉన్నాయి.

బీమా కంపెనీలకు ధీమా




న్యూఢిల్లీ : ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌లో పీఎస్‌యూలకు ఊతమిచ్చే అవకాశం ఉంది. ఈ బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్ల మేరకు ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు కేటాయింపులు చేయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దేశంలోని మూడు ప్రధాన బీమా కంపెనీలకు మూలధన నిధుల కింద రూ. 4 వేల కోట్లు అవసరమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇప్పటికే సూచించింది. ఈ కంపెనీల్లో నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ ఉన్నాయి. ఈ కంపెనీల ఆర్థిక పరిస్థితి మెరుగుపడడానికి ఇది చాలా అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో బీమా కంపెనీలకు కష్ట కాలం నడుస్తోంది. ప్రైవేట్ రంగ కంపెనీలతో పాటు ప్రభుత్వ రంగ కంపెనీలు కూడా చాలా ఆర్థిక ఒత్తిళ్లకు లోనవుతున్నాయి. క్లెయిమ్‌ల రేటు పెరగడం ఈ కంపెనీల లాభాలపై ప్రభావం చూపిస్తోంది. ఇప్పటికే మూడు ప్రధాన బీమా రంగ కంపెనీలను విలీనం చేస్తామని గత బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ తెలిపారు. ఈ మూడు కంపెనీలు కలిపి 200 రకాల బీమా సేవలను అందజేస్తున్నాయి. వీటి ప్రీమియం మొత్తం ఏటా రూ. 41461కోట్లు. 35 శాతం మార్కెట్ వాటా ఈ కంపెనీల వద్ద ఉంది. ఈ నేపథ్యంలో మూడు కంపెనీల విలీనం తరువాత ఏర్పడే కంపెనీ విలువ రూ. 1.5 లక్షల కోట్ల వరకు ఉండవచ్చు.

ఐఆర్‌సీటీసీ కేసులో
లాలూ కుటుంబానికి బెయిలు



న్యూఢిల్లీ : రాష్ట్రీయ జనతా దళ్ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లకు కూడా కోర్టు బెయిలు ఇచ్చింది. నిందితులకు ఒక్కొక్కరికి రూ. లక్ష, ఒకరి పూచీకత్తుతో ప్రత్యేక న్యాయమూర్తి అరుణ్ భరద్వాజ్ బెయిల్ మంజూరు చేశారు. నిందితు లైన లాలూ, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌లకు కోర్టు ఈ నెల 19న మధ్యంతర బెయిలును పొడిగించింది. ఆ గడువు సోమవారంతో ముగుస్తున్నది. దీంతో వారు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. కాగా, కోర్టు వారికి బెయిలు ఇచ్చింది. రెం డు ఐఆర్‌సీటీసీ హోటల్స్‌ను అక్రమంగా ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టుకు ఇచ్చా రని, ఇందులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది.

రూ. కోటి విలువ చేసే రైల్వే టిక్కెట్లు స్వాధీనం
ఇద్దరు అరెస్టు



పాట్నా : బీహార్ రాజధాని పాట్నాలోని ఒక ట్రావెల్ ఏజెన్సీలో కోటి రూపాయలు విలువ చేసే రైల్వే టిక్కెట్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రైల్వే టిక్కెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించిన ఆర్‌పీఎఫ్ అధికారులు 5 తత్కాల్, 93 రిజర్వేషన్ టిక్కెట్లతో పాటు 3085 టిక్కెట్లను సీజ్ చేశారు. అక్కడికక్కడే ఇద్దరిని అరెస్టు చేసిన అధికారులు మూడు మొబైల్ ఫోన్లు, రూ. 52 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక హోటల్ కేంద్రంగా ఈ అక్రమ దందా సాగుతున్నట్లు గుర్తించిన అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

మార్కెట్లోకి సుజుకీ వి-స్ట్రామ్ 650 ఎక్స్‌టి (2019)

ధర రూ. 7.46 లక్షలు (ఎక్స్‌షోరూం, ఢిల్లీ)



న్యూఢిల్లీ : సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా కొత్త ప్రీమియం మోటార్ బైక్ మోడల్ ను లాంచ్ చేసింది. అడ్వెంచర్ టూరర్ బైక్ వి–స్ట్రామ్ 650ఎక్స్‌టి ఏబీఎస్ (2019)ని సంస్థ సోమవారం మార్కెట్ లోకి విడుదల చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైక్ ధర రూ. 7.46 లక్షలు (ఢిల్లీ ఎక్స్ షోరూమ్). కొత్త గ్రాఫిక్స్, అదనపు ఫీచర్లతో వి–స్ట్రామ్ కొత్త వెర్షన్ భారతీయ వినియోగదారులకు అద్భుతమైన అడ్వెంచర్ అనుభూతిని అందిస్తుందని సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా ఎండీ సతోషి ఉచిడా వెల్లడించారు. గత ఏడాది లాంచ్ చేసిన ఈ వి– స్ట్రామ్ మోటార్ సైకిల్‌కు మంచి ఆదరణ లభించిందనీ, ఇప్పుడూ అదే స్పందన లభిస్తుందని తాము ఆశిస్తున్నామనీ ఆయన తెలిపారు. లైట్ వెయిట్ యాంటీ లాక్ బ్రేక్ సిస్టమ్ రహదారిపై పట్టును కోల్పోకుండా చేస్తుందని ఉచిడా పేర్కొన్నారు.

ఒత్తిడికి గురైన బ్యాంకింగ్ స్టాక్స్

- భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు
- ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు
- 368 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 119 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ



ముంబయి : బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటోమొబైల్, ఫార్మా స్టాకులు అమ్మకాల ఒత్తిడికి గురి కావడంతో దేశీయ మార్కెట్లు సోమవారం భారీగా పతనమయ్యాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే సూచీలు రెడ్‌లోకి జారుకున్నాయి. ఆ తరువాత మార్కెట్ల పతనం కొనసాగుతూనే వచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 368 పాయింట్లు నష్టపోయి 35656కు పడిపోయింది. నిఫ్టీ 119 పాయింట్లు కోల్పోయి 10661కి దిగజారింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో యస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, సన్ ఫార్మా తదితర కంపెనీలు నష్టాలను మూటగట్టుకున్నాయి. కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, టీసీఎస్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఏషియన్ పెయింట్స్ తదితర కంపెనీలు లాభాలను మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్ వరుసగా ఎనిమిదో ట్రేడింగ్ సెషన్‌లో కూడా నష్టాలను మూటగట్టుకుంది. సోమవారం ట్రేడింగ్‌లో ఈ షేరు 5 శాతం నష్టంతో భారీగా చేతులు మారింది. చివరికి 4 శాతం నష్టంతో 343.45 వద్ద ట్రేడింగ్ ముగిసింది. మరొక వైపు జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు 17 శాతం లాభంతో ముగిసింది. భారత మార్కెట్లలో నుంచి ఎఫ్ఐఐలు అమ్మకాలను కొనసాగిస్తున్నారు. జనవరి నెలలో నికరంగా రూ. 5 వేల కోట్ల పెట్టుబడులను వాపస్ తీసుకొన్నారు. ఈ ట్రెండ్ మార్కెట్లలో కొనసాగవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గత నెలలో రూ. 5900 కోట్ల పెట్టుబడులు పెట్టగా రూ. 3143 కోట్ల మేరకు పెట్టుబడులను ఉపసంహరించుకొన్నారు.

నష్టాలకు కారణాలు : బలహీనమైన మూడో త్రైమాసిక ఫలితాలు

డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో భారీ కంపెనీలు ఆశించిన ఫలితాలను వెల్లడించకపోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. ముఖ్యంగా మారుతీ సుజుకీ లాభాల్లో తగ్గుదల ఆటోమొబైల్ రంగంలోని షేర్లపై కూడా కొంత ప్రభావం చూపింది. గత ఏడాదితో పోలిస్తే 17 శాతం లాభాన్ని మారుతీ కోల్పోయింది.

ఫైనాన్షియల్ రంగ షేర్ల కుంగుబాటు

ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్‌పై సీబీఐ కేసును నమోదు చేయడంతో ఆ సంస్థ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఎన్‌పీఏలను దాచి ఫలితాలను ప్రకటించారనే ఆరోపణలు కూడా చందా కొచ్చర్‌పై వచ్చాయి. దీంతో మదుపరులు విక్రయాలకు పాల్పడ్డారు. దీనికి తోడు హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ బ్యాంక్ షేర్ల నష్టాలు సూచీలను కుంగదీశాయి.

బడ్జెట్ భయాలు

ఎన్నికల సంవత్సరం కావడంతో తాత్కాలిక బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలు ఎక్కువ ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. దీంతో మార్కెట్లలో విక్రయాలు కొనసాగుతున్నాయి. దీనికి తోడు చైనా– అమెరికా వాణిజ్య యుద్ధం భయాలు కూడా మార్కెట్‌ను కుంగదీస్తున్నాయి.

భారీ బ్యాటరీ... బడ్జెట్ ధర... ఇన్ఫినిటీ-వి డిస్‌ప్లే

మార్కెట్లోకి శాంసంగ్ గెలాక్సీ ఎం 10, ఎ20 ఫోన్లు



న్యూఢిల్లీ : శాంసంగ్ గెలాక్సీ ఎం10, గెలాక్సీ ఎం20 ఫోన్లు భారత్‌లో అడుగుపెట్టాయి. యువతను లక్ష్యంగా చేసుకుని శాంసంగ్ తొలిసారిగా ఎం సిరీస్ ఫోన్లను తీసుకువచ్చి భారత్‌లో విడుదల చేసింది. గెలాక్సీ ఎం10, గెలాక్సీ ఎం20 ఫోన్లు రెండు ఇన్ఫినిటీ–వి డిస్‌ప్లే ప్యానెల్స్, డ్యూయల్ రియర్ కెమెరా కలిగి ఉన్నాయి. అలాగే, ఫేస్ అన్‌లాక్ ఫీచర్ ఉన్న ఈ ఫోన్లలో 5000 ఎంఏహెచ్ కలిగిన భారీ బ్యాటరీని ఉపయోగించడం విశేషం. అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి యాప్‌ల ద్వారా హెచ్‌డీ వీడియో స్ట్రీమింగ్ కోసం వైడ్‌వైన్ ఎల్1 సపోర్ట్ ఉంది. ఫిబ్రవరి 5 నుంచి అమెజాన్, శాంసంగ్ ఇండియా ఈ–స్టోర్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు.


ధర, ఆఫర్లు : శాంసంగ్ గెలాక్సీ ఎం 10 2జీబీ ర్యామ్/16 జీబీ ర్యామ్ వేరియంట్ ధర రూ. 7990 కాగా, 3జీబీ ర్యామ్/32 జీబీ వేరియంట్ ధర రూ. 8990. గెలాక్సీ ఎం20లోని 3జీబీ ర్యామ్/32 జీబీ స్టోరేజీ మోడల్ ధర రూ. 10990 కాగా, 4జీబీ/64జీబీ కాన్ఫిగరేషన్ ధర రూ. 12990. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా జియో 4జీ వినియోగదారులకు గెలాక్సీ ఎం–సిరీస్ ఫోన్ల కొనుగోలుపై డబుల్ డేటా లభిస్తుంది. రూ. 198, రూ. 299 రీచార్జ్ ప్యాక్‌లపై ప్రస్తుతం లభిస్తున్న డేటాకు రెండింతలు లభిస్తుంది.

శాంసంగ్ గెలాక్సీ ఎం10 స్పెసిఫికేషన్లు : 6.2 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో ఓఎస్, 19:9 యాస్పెక్ట్ రేషియో, ఎగ్జినోస్ 7870 ఎస్ఓఎస్‌తో కూడిన 2 జీబీ, 3జీబీ ర్యామ్ ఆప్షన్లు ఉన్నాయి. 13+5 ఎంపీ డ్యూయల్ రియర్ కెమెరా, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. గెలాక్సీ ఎం10లో 16 జీబీ, 32 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ ఆప్షన్స్ ఉన్నాయి. ఎస్డీ కార్డు ద్వారా 512 జీబీ వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. 3400 ఎంఏహెచ్ బ్యాటరీని ఉపయోగించారు.

గెలాక్సీ ఎం20 స్పెసిఫికేషన్ : 6.3 అంగుళాల పూర్తి హెచ్‌డీ ప్లస్ ఇన్ఫినిటీ–వి డిస్‌ప్లే, 19.5:9 యాస్పెక్ట్ రేషియో, ఎగ్జినోస్ 7904 ఎస్ఓసీతో కూడిన 3జీబీ, 4జీబీ ర్యామ్ వేరియంట్లు ఉన్నాయి. 13 + 5 మెగాపిక్సల్ డ్యూయల్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సల్ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి.

32 జీబీ, 64 జీబీ ఆన్‌బోర్డ్ స్టోరేజీ ఆప్షన్లు, 512 జీబీ వరకు పెంచుకునే వెసులుబాటు ఉన్నాయి. వెనక ఫింగర్‌ప్రింట్ సెన్సార్, దీనితో పాటు ఫేస్ అన్‌లాక్ ఫీచర్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉన్నాయి.

బ్యాంకర్లతో ఆర్‌బిఐ గవర్నర్ భేటీ



న్యూఢిల్లీ : త్వరలో పరపతి విధాన సమీక్ష ఉన్న నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల సిఇఒలతో భేటీ అయ్యారు. బ్యాంకింగ్ రంగం నుంచి ప్రభుత్వం ఆశిస్తున్నదేమిటో ఆయన తెలిపారు. ఫిబ్రవరి 7న ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ ఆరో పరపతి విధాన సమీక్ష జంగనున్నది. 'బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బిఐ ఏమి ఆశిస్తోందో వారికి తెలియజెప్పడం కోసం భేటీ అయ్యాము. దీనితో పాటు ప్రస్తుత, భవిష్యత్తు అంశాలపై చర్చించాము' అని శక్తికాంత్ దాస్ వెల్లడించారు. ఫిబ్రవరిలో జరగబోయే పరపతి సమీక్షలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించనున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. తమ పాలసీలో సవరణలు తీసుకువచ్చి నిధుల లభ్యతను ఆర్‌బిఐ పెంచవచ్చు. గత ఏడాదితో పోలిస్తే సిపిఐ సగానికి పైగా తగ్గుముఖం పట్టింది.

పుంజుకున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు



ముంబయి : శుక్రవారం ట్రేడింగ్‌లో భారీగా పతనమైన జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు సోమవారం పుంజుకున్నది. మార్కెట్ ఆరంభం నుంచి ఈ షేరు కొనుగోళ్లు జోరుగా జరిగాయి. శుక్రవారం ట్రేడింగ్ తరువాత చాలా బ్రోకరేజీ సంస్థలు జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరుకు బై రేటింగ్ ఇచ్చాయి. దీంతో సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో షేరు ధర 14.29 శాతం ఎగసి 365 వద్దకు చేరింది. ఆ తరువాత కొంచెం తగ్గినా కొనుగోళ్ల జోరు మాత్రం కొనసాగింది. సోమవారం ఇన్వెస్టర్ కాల్‌లో ఒక కీలక విషయాన్ని ఈ సంస్థ వెల్లడించింది. ధరలు పడినా వాటాలను విక్రయించబోమని సంస్థ స్పష్టం చేసింది. దీనికి బదులు వ్యూహాత్మక భాగస్వామిని కలుపుకొని పోయే అంశాన్ని పరిశీలిస్తామని సంస్థ తెలియజేసింది. 'జీ వ్యాపార కార్యకలాపాలు చాలా బలంగా ఉన్నాయి. ఈ సంస్థ వృద్ధి రేటు ఏటా 19 శాతం నమోదవుతోంది' అని సీఎల్ఎస్ఏ బ్రోకరేజీ సంస్థ తెలియజేసింది.

ఇక వాట్సాప్ వెబ్‌లోనూ ఆ ఫీచర్



న్యూఢిల్లీ : వినియోగదారులను ఆకట్టుకునే క్రమంలో వాట్సాప్ సరికొత్త ఆలోచనలతో ముందుకు వస్తోంది. వాట్సాప్ తాజాగా మరో కొత్త ఫీచర్‌ను యూజర్లకు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు మొబైల్ వెర్షన్‌లకు మాత్రమే పరిమితమైన పిక్చర్ ఇన్ పిక్చర్ (పీఐపీ) సౌకర్యాన్ని ఇక వాట్సాప్ వెబ్ యూజర్లకూ అందించనున్నది. అందులో భాగంగా డార్క్ మోడ్ ఫీచర్‌ను తీసుకురానున్నారు. ఇప్పటి వరకు ఐఒఎస్, ఆండ్రాయిడ్ ఒఎస్‌లలో మాత్రమే పిక్చర్ ఇన్ పిక్చర్ సౌకర్యం అందుబాటులో ఉంది. పీఐపీ రాక ముందు సందేశాల్లో ఇచ్చిన వీడియోలను వీక్షించాలంటే లింక్ ద్వారా వేరే యాప్‌లోకి ప్రవేశించాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. వాట్సాప్‌లోనే ఓ చిన్న విండో ఒపెన్ అయి వీడియో రన్ అవుతోంది. దీంతో వీడియో వీక్షిస్తూనే చాటింగ్ కూడా చేయవచ్చు. ఇప్పుడు ఇదే సౌకర్యాన్ని వెబ్ యూజర్లకు కూడా అందించనున్నారు. ఇక వీరు కూడా సందేశాలు పంపుతూనే వీడియోలు చూడవచ్చు. వీరి కోసం పీఐపీ సరికొత్త వెర్షన్ 0.3.2041ను ప్రవేశపెట్టనున్నారు. వెబ్ యూజర్లు ఈ కొత్త వెర్షన్‌కు అప్‌గ్రేడ్ కావాల్సి ఉంటుంది. దశల వారీగా దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారని సమాచారం. ఇప్పటికే తప్పుడు వార్తలను నియంత్రించడానికి వాట్సాప్ సందేశాల విషయంలో పలు సంస్కరణలు తీసుకువచ్చిన విషయం విదితమే. ఐదుగురి కంటే ఎక్కువ మందికి సందేశాలు పంపకుండా పరిమితులు విధించింది. తప్పుడు వార్తల వ్యాప్తితో దేశంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతీ విదితమే.

జియో ఫోన్ వినియోగదారులకు శుభవార్త



న్యూఢిల్లీ : జియో ఫోన్ వినియోగదారు ల ఆదరాభిమానాలను మరింతగా చూరగొనేందుకు టెలికమ్ సంస్థ రిల యన్స్ జియో మరో సరికొత్త అప్లికేషన్‌తో ముందుకు వచ్చింది. ప్రస్తుతం రైలు టిక్కెట్‌లను బుక్ చేసుకునేందుకు ఉపయోగిస్తున్న ఐఆర్‌సీటీసీ యాప్ వలెనే సేవలు అందించే జియో రైల్ యాప్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు డెబిట్, క్రెడిట్ కార్డులు, ఈ– వాలెట్‌లను ఉపయోగించి రైలు టిక్కెట్‌లను బుక్ చేసుకోవచ్చు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమాచారం, పీఎన్ఆర్ స్టేటస్, సీట్ల లభ్యత, టిక్కెట్‌ల రద్దు వంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరిచారు. అంతే కాకుండా చివరి నిమిషాల్లో ప్రయాణం కోసం బుక్ చేసుకునే తత్కాల్ టిక్కెట్‌లను కూడా ఈ యాప్‌ను ఉపయోగించి బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ వినియోగదారులకు ఐఆర్‌సీటీసీ ఖాతా లేకపోయినప్పటికీ జియో రైల్ యాప్‌లో కొత్త ఖాతా సృష్టించుకోవచ్చు. ఈ అప్లికేషన్ జియో యాప్ స్టోర్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంది.

సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుపై సమీక్షించిన ఇ డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఆర్టీసీ సంస్థను నష్టాల నుంచి గట్టెక్కడంతో పాటు ఖర్చును తగ్గించుకునే మార్గాలను ఎంచుకోవడం జరుగుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ, ఐటి), సంస్థ కార్యదర్శి పురుషోత్తం తెలిపారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని డిపోలు, ప్రధాన బస్‌స్టేషన్లు, యూనిట్లలో దశల వారీగా అందుబాటులోకి తీసుకువస్తోన్న సోలార్ ప్లాంట్స్ పురోగతిని సోమవారం ఆయన సంబంధిత సోలార్ సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ శక్తి అభివృద్ధి సంస్థ (టి.ఎస్.ఆర్.ఇ.డి.సి.ఒ) సహకారంతో కార్వీ, వార్స్, సన్ సంస్థలు సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకై ఇంతకుమునుపే ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. సోలార్ ప్లాంట్స్ పనులు ఏ మేరకు పూర్తి అవుతున్నాయో తెలుసుకోవడంతో పాటు వాటి ఏర్పాట్లపై కూడా ఇ.డి సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంస్థ నష్టాల నుంచి గట్టెక్కడంతో పాటు ఖర్చును తగ్గించుకునే మార్గాలను ఎంచుకోవడం జరుగుతోందని, ఈ క్రమంలో సోలార్ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. విద్యుత్తు వినియోగానికి అయ్యే ఖర్చు కంటే ఈ సోలార్ విద్యుత్తు వినియోగంతో చాలా తక్కువ ఖర్చు అవుతుందని, కార్వీ, వార్స్, సన్ కంపెనీలు 4,4,58 కిలోవాట్స్ కెపాసిటీతో కూడిన ప్లాంట్స్‌ను అమర్చడంతో సాలీనా రూ. 2.25కోట్ల మేర ఆదా అవుతుందని తెలిపారు. సోలార్ వాడకం వల్ల అటు పర్యావరణాన్ని కాపాడుకోవడమే కాక సంస్థకు కూడా ఎంతో లాభసాటి అన్నారు. నిర్ధేశించిన సమయంలో సోలార్ ప్లాంట్స్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఒప్పంద కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు.

మినీ థియేటర్ల నిర్మాణంపై ఆర్టీసి అధికారుల అధ్యయనం

- వి సి అండ్ ఎం డి సునీల్ శర్మకు నివేదిక అందజేత
- మరింత అధ్యయనం కోసం త్వరలో లక్నో బస్‌స్టేషన్ సందర్శన



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః బస్‌స్టేషన్లలో మినీ థియేటర్ల ద్వారా సంస్థకు ఏ రకంగా ఆదాయం సమకూరుతుందనే విషయంపై విజయవాడలో పండిత్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఏ.పి.ఎస్.ఆర్టీసీ నిర్మించిన మినీ థియేటర్‌ను తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారుల బృందం అధ్యాయనం చేసి వచ్చారు. వీటిని ప్రయాణీకులు ఎలా ఆదరిస్తున్నారని, ఎంత వరకు ఇవి ఉపయోగపడతాయనే దానితో పాటు ఎంత మేరకు ఆదాయం సమకూరుతుందనే విషయాలపై కూడా పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అక్కడ మినీ థియేటర్లను క్షుణ్ణంగా పరిశీలించి వచ్చిన అధికారుల బృందం అధ్యాయన నివేదికను వి.సి అండ్ ఎం.డి, టి.ఆర్. అండ్ బి ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మకు అందజేశారు. విజయవాడ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మినీ థియేటర్‌లోని రెండు స్క్రీన్స్‌లతో పాటు అక్కడి ప్రేక్షకుల సౌకర్యం కోసం నెలకొల్పిన ఫుడ్ స్టాల్స్ ద్వారా నెలకు రూ. 4.45లక్షలు ఆదాయం ఏ.పి.ఎస్.ఆర్టీసీకి సమకూరుతున్న విషయాన్ని నివేదికలో ప్రస్తావించారు. టి.ఎస్.ఆర్టీసీలోని బస్‌స్టేషన్లలో ఖాళీ స్థలాలను సద్వినియోగపరుచుకోవడానికి ఇక్కడి పరిస్థితులనుగుణంగా కొన్ని మార్పులు చేర్పులతో మినీ థియేటర్ల నిర్మాణాన్ని చేపట్టవచ్చని నివేదికలో పొందుపర్చారు.

అంతేకాకుండా త్వరలో లక్నోలోని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పి.పి.పి) స్కీం ద్వారా నిర్మించిన బస్‌స్టేషన్‌ను కూడా ఇదే బృందం అధ్యాయనం చేసిన తరువాత సంస్థకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఎం.డి సునీల్ శర్మ పేర్కొన్నారు.

టి.ఎస్.ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను ఏ రకంగా ఉపయోగించుకుంటే ఆదాయం సమకూరుతుందనే విషయంపై కూడా లోతుగా అధ్యాయనం చేస్తున్నట్లు చెప్పారు. ఇటు ప్రయాణీకుల సదుపాయాలను మరింత మెరుగు పరచడమే కాక సంస్థ ఆర్థికంగా పుంజుకోవడానికి గల అవకాశాలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు.

చేపలు తింటూ... సెల్ఫీలు దిగుతూ...

పనాజీ : తొలుత ఐదు రాష్ట్రాల ఎన్నికలు.. అనంతరం పార్లమెంట్ శీతాకాల సమావేశాలతో బిజీబిజీగా గడిపిన కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ వీటి నుంచి కాస్త బ్రేక్ తీసుకున్నారు. తల్లి సోనియా గాంధీతో కలిసి ప్రైవేట్ టూర్ ప్లాన్ చేసుకున్నారు. మూడు రోజుల వ్యక్తిగత పర్యటనలో భాగంగా రాహుల్.. తల్లి సోనియాతో కలిసి గోవా వెళ్లారు. టూర్‌లో భాగంగా ఆదివారం దక్షిణ గోవాలో సీఫుడ్‌కు ప్రసిద్ధి చెందిన వార్ఫ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అది కూడా భద్రతా సిబ్బంది లేకుండా. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన కస్టమర్లతో సీఫుడ్‌తో లంచ్ చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ.. సరదగా గడిపారు రాహుల్ గాంధీ. ఈ సందర్భంగా రచ్నా ఫెర్నాండేజ్ అనే టూరిస్ట్ రెస్టారెంట్‌లో రాహుల్ గాంధీతో దిగిన ఫోటోను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయం గురించి రచ్నా మాట్లాడుతూ.. ఆదివారం నా బంధువులతో కలిసి నేను వార్ఫ్ రెస్టారెంట్‌కు వెళ్లాను. ఆ సమయంలో రాహుల్ గాంధీ, ఆయన తల్లి సోనియా గాంధీ కూడా అదే రెస్టారెంట్‌లో ఉన్నారు. వారి వెంట సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం చూసి మేం చాలా ఆశ్చర్యపోయాం అని తెలిపారు.రచ్నా మాట్లాడుతూ.. మీతో ఓ ఫోటో దిగాలని ఉంది అని రాహుల్ గాంధీని కోరాను. అందుకు ఆయన బిల్ పే చేసి వచ్చాక ఫోటో దిగుతానని చెప్పారు. అన్నట్లుగానే నాతో సెల్ఫీ దిగారు అంటూ రాసు కొచ్చారు. అంతేకాక చెత్త రాజకీ యాల్లో చాలా మంచి వ్యక్తి రాహుల్ గాంధీ అంటూ ప్రశంసించారు.



మొదటి పేజీ తరువాయి

అంతా బీసీల వెనుకే

ఉత్సాహం పుట్టించి ఈ జయహో సభలో గ్రామస్థాయిలో కూడా చేపట్టాలని టీడీపీ వ్యూహరచన చేస్తుంటే అందుకు ధీటుగా ప్రధాన ప్రతిపక్షం వైసీపీ కూడా తన బీసీ అస్త్రం తెరపైకి తెస్తోంది. ఫిబ్రవరి 19న బీసీ గర్జన చేపట్టాలని నిర్ణయించిన ఆ పార్టీ నాయకత్వం టీడీపీ చేపట్టిన జయహో బీసీ సభను మరిపించే రీతిలో విజయవంతం చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాము అధికారంలోనున్న రాష్ట్రాలలోనే కాకుండా తమ ప్రత్యర్థులు ఉండే ఇతర తెలుగు రాష్ట్రంలోనూ బీసీ అస్త్రాలను ఇరు తెలుగు పాలక పార్టీలు అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని బీసీ సంఘాలు ఆందోళనవ్యక్తంచేసిన విషయం తెలిసిందే.




దీనిని అస్త్రంగా మల్చుకొని తెలంగాణాలో టీఆర్ఎస్‌ను చెక్‌పెట్టేందుకు టీడీపీ యోచిస్తుంటే, రిటర్న్ గిఫ్ట్ పేరుతో ఏపీలో అడుగుపెట్టేందుకు గులాబీ దళం కూడా బీసీ అస్త్రాన్నే తెలుగుదేశంపై ప్రయోగిస్తోంది. తన కేబినేట్‌లో మంత్రిగా పనిచేసిన, ప్రస్తుత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గులాబీ బాస్ ఏపీలో బీసీలపై పట్టుసాధించేందుకు పావులు కదుపుతున్నారు. ఇటీవల తిరుపతి వచ్చిన తలసాని శ్రీనివాస్ యాదవ్ టీడీపీ సర్కార్ బీసీలకు అన్యాయం చేస్తోందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఏపీలో యాదవులు ఏర్పాటు చేసిన ఓ సభలోనూ తలసాని శ్రీనివాస్ టీడీపీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో పార్టీల గెలుపును వన్‌సైడ్ చేసే శక్తి బీసీలది. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని ప్రధాన పార్టీలు బీసీల బాట పడుతున్నాయి. బీసీలపై వరాల జల్లును కురిపిస్తున్నాయి. కానీ దశాబ్దాలుగా అణిచివేతకు గురవుతున్న బీసీలు రాజకీయంగా చైతన్యమవుతున్న తరుణంలో వారు ఉంచుతున్న డిమాండ్లకు ఏ పార్టీ చేరువయ్యేందుకు ప్రయత్నిస్తుందన్నది ఇక్కడ ఆసక్తిగా మారుతోంది. పాలకవర్గాల మాటలను ఇక నమ్మమని, తమ జనాభా దామాషా ప్రకారం చట్టసభలో, పార్టీ పదవుల్లో తమకు సముచిత స్థానం కావాలని బీసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన పార్టీలు తమ పంథాను ఏ విధంగా అవలంభిస్తాయన్నది ఆసక్తిగా మారుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భవించాక రాష్ట్రంలోని బీసీలందరూ ఆ పార్టీ వైపు మొగ్గుచూపారు. టీడీపీ ఆవిర్భావం నాటి ఆదరణ ప్రస్తుతం తమకు కరువవుతోందని తెలుగుదేశం పార్టీపై బీసీలు గుర్రుగా ఉన్నారు. అయితే తమ పాత ఓటు బ్యాంకుచేజారకూడదని టీడీపీ మరోసారి తమ ప్రయత్నాలను విస్తృతం చేస్తోంది. బీసీ జయహో అన్న కార్యక్రమానికి కూడా టీడీపీ శ్రీకారం చుట్టింది. తద్వారా బీసీ ఓటు బ్యాంకు చేజారకుండా టీడీపీ నాయకత్వం చూసుకొంటోంది. ఇక రెడ్ల పార్టీగా గుర్తింపు పొందిన వైసీపీ నాయకత్వం ఆ ముద్రను పోగొట్టుకొని తాను సైతం బీసీ బాట పట్టక తప్పదని గ్రహించింది. ఈ నేపథ్యంలో టీడీపీ సర్కార్ బీసీలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏమీ అమలుచేయలేదని ఈ నెల 20వ తేదీన బీసీలను సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. అదే సందర్భంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా ప్రజా కూటమి, టీఆర్ఎస్ పోటాపోటీగా బీసీ ఓట్లపై పట్టుసాధించే ప్రయత్నం చేశాయి.




అయితే సీట్ల కేటాయింపు విషయంలో బీసీలకు అన్యాయం జరిగిందన్న విమర్శలు ప్రజా కూటమి, టీఆర్ఎస్, అటు బీజేపీ వంటి పార్టీలు ఎదుర్కొన్న తమ సంక్షేమ పథకాల ద్వారా అధికార గులాబీ పార్టీ బీసీల మెప్పుపొందగలిగిందని రాజకీయ విశ్లేషకుల మాట.

గెలుపును నిర్ణయించే ఓటింగ్ శాతం కంటే మెరుగైన ఓటు బ్యాంకు? ఏ పార్టీ అయినా సరే, అది కేంద్రంలోనైనా రాష్ట్రమైనా 35శాతం నుంచి 40శాతం ఓటింగ్‌శాతంతోనే గెలుస్తాయి. ఈ నేపథ్యంలోనే అన్ని ప్రధాన పార్టీలు తమ గెలుపుకోసం నలభైశాతం ఓటింగ్‌శాతం కోసం విశ్వప్రయత్నాలు చేస్తాయి. ఈ నేపథ్యంలో బలమైన ఓటుబ్యాంకు కలిగి, ఎన్నికల్లో గెలుపును వన్‌సైడ్‌గా శాసించగలిగే ఓటు బీసీల సొత్తు. అందుకే ఎన్నికలొస్తే బీసీ ఓటు బ్యాంకుపైనే అన్ని ప్రధాన పార్టీలు దృష్టిసారిస్తుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో 57శాతంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 54శాతంగా బీసీ జనాభా ఉంది. దీనిని బట్టే బీసీలు ఏ పార్టీకైనా ఎంత ముఖ్యమో ఇట్టే తెలుస్తోంది. త్వరలో ఏపీలో అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశ సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో తిరిగి అధికారం సుస్థిరం చేసుకోవడంతోపాటు కేంద్రంలో చక్రం తిప్పాలంటే మరోసారి టీడీపీకి బీసీ ఓటు బ్యాంకు ఎంతో అవసరం.



ఈ నేపథ్యంలోనే తన నుంచి బీసీ ఓటు బ్యాంకు చేజారకుండా చూసేందుకు టీడీపీ నాయకత్వం జయహో బీసీ కార్యక్రమం చేపట్టబోతోంది. ఈ కార్యక్రమలో బీసీలకు చట్టసభల్లో కేటాయించే సీట్లతోపాటు వారి సంక్షేమ పథకాలు, పార్టీలో వారికిచ్చే ప్రాధాన్యత గురించి వివరించాలని టీడీపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. బీసీ ఓటు బ్యాంకుకు వైసీపీ నాయకత్వం గాళం వేస్తున్న నేపథ్యంలో అప్రమత్తమైన టీడీపీ నాయకత్వం తాను సైతం బీసీలు చేజారకుండా జాగ్రత్తలు తీసుకొంటోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు గత 2014 ఎన్నికల్లో వైసీపీకి మైనార్టీ, దళిత, రెడ్డి సామాజిక వర్గ ఓట్లు వచ్చినా బలమైన బీసీ ఓటు బ్యాంకు టీడీపీకి పోవడం వల్లే ఆ పార్టీ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని వై.ఎస్.జగన్ సన్నిహితులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ నాయకత్వం బీసీ ఓటు బ్యాంకును సాధించుకొనేందుకు ఆ పార్టీ బీసీ నేత జంగా కృష్ణమూర్తి నాయకత్వంలో బీసీ అధ్యయన కమిటీని నియమించారు. ఈ కమిటీ నివేదిక ఇప్పటికే వై.ఎస్.జగన్‌కు అందించింది. పాదయాత్ర ముగిసినందు న వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ బీసీలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.



బీసీ ముఖ్యనేతలతో ఇప్పటికే పలుమార్లు భేటీ అయిన వై.ఎస్.జగన్ ఫిబ్రవరి 19న బీసీ గర్జన నిర్వహించాలని నిర్ణయం తీసుకొన్నారు. ఈ బీసీ గర్జనను పెద్ద ఎత్తున్న నిర్వహించి అందులో ఈ వెనకబడిన కులాలకు చేసే ప్రయోజనాలు, రాజకీయంగా వారి అండగా నిలిచే అంశాలను స్వయంగా ఆ సభలో జగన్మోహన్‌రెడ్డి వెల్లడించే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బీసీ ఓటు బ్యాంకు చేజార కుండా ఉండేందుకు టీడీపీ నాయకత్వం సైతం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఇటీవల చంద్రబాబు, వై.ఎస్.జగన్ తమ తమ పర్యటనలలో బీసీలకు ఇచ్చే టిక్కెట్ల స్థానాలను సైతం వెల్లడిస్తున్నారు. ఇదిలావుంటే తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు ఆపై వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు మరోసారి బీసీ మెప్పుకోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల మెప్పు పొందిన టీఆర్ఎస్ మరోసారి ఆ వర్గాలకు వరాలు ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. మంత్రివర్గ కూర్పును కూడా పంచాయతీ ఎన్నికల అనంతరమే సీఎం కేసీఆర్ చేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎనిమిది కేబినేట్ పదవులు తమకు ఇవ్వాల్సిందేనని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని సైతం సీఎం కేసీఆర్ పరిగణనలోకి తీసుకొంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత ఎన్నికల్లో బీసీలకు దూరమైన కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఆ పొరపాటు దొర్లకుండా చూసుకోవాలని యోచిస్తోంది. ఇలా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అన్ని ప్రధాన పార్టీలు బీసీల జపం మొదలెడుతున్నాయి. బీసీలు మాత్రం ఆచరణలో తమకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే పట్టం కడుతాయని స్పష్టం చేస్తున్నారు.

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే : ధర్మాన

పథకమైనా పెట్టారా అని ప్రశ్నించారు. బీసీలు ప్రశ్నిస్తారనే భయంతో చంద్రబాబు జయహో బీసీ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శిం చారు. బీసీలకు మేలు చేస్తే ఇలాంటి సభలు పెట్టా ల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం లో భాగస్వామిగా ఉన్నప్పుడు ఏ వర్గాలకు చెందిన వారిని కేంద్ర మంత్రులుగా పంపారో అందరికి తెలుసన్నారు. టీడీపీ నుంచి ఒక్క బీసీనైనా రాజ్య సభకు పంపారా అని ప్రశ్నించారు. బీసీలకు జరిగిన అన్యాయాలపై జస్టిస్ ఈశ్వరయ్య చేసిన ఆరోపణలకు చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పలేకపోయారని నిలదీశారు. బీసీలు జడ్జిలుగా పనికిరారు అని కేంద్రానికి లేఖ రాసిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. మత్స్యకారులను ఎస్టీల్లో కలుపుతామని ఓట్లు వేయించుకొని, నిరసన చేస్తే అంతు చూస్తానన్న మాటలను ప్రజలు మర్చిపోలేదన్నారు. కులం పేరుతో నాయీ బ్రాహ్మ ణులను దూషించిన విషయం మర్చిపోయారా అని చంద్రబాబును ప్రశ్నించారు. బీసీలంటే చంద్ర బాబుకు చులకన అని ఆరోపించారు. బీసీలకు ఏం




చేయలేదు కాబట్టే ఇప్పుడు అది చేస్తాం, ఇది చేస్తా మని కపట ప్రేమ నటిస్తున్నారని ఆరోపిం చారు. చంద్రబాబు లాంటి వ్యక్తులు సీఎంగా ఉండడం వల్లే సమసమాజం రావడం లేదన్నారు. బీసీలను దివంగత సీఎం వైఎస్సార్ ఎంతో ప్రేమగా చూసు కున్నారని, వారికోసం దేశంలో ఎక్కడ లేని విధంగా ఫిజు రియింబర్స్‌మెంట్ తీసుకొచ్చారని గుర్తు చేశా రు. వైఎస్సార్ వల్లే బీసీ విద్యార్థులు ఉన్నత చదు వులు చదువుకొని మంచి ఉద్యో గాలు పొందారని చెప్పారు. అతి త్వరలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బీసీల కోసం కార్యాచరణ ప్రకటిస్తారని వెల్లడిం చారు. వైఎస్ జగన్ నాయకత్వంలోనే బీసీల కు న్యాయం జరుగుతుం దన్నారు. ఇన్నాళ్లు అన్యా యం చేసిన చంద్రబాబును బీసీలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. చంద్రబాబు ఏపి ముఖ్యమంత్రి అవ్వడం దురదృష్ట కరమన్నారు. ఎన్నికల సమ యంలో చంద్రబాబు మరో సారి జిమ్మిక్కులు చేస్తు న్నారని విమర్శిం చారు. కేంద్రం తో పొత్తు సమయంలో జయహో బీసీ మీకు అనిపించలేదా, కేంద్రంలో ఇద్దరికి మంత్రి పదవుల కు అవకాశం వస్తే వారిలో ఒక్కరినైనా బీసీలకు అవకాశం ఇచ్చా వా అని ప్రశ్నించారు. వై.ఎస్. క్యాబినెట్ లో బీసీ మంత్రులు ఎంత స్వేచ్ఛగా ఉండేవారో అందరికి తెలుసన్నారు. "బీసీలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఆ పథకాన్ని చంద్రబాబు నీరుగార్చారు. ఇంతమంది బీసీలు నాకు అధికారం ఇచ్చారనే కనీస విశ్వాసం లేకుండా చంద్రబాబు ప్రవర్తించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన బీసీల హామీలు ఎందు కు అమలు చేయలేక పోయారు. జయహో బీసీ అని నటించడానికి ప్రయ త్నిస్తున్నావు. మీ నటన లు కట్టిపెట్టండి. బీసీ సబ్ ప్లాన్‌కు నిధులు మీరు మేనిఫెస్టోలో చెప్పినవిధంగా ఎందుకు కేటాయించ లేదు.స్వర్గీయ ఎన్టీఆర్ ఉన్నప్పుడు బీసీలకు మేలు జరిగిందని నమ్మేవారు. చంద్రబాబూ మీరు ఎన్నిక లకు రండి బీసీలు వారి తఢాఖా చూపిస్తారు. అతి త్వరలోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ బీసీలు ఉన్నతస్థానాలకు ఎదగడానికి అవసరమైన పథకాలు , రాజకీయంగా అభివృద్ధి కలిగే విధంగా ప్రకటించ బోతున్నారు. మీరు మీ మంత్రివర్గంలో ఉన్న బీసీ మంత్రులకు ఏమేర స్వేచ్ఛ ఇచ్చారో ఈ ఐదు సంవత్సరాలలో అందరూ చూశారు. సమసమాజ నిర్మాణానికి వై.ఎస్.జగన్ ముందుకు వస్తున్నారు ఆయనను అందరూ ఆశీర్వదించాలి." అని కోరుతున్నానన్నారు.

ముందస్తు కసరత్తు

ఎన్నికల్లో సీఎం కేసీఆర్ వేసిన 'స్కెచ్' సక్సెస్ కావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్,మేలో జరగనుండడంతో ముందుగానే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఆయన సర్వేలు నిర్వహిస్తున్నారు. సర్వేల ఆధారంగానే ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే 2019 లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వివిధ సర్వే మీడియా సంస్థలు చేస్తున్న సర్వేలను, అలాగే ఆయన ప్రైవేట్ సంస్థతో చేయిస్తున్న సర్వేలు తెప్పించుకొని వాటిని బేరీజు వేసుకుంటున్నారట.. వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఎంపీ సీట్లు ఇవ్వాలి.? ఎవరు గెలుస్తారనే దానిపై కసరత్తు చేస్తున్నారు.

కేసీఆర్ తాజాగా ఇద్దరు ఎంపీ అభ్యర్థులను ఖాయం చేశారని విశ్వసనీయ సమాచారం. అందులో ఒకరు ఎంపీ జితేందర్ రెడ్డి కాగా రెండో వ్యక్తి మాజీ మంత్రి పి. రాములు అంటున్నారు. ఇక పెద్దపల్లి నుంచి వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఎంపీ సీటు ఇవ్వాలనే దానిపై కేసీఆర్ డైలామాలో పడ్డట్లు తెలుస్తోంది. మొదట గడ్డం వివేక్ కు పెద్దపల్లి ఎంపీ పదవి అని భావించినప్పటికీ.. ఇటీవల ఎన్నికల్లో వివేక్ సోదరుడు టీఆర్ ఎస్ పై తిరుగుబాటు చేసి బెల్లంపల్లిలో నిలబడడం.. వివేక్ కూడా ధర్మపురిలో టీఆర్ ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ ను ఓడించేందుకు శతవిధాలా ప్రయత్నించడంతో వివేక్ కు టికెట్ విషయంలో కేసీఆర్ వెనకడుగు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై కేసీఆర్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇక ఖమ్మం నుంచి మరోసారి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికే టికెట్ ఖాయం చేసినట్టు టీఆర్ ఎస్ వర్గాల సమాచారం. సికింద్రాబాద్, మల్కాజిగిరి నుంచి పోటీ చేసే అభ్యర్థులు భారీగా ఉండడంతో వారిపై ప్రజల్లో ఏమేరకు మంచిపేరుందో తెలుసుకుంటున్నట్లు సమాచారం. కేసీఆర్ ప్రస్తుతం వివిధ వర్గాల నుంచి ప్రజల నాడిని పసిగట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఇంటెలిజెన్స్ ద్వారా కూడా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. అయితే ఇప్పటికే పలువురు ఎంపీలకు కేసీఆర్-కేటీఆర్‌లు లైన్ క్లియర్ చేసినట్టు సమాచారం. వారంతా ఇప్పటికే తమ నియోజకవర్గంలో రంగంలోకి దిగి పని చేసుకుంటూ పోతున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో 16పార్లమెంట్ నియోజకవర్గాలలో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



రాష్ట్రాలకు ఈసీ లేఖలు

పొందిందని భారత ఎన్నికల సంఘం అధికారులకు సి.యస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించడానికి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు త్వరలోనే రాష్ట్రాలను పర్యటిస్తారని సి.యస్ తెలిపారు. రాష్ట్రానికి సంబంధించి ఓటర్ల జాబితాను ను ఫిబ్రవరి 22 న ప్రకటిస్తామన్నారు. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో వచ్చే నెల 5 న సమావేశం జరుగనున్నదని సి.యస్ కేంద్ర ఎన్నికల అధికారులకు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ ను కేటాయిస్తామన్నారు.

గట్టి బందోబస్తు : రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించామని, పంచాయతీ ఎన్నికలు 2 దశలు పూర్తయ్యాయని, మూడవ దశ ఈ నెల 30 న జరుగనున్నదని, పార్లమెంటు ఎన్నికలను కూడ ఎటువంటి సంఘటనలు జరగకుండా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నక్సల్స్ ప్రభావంపై చత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రాలతో ప్రత్యేక దృష్టితో కార్యచరణప్రణాళికను అమలు చేస్తామన్నారు. అంతరాష్ట్ర చెక్ పోస్టుల ఏర్పాటు, గత ఎన్నికల కేసుల పరిష్కారానికి చర్యలు, సమాచార మార్పిడి తదితర అంశాలపై వారికి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వారికి తెలిపారు. శాసన సభ ఎన్నికలకు పొరుగు రాష్ట్రాలనుండి 19 వేల మంది, కేంద్రం నుండి 276 కంపెనీల పోలీసు సిబ్బందిని కేటాయించారని, అదే స్థాయిలో పార్లమెంటు ఎన్నికలకు కేటాయించాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా 97 కోట్లు చేశామని, కేసులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి చేయవలసిన ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ధన, మద్యం ప్రభావాన్ని నిరోధించడానికి తగు చర్యలు చేపడతామన్నారు.



సర్వం సిద్ధం : సి.ఈ.ఓ రజత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘంలో అవసరమైన సిబ్బంది, రిజర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1950 అన్ని జిల్లాలలో ప్రారంభించామని, సిబ్బందికి శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, 16 లక్షల క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ వచ్చాయని, పంచాయతీ ఎన్నికలు ఉన్నందున గడువును ఫిబ్రవరి 4 వరకు పొడిగించారని తెలిపారు. శాసన సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని, ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణనిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలలో దివ్యాంగులకు చేసిన ఏర్పాట్లకు గాను జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డ్ వచ్చిందని, రాష్ట్రం దివ్యాంగుల ఓటింగ్ విషయం లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని, ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇటీవల శాసన సభ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు నిర్వహించామని ఆయన వివరించారు.

ఈసీ కీలక ఆదేశాలు.. రాష్ట్రాలకు లేఖలు : త్వరలో లోక్‌సభతో పాటు పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల సంఘం ప్రధాన అధికారులకు, ఆయా రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాసింది. పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో స్పష్టమైన సూచనలు చేసింది. అధికారులకు సొంత జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వరాదని ఈసీ సూచించింది.

గత నాలుగేళ్లలో వరుసగా మూడేళ్లపాటు పనిచేసిన జిల్లాల్లో ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించరాదని తన లేఖలో పేర్కొంది. 2019 మార్చి 31 వరకు ఒకే జిల్లాలో పదవీకాలం మూడేళ్ల పూర్తవ్వనున్న ఉద్యోగులకు సదరు జిల్లాలో పోస్టింగ్ ఇవ్వరాదని స్పష్టంచేసింది. 2017 మే 31కి ముందు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన జిల్లాల్లో.. డీఈవో, ఆర్వో, ఏఆర్వో, ఎస్సైలకు తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వరాదని సూచించింది. 2019లో లోక్‌సభతో పాటు ఏపీ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ఈ లేఖలు రాసింది.

ఫిబ్రవరి 9,10 తేదీల్లో కొండవీడు ఫెస్టివల్

గుంటూరు, మేజర్‌న్యూస్: ఫిబ్రవరి 9, 10 తేదీల్లో కొండవీడు ఫెస్టివల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తున్నట్టు మంత్రులు



ప్రత్తిపాటి పుల్లారావు, శిద్దా రాఘవరావులు వెల్లడించారు. కొండవీడు కోట అభివృద్ధి పనులపై గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం మంత్రులు శిద్దా రాఘవరావు, ప్రత్తిపాటి పుల్లారావులు సమీక్ష నిర్వహించారు. కోట అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 87 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడును తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని చెప్పారు. 700 ఏళ్ల చర్రి కలిగిన కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, ప్రపంచ స్థాయిలో పర్యాటలకును ఆకర్షిస్తామని స్పష్టం చేశారు. వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మూడో శతాబ్దం నాటి ఆనవాళ్లు కోట మరమ్మతులలో భాగంగా బయటపడ్డాయని చెప్పారు. భావితరాలకు కొండవీటి కోట చార్త్రిక విశిష్టతను తెలియజెప్పాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఏటా కొండవీడు కోట ఫెస్టివల్‌ను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కొండ మీద అన్ని రకాల మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం హబ్‌గా కొండవీడను తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొండ పండుగ జరిగే రెండు రోజులు పర్యాటకుల కోసం సాహస, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్, పిసిసిఎఫ్ రిజ్వీ, జాయింట్ కలెక్టర్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ చోరీ

రూ.పది కోట్ల నగదు, ఐదు కిలోల బంగారం అపహరణ

చెన్నై: తమిళనాడు తిరుచ్చి జిల్లాలోని సమయపురం పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ చోరీ జరిగింది. బ్యాంకులోని 10 కోట్ల రూపాయల నగదు, 5 కేజీల బంగారాన్ని దుండగులు అపహరించారు. జాతీయ రహదారి పక్కనే ఉండే సమయపురంలో ఇంతటి భారీ దోపిడీ జరగడం జిల్లాలో కలకలం రేపుతుంది. వివరాల్లోకి వెళ్తే.. 26, 27 తేదీలు బ్యాంకుకు సెలవు దినాలు కావడంతో సోమవారం ఉదయం సిబ్బంది బ్యాంకు తెరిచారు. అనంతరం బ్యాంకు లోపలికి వెళ్లి చూడగా చోరీ విషయం బయటపడింది. గోడకు కన్నం పెట్టిన దుండగులు బ్యాంకు స్ట్రాంగ్ రూమ్‌లోని ప్రవేశించినట్టుగా తెలుస్తోంది.బ్యాంకు సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బ్యాంకు వెనక భాగంలో వెల్డింగ్ మిషన్‌తోపాటు పలు పరికరాలను పోలీసులు గుర్తించారు. అక్కడ లభ్యమైన ఆధారాలను బట్టి ముగ్గురు వ్యక్తులు ఈ దోపిడీలో పాల్గొన్నట్టు వారు అనుమానిస్తున్నారు. బ్యాంకు సీసీటీవీల్లో రికార్డైన దృశ్యాలను సేకరిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృఎందాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.


దేశం 'ఓవర్‌డోస్'తో బాధపడుతోంది : ఒమర్

శ్రీనగర్ : ఓఆర్ఓపీ అంటూ భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. షా విమర్శలను తిప్పికొడుతూ దేశం 'ఓడీఓఎంఓఎస్'తో బాధపడుతోందని ఒమర్ సోమవారం ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రాను ఉద్దేశించి అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 'మిగతా దేశం మొత్తం ఓడీఓఎంఓఎస్‌తో బాధపడుతోంది. దానికి అర్థం ఓవర్‌డోస్ ఆఫ్ ఓన్లీ మోడీ ఓన్లీ షా (మోడీ, షా డోస్ ఎక్కువగా ఉంది)' అని అబ్దుల్లా ట్వీట్ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో ర్యాలీ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, 'భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే వన్ ర్యాంకు వన్ పెన్షన్ (ఓఆర్ఓపీ) హామీని అమలు చేసింది. కాంగ్రెస్ మాత్రం దేశానికి ఓన్లీ రాహుల్ ఓన్లీ ప్రియాంక (ఓఆర్ఓపీ)ని ఇచ్చింది' అంటూ కాంగ్రెస్ మీద విమర్శలు చేశారు. ప్రియాంక గాంధీ అధికారికంగా రాజకీయాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో షా ఈ వ్యాఖ్యలు చేశారు

మొదటి పేజీ తరువాయి

పేదోడికి కనీస ఆదాయం

చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంటామన్నారు. రాహుల్ చెబుతున్న పథకం అమల్లోకి వస్తే.. దేశంలో పేదలందరూ కనీస ఆదాయం పొందనున్నారు.



ఆకలి, పేదరికం లేని నవభారత నిర్మాణమే తమ లక్ష్యమని రాహుల్ ప్రకటించారు. ఈ పథకం ప్రకారం నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయనున్నారు. ప్రపంచంలో ఏ దేశం అమలు చేయని రీతిలో ఈ పథకాన్ని అమలు చేస్తామని రాహుల్ ప్రకటించారు. కోట్లాది మంది ఆకలి, పేదరికంతో అలమటిస్తుంటే నవభారతాన్ని నిర్మించలేమని రాహుల్ తెలిపారు. పేదరిక నిర్మూలనకు ఈ పథకం దోహదం చేస్తుందని రాహుల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా వివాదాస్పద రాఫెల్ డీల్‌కు సంబంధించిన ఫైళ్లు తన వద్దే ఉంచుకున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌పై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారంనాడు ఓ ట్వీట్‌లో డిమాండ్ చేశారు. 'రాఫెల్‌పై గోవా ఆడియో టేపులు విడుదల చేసి 30 రోజులైంది. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కానీ దర్యాప్తునకు ఆదేశించడం కానీ ఇంతవరకూ జరగలేదు. మంత్రిపై ఎలాంటి చర్యలూ లేవు. అవి అసలైన టేపులే. ఆ టేపులతో రాఫెల్ సీక్రెట్లు బయటపడతాయి. ఆ టేపులు కలిగి ఉండటం వల్లే పారికర్‌కు పీఎంపై అధిపత్యం వస్తుంది' అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ డీల్‌కు సంబంధించిన అన్ని ఫైళ్లూ గోవా సీఎం మనోహర్ పారికర్ దగ్గరే ఉన్నట్టు చెబుతున్న ఓ ఆడియో క్లిప్‌ను కాంగ్రెస్ పార్టీ ఈనెల మొదట్లో విడుదల చేసింది. ఈ డీల్‌కు సంబంధించి గోవా మంత్రి విశ్వజిత్ రాణే మరో వ్యక్తితో మాట్లాడిన టేప్ ఇదని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా తెలిపారు. 2016లో ఇండియా-ఫ్రాన్స్ మధ్య రాఫెల్ డీల్‌పై సంతకాలు జరిగినప్పుడు కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా పారికర్ ఉన్నారని, ఆయన బెడ్‌రూంలోనే ఇందుకు సంబంధించిన ఫైళ్లు ఉన్నాయని రాణే చెప్పినట్టు ఆ టేప్‌లో ఉందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అయితే, ఆ ఆరోపణలను రాణే ఖండించారు. కాంగ్రెస్ టేపు నకిలీదని, రాఫెల్ డీల్ గురించి కానీ, డాక్యుమెంట్ల గురించి కానీ పారికర్ ఎలాంటి ప్రస్తావన చేయలేదని రాణే వివరణ ఇచ్చారు.



సీఎంతో భేటీ అయిన ఏపి జెఏసి

వెలగపూడి, సూర్య ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఏపి జెఏసి అమరావతి ప్రతినిధులు సోమవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో భేటి అయ్యారు. కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్,ఎన్నెమ్మార్ ఉద్యోగుల డిమాండ్లను సీఎం దష్టికి తెచ్చారు. 19ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులు 29వేలమంది పనిచేస్తున్నారు. విద్యా, వైద్య, పంచాయితీరాజ్, జలవనరుల శాఖలో ఉన్నారు. 180రోజుల మెటర్నటీ లీవ్, డెత్ ఎక్స్‌గ్రేషియా, హెల్త్ కార్డులు ఇవ్వాలన్న తమ డిమాండ్లను సీఎం దష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ విరమణ వయోపరిమితిని 58ఏళ్ల నుంచి 60ఏళ్లకు పెంచాలని కోరారు. డెత్ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఎన్నెమ్మార్, డెయిలీ వేజ్, పార్ట్ టైమ్, ఫుల్ టైమ్, కంటింజెంట్ ఉద్యోగులు 25ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారికి హెల్త్ కార్డులు,కాజువల్ లీవ్స్, ఫ్యునరల్ ఎక్స్ పెండిచర్ వంటి డిమాండ్లు అపరిష్క తంగా ఉన్నాయని తెలిపారు. అవుట్ సోర్సింగ్‌లో లక్షా 80వేల మంది పనిచేస్తున్నారని వారందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ సంఘాల జెఏసి డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వారి డిమాండ్లను ఆర్థికమంత్రి యనమల రామకష్ణుడు పరిశీలించి వీలైనన్నింటిని వెంటనే నెరవేర్చాలని సూచించారు.

ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రితో మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరితగతిన మధ్యంతర భతి అంశాన్ని, సిపిఎస్ రద్దు అంశాన్ని సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ భేటిలో ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ఏపిజెఏసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టివి ఫణి పేర్రాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆల్ఫ్రెడ్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎస్. కొండయ్య, క ష్ణా జిల్లా జెఏసి అధ్యక్షుడు డి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ప్రభుత్వం చేయూత

● సౌకర్యవంతంగా మక్కా యాత్రను పూర్తిచేసుకుని స్వస్థలాలకు చేరుకునే విధంగా ప్రభుత్వం చర్యలు ● ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లడానికి 2,500 మందికి అనుమతి మంత్రి ఎన్.ఎం.డీ ఫారూక్

విజయవాడ, సూర్య బ్యూరో : దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా హజ్ యాత్రికులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తూ వారు సౌకర్యవంతంగా మక్కా యాత్రను పూర్తిచేసుకుని స్వస్థలాలకు చేరుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫారూక్ తెలిపారు. సోమవారం ముస్లిం కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో హజ్ యాత్రికులకు సేవలు అందించేందుకు వాలంటీర్లుగా ప్రభుత్వ ఉద్యోగులను లాటరీ ద్వారా 11 మందిని ఎంపిక చేసే కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫారూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫారూక్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం తన జీవితంలో ఒకసారైనా మక్కా యాత్రకు వెళ్లాలని అనుకుంటారన్నారు. అలా మక్కా యాత్రకు వెళ్ళే హజ్ యాత్రికులకు సేవ చేయడానికి అవసరమైన సమాచారం ప్రభుత్వానికి అందించడం కోసం ప్రభుత్వ ఉద్యోగులను వాలంటీర్లుగా ఏపి హజ్ కమిటీ ఎంపిక చేసిందన్నారు. మొత్తం ఆన్‌లైన్‌లో ధరఖాస్తులను స్వీకరించి లాటరీ తీయడం జరిగిందన్నారు. హజ్ యాత్రికులపై జిఎస్టీ సుంకాన్ని 12 శాతం వేసి ఇపుడు 5 శాతంకి తగ్గించారని ఆ సుంకం కూడా లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లతానన్నారు. 33 సంవత్సరాల క్రితం హజ్ యాత్రకు తీసుకువెళ్లేవారిని ముంబై తీసుకువెళ్లి అక్కడ నుంచి ఓడల్లో తీసుకువెళ్లేవారమన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లడానికి 2,500 మందికి అనుమతి ఉండగా 2,100 మంది ధరఖాస్తు చేసుకున్నారన్నారు. తదనంతర కాలంలో హైదరాబాదు నుంచి నేరుగా మక్కా హజ్ యాత్రకు పోయే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మొదటి విమానాన్ని




ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాదులో రూ. 10 కోట్లతో హజ్ భవనాన్ని ఏర్పాటు చేశామన్నారు. కడపలో 20 కోట్లతో ఏర్పాటు చేసిన హజ్ భవనం పూర్తికా వొచ్చిందని త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. విజయవాడలో రూ. 80 కోట్లతో చేపట్టిన హజ్ భవనం పనులకు ఈ ఏడాది రూ. 40 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. ప్రభుత్వ విప్ మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా హజ్ యాత్రికుల కోసం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కోటి రూపాయలు ఇస్తున్నా ఏపిలో 3 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. హజ్ యాత్రికులకు



సేవ చేయడానికి నియమించిన 10 మంది వాలంటీర్లకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షలు చొపన మొత్తం రూ. 30 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. వచ్చే ఏడాది నుంచి గన్నవరం విమానాశ్రయం నుంచే నేరుగా మక్కా యాత్రకు హజ్ యాత్రికులు వెళ్ళే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. హజ్ కమిటీ ఛైర్మన్ అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ హజ్ యాత్రికులకు ప్రభుత్వానికి మధ్య కోఆర్డినేట్ చేయడానికి వాలంటీర్లు ఎంతగానో దోహదపడతారన్నారు. ఏపి నుంచి 2,135 మంది హజ్ యాత్రికులలో 1,119 మంది పురుషులు, 1,016 మంది మహిళలు, వీరిలో 70 ఏళ్లు పైబడిన వారు 40 మంది ఉన్నారు. అనంతపురం298, చిత్తూరు206, ఈస్ట్ గోదావరి39, గుంటూరు326, కడప241, కృష్ణా230, కర్నూలు473, నెల్లూరు121, ప్రకాశం43, శ్రీకాకుళం7, విశాఖపట్నం90, విజయనగరం24, పశ్చిమగోదావరి37 మంది ఆయా జిల్లాలకు చెందిన వారు డ్రాతో నిమిత్తం లేకుండానే హజ్ యాత్రకు ఎంపికయ్యారు.

వాలంటీర్లుగా అనంతరవుంషేక్ షా వలి, చిత్తూరుహిదాయత్ జర్దూస్‌ఖాన్, ఈస్ట్, వెస్ట్ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం నుంచి సయ్యద్ యాహి యా, గుంటూరు నుంచి షేక్ మస్తాన్ వలి, మహ్మద్ మస్తాన్ వలి, కడప నుంచి షేక్ మొహినుద్దీన్, కృష్ణా నుంచి మహ్మద్ ఖుద్రతుల్ ఐన్, కర్నూలు నుంచి అతావూర్ రహ్మాన్, సయ్యద్ ఇక్బాల్ భాషా, ప్రకాశం, నెల్లూరుఎం.మెహబూబ్ భాషా లు హజ్ యాత్రికులు తమ హజ్ యాత్రను ముగించుకుని ఏపికి తిరిగి వచ్చేందుకు వాలంటీర్లుగా సేవలు అందిస్తారు. వాలంటీర్ల డ్రా కార్యక్రమంలో హజ్ కమిటీ ఎండీ లియాహత్ ఆలీ, హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం
(రెవెన్యూ (భూసేకరణ) శాఖ)
ఫారం - సి
(10వ నిబంధన, సెక్షన్ 11 క్రింద)
(రూల్ 6/12 చూడండి)
నోటిఫికేషన్

ఈ/192/2018 తేది : 22-10-2018
గెజిట్ ఆర్.ఓ.నెం. 154 తేది : 26-10-2018
నెం. 1/03/2018-1 తేది : 20-08-2018

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలోని 190 సర్వే నం.లో ఎ. 150.30 గుంటల విస్తీర్ణం గల భూమిని ... రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలోని ఎ.150.30 గుంటల విస్తీర్ణం గల భూమిని ...

క్ర.సం.	సర్వే నెం.	...	...	విస్తీర్ణం	అనుభవదారుని పేరు & చిరునామా	సరిహద్దులు: దక్షిణం	ఉత్తరం	తూర్పు	పడమర
చందనవెల్లి గ్రామం									
[illegible]									

గడువులోగా పట్టణ పేదల ఇళ్ల నిర్మాణాలు

ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ ఆదేశం

(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :నిర్దేశించిన గడువులోగా పట్టణ పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర వునేఠ ఆదేశించారు. సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన స్టేట్ లెవల్ సాంక్షన్, మోనటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ముందుగా, రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై ఏపీ టీడ్కో ఎం.డి. బీఎం.దివాన్ మైదీన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎస్ కు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మున్సిపల్, కార్పొరేషన్లలో 10,15,663 ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వాటిలో పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాల పథకం కింద 5,67,898 ఇళ్ల నిర్మాణాలకు గానూ 4,60,492 ఇళ్లకు టెండర్లు ఫైనలైజ్ కాగా, వాటిలో 3,67,629 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమవ్వగా, జి ప్లస్ 3 పద్ధతిలో 1,47,583 ఇళ్లు స్లాబుల వరకూ పూర్తయ్యాయన్నారు. రాబోయే మూడు నెలల్లో 65,133 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పీఎంఏవై-ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్(బి.ఎల్.సి.) కింద రూ. 4,47,765 ఇళ్లు మంజూరు కాగా, 2,30,276 ఇళ్ల టెండర్లు అనుమతులు వచ్చాయన్నారు. వాటిలో 1,12,746 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, 75,113 ఇళ్ల నిర్మాణాలు పూర్తికావొచ్చాయన్నారు. కొత్తగా మరో 1,05,956 ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చిందన్నారు. వాటికి సంబంధించిన డీపీఆర్ లు సిద్ధం చేశామని, స్టేట్ లెవల్ సాంక్షన్, మోనటరింగ్ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉందని సీఎస్ అనిల్ చంద్ర వునేఠకు ఆయన వివరించారు. 1,05,956 ఇళ్లకు ఎంత వ్యయమవుతుందని, ఒక్కో ఇంటికి ఎంతమేర నిధులు కేటాయిస్తున్నారని సీఎస్ ప్రశ్నించారు. రూ. 3,992.71 కోట్లు వ్యయమవుతుందని, ఇందులో కేంద్రం వాటా 1,589.33 కోట్లు కాగా, సబ్సిడీ, మౌలిక సదుపాయల



కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 1,041.79 కోట్లు భరించనుందన్నారు. లబ్ధిదారుల వాటా 1,361.57 కోట్లు అని వివరించారు. ఒక్కో లబ్ధిదారుని వాటాగా రూ. 50 వేల కాగా, నాలుగు లక్షల రూపాయల వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారునికి సబ్సిడీ అందజేస్తాయని ఏపీ టిడ్కో ఎం.డి. దివాన్ మైదీన్ తెలిపారు. మిగిలిన మొత్తం రుణంగా మెప్మా ద్వారా బ్యాంకుల నుంచి మంజూరు చేయిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకోవాలని సీఎస్ అనిల్ చంద్ర వునేఠ ఆదేశించారు. పేదోడి సొంతంటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 1,05,956 ఇళ్లకు సంబంధించిన డీపీఆర్ లను సీఎస్ నేత త్వంలోని స్టేట్ లెవల్ సాంక్షన్, మోనటరింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ డీపీఆర్ లను బుధవారం ఢిల్లీలో జరగబోయే సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారులకు టిడ్కో అధికారులు అందజేసి, అనుమతులు పొందనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో,, ఫైనాన్స్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై సిఎం సమీక్ష



అమరావతి, సూర్య బ్యూరో : తొమ్మిది సంక్షేమ కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఏపీలో చేపట్టిన ప్రకృతి సేద్యంపై దావోస్‌లో చర్చ జరిగిందని ఆయన తెలిపారు. అన్న క్యాంటీన్ల సమస్య లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే ఖరీఫ్‌కు ప్రణాళికలు రూపొందిం చాలని, కొత్తగా 69 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 2,3,4 తేదీల్లో 4 లక్షల ఇళ్లలో గహప్రవేశం కార్యక్రమం నిర్వహిస్తామని, వచ్చేనెల 2లోపు పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని చంద్రబాబు ఆదేశించారు.

ఇక ప్రభుత్వ కార్యాలయాలకు

కియా ఎలక్ట్రానిక్ వాహనాలు



అమరావతి, సూర్య ప్రతినిధి :ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపి ప్రభుత్వ డ్రైవర్ల సంఘ సమస్యలపై డ్రైవర్ల సంఘ ప్రతినిధులు కలసి తమ సమస్యలని వివరించారు. ఇప్పటికే అద్దె వాహనాల వలన రాష్ట్రానికి ఆర్థిక భారం పడుతోందని వాటి స్థానంలో కియో మోటార్ ఎలక్ట్రానిక్ వాహనాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందించాలని కోరారు. తద్వారా ఇంధన ఖర్చులు, కాలుష్యం లేని రాష్టంగా తయారు చేయాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి చేరువ చేసినట్టు అవుతుందని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖలో జిల్లాకు కనీసం ఒక వాహనం చొప్పున వెంటనే వాహనాలను సమకూర్చితే బోలెడు నిధులు ఆదా అవుతాయని తెలిపారు. డ్రైయివర్ల ప్రతిపాదనలకు సిఎం సానుకూలంగా స్పందించి కియో మోటార్ వాహనాలను ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులకు వినియోగించే విదంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సంఘ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య మీడియాకు చెప్పారు. అలాగే అగ్నిమాపక శాఖ లో డ్రైవర్ ఆపరేటర్‌లకు శాఖా నిబంధనలలో లేని సెంట్రీ డూటీల నుండి మినహాయింపును ఇవ్వాలన్న సంఘ ప్రతినిధుల వినతిని కూడా పరిగణలోనికి తీసుకుని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోమని ఆదేశాలు ఇస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. సిఎం కలసిన వారిలో అమరావతి ఛైర్మెన్ బొప్పరాజుతో పాటు 13 జిల్లాల అధ్యక్షులు ఉన్నారు.

బస్సు బోల్తాపై ఘటనపై మంత్రి కిడారి ఆరా



వెల్దుర్తి, సూర్య ప్రతినిధి : గుంటూరుజిల్లా వెల్దుర్తి మం డలం మండాది వాగు సమీపంలో స్కూల్ బస్సు బోల్తా ఘటనపై జిల్లా వైద్యాధికారులను మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఆరా తీశారు. ప్రమాదంలో గాయ ఎడిన విద్యార్థులకు మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స జరు గుతుంది. సుమారు 50మంది విద్యా ర్థులు ఆసుపత్రికి వచ్చారని అందులో 14 మందికి చికిత్స చేశామని, ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు వైద్యాధికారులు మంత్రికి తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో మాచర్ల ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో లేరన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలను మంత్రి కిడారి ఖండించారు. ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారులను మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశించారు.

సీఎంకు కృతజ్ఞతలు

అమరావతి, సూర్య ప్రతినిధి : ఎన్ని సమస్యలున్నా ప్రజలు ఇబ్బందులు పడకూడదని రాష్ట్రంలోని అన్ని వర్గాలను సంతప్తిపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అదనవు పించను10శాతం పెంచినందుకు ప్రభుత్వంలో సుదీర్ఘంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పించనుదార్లు సిఎంను సచివాలయంలో కలిసి కతజ్ఞతలు తెలిపారు. లోటుఉన్నా ప్రభుత్వ పిం చానుదార్లు కష్టపడకూడదని అదనవు పించను పంచామని సిఎం తెలిపారు.

కోటి రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు : స్పీకర్ కోడెల



సత్తెనపల్లి, సూర్య ప్రతినిధి : సత్తెనపల్లి నియోజకవర్గం ముపాళ్ల మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఏపీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పర్యటించారు. సుమారు కోటి రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్పీకర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

'దగ్గుబాటికి జగన్ గురించి తెలియదు'



మంత్రి ఆదినారాయణరెడ్డి

అమరావతి, సూర్య బ్యూరో : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మహానాయకుడవుతాడంటూ దగ్గుబాటి వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆదినారాయణరెడ్డి స్పందించారు. సోమవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ జగన్ గురించి దగ్గుబాటికి పూర్తిగా తెలియదన్నారు. టీడీపీ పాలనపై దగ్గుబాటి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గుప్పెడు పనిచేసిన వైఎస్ మహానాయకుడైతే గంపెడు పనులు చేసిన చంద్రబాబును ఏమనాలని ఆదినారాయణరెడ్డి అన్నారు.

వైఎస్ బీసీలను మోసం చేశారు



టీడీపీనేత అనురాధ

విజయవాడ, సూర్య బ్యూరో : బీసీ విద్యార్థులకు విదేశీ విద్య వైఎస్ హయాంలో అందని ద్రాక్షలా ఉండేదని టీడీపీనేత పంచుమర్తి అనురాధ అన్నారు. గతంలో బీసీ ఫెడరేషన్లు అని చెప్పి వైఎస్ బీసీలను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే బీసీ విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారన్నారు. రూ. 100 కోట్లతో బీసీ భవన్ ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు ప్రకటన హర్షణీయమన్నారు. బీసీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబుకు కతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నేతలు ధర్మాన ప్రసాద్, పార్థసారథి వాస్తవాలు మాట్లాడటం లేదని ధ్వజమెత్తారు.


వైసీపీలో దగ్గుబాటిచేరికపై పలువురు విమర్శలు



దగ్గుబాటి వైసీపీలో చేరికపై పలువురు విమర్శలు

విజయవాడ, సూర్య బ్యూరో : వైసీపీ అధినేత, ఏపీ ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వ రరావు భేటీ అయిన సంగతి తెలిసిందే. దగ్గుబాటి వైసీపీలో చేరికపై పలువురు తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చేరికపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు రియాక్టయ్యారు. కాంగ్రెస్‌నేత సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ పురంధేశ్వరి బీజేపీలో ఉండి ఆమె కుమారుడు హితేష్‌ని వైసీపీలో చేరిపించడం సిగ్గుచేటని పద్మశ్రీ వ్యాఖ్యానించారు. బీజేపీ, వైసీపీ తెరచాటు బాగోతం దగ్గుబాటి చేరికతో తెలిసిపోయిందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. దగ్గబాటి వైసీపీలో చేరడం ఆ పార్టీ నేతల్లో తీవ్ర అసంతప్తి రగిలిస్తోంది. దగ్గుబాటి చేరికకు వ్యతిరేకంగా పర్చూరులో వైసీపీ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి వైసీపీ మండల కన్వీనర్లు, నేతలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు హితేష్ చెంచురాంకు పర్చూరు టికెట్ ఇవ్వడం తగదని నేతలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. అయితే ఈ తరుణంలో వైసీపీ అధిష్టానం ఎలా ముందుకెళ్తుందన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సీఎంపై వైసీపీ నేతల దుష్ప్రచారం చేస్తున్నారు



మంత్రి జవహర్

అమరావతి, సూర్య బ్యూరో : చంద్రబాబుపై వైసీపీ నేతల దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి జవహర్ ధ్వజమెత్తారు. జగన్ నవరత్నాలు, నకిలీ రత్నాలు అంటూ ఎద్దేవా చేశారు. జగన్ సీఎం అయ్యేది లేదు, చేసేది లేదంటూ విమర్శించారు. అయినా జగన్ పథకాలను కాపీ కొట్టాల్సిన అవసరం చంద్రబాబుకు లేదని చెప్పారు. బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు చంద్రబాబు వెనుకే ఉన్నారని వివరించారు. బీసీ సదస్సు చూసి జగన్ వెన్నులో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు. పురందేశ్వరికీ చంద్రబాబే టార్గెట్ అన్నారు.


ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం



మంత్రి ప్రత్తిపాటి

అమరావతి, సూర్య బ్యూరో : చంద్రబాబు మళ్లీ సీఎం కాకపోతే రాజధాని వేరే ప్రాంతానికి వెళ్లిపోతుందని మంత్రి ప్రత్తిపాటి వుల్లారావు అన్నారు. రాజధాని పరిధిలోని తుళ్లూరులో ఎన్టీఆర్ స్వగహ క్రింద ఇళ్లు కేటాయింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేయకపోతే చర్త్రి క్షమించదని వ్యాఖ్యానించారు. అమరావతి కోసం శ్రమిస్తున్న చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాజధాని ప్రాంతంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. అందుకే ఐదు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. తుళ్లూరు మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఇల్లు లేని 2,400 మందికి దాదావు పది లక్షల రూపాయల విలువైన ప్లాట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు ఎవరూ ఇంటిని అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజధాని ప్రజల్ని భయపెట్టేందుకు వైసీపీ ప్రయత్నించినా ప్రజలు నమ్మలేదని, చంద్రబాబుకు మద్దతు పలికి భూములిచ్చారని గుర్తుచేశారు.

పనిచేసే వారికి జనసేన పార్టీ మంచి వేదిక



నాదెండ్ల మనోహర్

విజయవాడ, సూర్య బ్యూరో : జనసేననేత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌ను సోమవారం జన సేన పార్టీ రాష్ట్ర కార్యాల యంలో అగిరిపల్లి, నూజివీడు, గుంటూరుకు చెందిన పలువురు నాయకులు కలుసుకున్నారు. గుంటూరుకు చెందిన మనవా సోడాకర్, విజయవాడకు చెందిన సిరివురవు ఫ్రాన్సిస్, కష్ణాజిల్లా అగిరిపల్లి చెందిన పిసిసి కార్యదర్శి పాతూరి రవి, బండి పవన్‌కుమార్, దేవిశెట్టి సత్యనారాయణ తదితరులను నాదెండ్ల మనోహర్ పార్టీలోకి ఆహ్వానం పలికారు. వీరికి నాదెండ్ల మనోహర్ పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పలువురు అనుచరులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పనిచేసే వారికి జనసేన పార్టీ మంచి వేదిక అన్నారు. జిల్లాలోపార్టీ బలోపేతానికి కషిచేయాలని సూచించారు. మార్పుకోసం జనసేనపార్టీ పోరాడుతుందన్నారు. జనసేనతోనే సామాజిక మార్పు సాధ్యం అన్నారు, రాష్టంలో ప్రజల నుంచి జనసేన పార్టీకి మంచి అదరణ లభిస్తోందన్నారు.

డోకిపర్రుకు స్మార్ట్ విలేజ్... స్మార్ట్ వార్డ్ భాగస్వామ్య పురస్కారం

విజయవాడ సూర్యబ్యూరో : మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) దత్తత గ్రామం కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు స్మార్ట్ విలేజ్... స్మార్ట్ వార్డ్ పురస్కారా నికి ఎంపికైంది. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్మార్ట్ విలేజ్... స్మార్ట్ భాగస్వామ్య పురస్కారాన్ని మేఘా ఇంజనీరింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాల య ప్రతినిధి కొమ్మారెడ్డి బాపిరెడ్డికి అంద చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, కార్మిక శాఖ మంత్రులు నారా లోకేష్, పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ నెలలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని పురస్క రించుకుని స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ స్మార్ట్ విలేజ్... స్మార్ట్ వార్డ్ అత్యుత్తమ భాగస్వాములను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం సి. కుటుంబరావు, కేఎస్ జవహర్‌రెడ్డి, డాక్టర్ బి. గంగయ్య సభ్యులుగా కమిటీని నియమంచారు. ఈ కమిటీ మేఘా ఇంజనీరింగ్ దత్తత తీసుకున్న డోకిపర్రును స్మార్ట్ విలేజ్... స్మార్ట్ వార్డ్ అత్యుత్తమ భాగస్వామ్య పురస్కారానికి ఎంపిక చేశారు. డోకిపర్రును దత్తత తీసుకున్న మేఘా ఇంజనీరింగ్ అధిపతులు పీపీ రెడ్డి. పీవీ కృష్ణారెడ్డి.. గ్రామంలోని ప్రతి ఇంటికి ఉచితంగా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయటంతో పాటు తాగునీరు ఉచితంగా అందిస్తున్నారు. మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్లలో మెరక పోయటంతో పాటు బ్రిడ్జి నిర్మించారు. పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన బెంచీలు అందచేశారు. పల్లంలో ఉండి వర్షా కాలంలో మునిగిపోతున్న 174 ఇళ్ల స్థలాల్లో మెరకపోసి రాకపోకలకు అనువుగా బ్రిడ్జిని మేఘా ఇంజనీరింగ్ సంస్థ నిర్మించింది. గ్రామ ప్రజల సౌకర్యార్థం కల్యాణ మండపం నిర్మించి వారికి అవసరమైనపుడు ఉచితంగా వినియోగించుకునే సౌకర్యం కల్పించారు. శ్మశానవాటిక ప్రహరీగోడ, బ్రిడ్జి నిర్మాణం వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు.



డబ్బు పంపిణీపై కొరడా

- రాష్ట్రాలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదేశం
- సరిహద్దు రాష్ట్రాలతో సమన్వయంగా వ్యవహరించాలి
- ఎన్నికల ఏర్పాట్లపై సునీల్ ఆరోరా వీడియో సమావేశం
- పెండింగ్‌లో 14 ఎన్నికల నేరాల కేసులు:సీఎస్,డీజీపీ

అమరావతి, సూర్యప్రధానప్రతినిధి: 2019లో సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వ హించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోర అన్ని రాష్ట్రాల సీఎస్‌లను, డీజీపీలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఢిల్లీ నుండి సహ ఎన్నికల కమిషనర్ అశోక్ లావసతో కలిసి అన్ని రాష్ట్రాలసీఎస్,డీజీపీ,సీఈవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరోర మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాలకు సంబంధించి శాంతిభద్రతలు,ఇతర అంశాలపై సమీక్షించేందుకు వెంటనే ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఎన్నికల్లో డబ్బు పంపిణీని తీవ్ర నేరంగా పరిగణించి అలాంటి సంఘటనలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే మీడి యాలో వచ్చే పెయిడ్ న్యూస్ అంశంపై సకాలంలో చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసిన మీడియా కోఆర్డినేషన్ కమిటీలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల నిర్వహణకుగాను అవసరమైన అధికారులు, సిబ్బంది నియామకంపై ప్రత్యేక దృష్టిపెట్టి తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.అంతేగాక ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర స్థాయిలో వెంటనే సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహిం చాలని సీఎస్‌లను ఆయన ఆదేశించారు.అదే విధంగా ఎన్నికల విధుల్లో నియమించే అధికారులు,సిబ్బందికి సకాలంలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఎన్నికలకు సంబం ధించి సెన్సిటివ్,హైపర్ సెన్సిటివ్,కుల,మతపరమైన ప్రభావంతో అల్లర్లు జరిగేదుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక బందో బస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఎన్నికలు సజావుగా జరిగేదుంకు వీలుగా పోలింగ్ కేంద్రాలవారీ ఏర్పాట్లు తదితరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఇందుకు ఏర్పాటు చేసే వెబ్ కాస్టింగ్‌కు అవసరమైన సీసీ టీవీ కెమెరాలను బయట



కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నేరాల కేసు లను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా న్యాయాధికారులతో సమన్వయం కలిగి సకా లంలో ఆయా కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సునీల్ అరోరా ఆదేశించారు.

ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికలను సక్రమంగా శాంతియుతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకోనుందని వివరించారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయానికి అవసరమైన అధికారులు,ఉద్యోగులను ఇప్పటికే నియమించామని, మరికొంతమందిని వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు,ఇతర సిబ్బంది నియామకం,బదిలీకి సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సకాలం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా రానున్న ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయిం చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పునేఠ కేంద్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేశారు. శాంతభద్రతలు నిర్వహణకు సంబంధించి మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు,ఇతర సెన్సిటివ్,హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు తదితర ప్రాంతాల్లో మొత్తం 293 కంపెనీల కేంద్ర బలగాలను వినియోగించడం జరిగిందని ఈసారి 350 కంపెనీలు అవసరం ఉంటుందని వివరించారు.ఎన్నికల సంబంధిందిత నేరాలకు సంబంధించి 14 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సమీక్షించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు.ఎన్నికల్లో మద్యం పంపణీ తదితర అక్రమాలను నివారించేందుకు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 29 శాశ్వత చెక్ పోస్టులు, 19 సరిహద్దు మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయని తెలిపారు.

ఈ వీడియో సమావేశంలో రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఆర్పీఠాకూర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.గత ఎన్నికల్లో నాన్ బెయిలబుల్ వారెంట్ కేసులు 14 పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సమీక్షించి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.అంతర్ రాష్ట్ర సహరిద్దు కోఆర్డినేషన్‌పై సమీక్షిం చేందుకు ఫిబ్రవరి 5న తిరుపతిలో ఐదు సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గోపాల కృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి సకా లంలో పరిష్కరించేందుక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రానున్న ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు,తగిన నిధులు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోనుందని తెలిపారు.ఓటర్ల నుండి ఫిర్యాదులు, ఇతర సమాచారం తెల్సుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన 1950 కాల్ సెంటర్ విజయ వంతంగా పనిచేస్తోందని చెప్పారు.సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సాంబశివరావు,అదనపు డీజీ శాంతిభద్రతలు రవిశంకర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ లక్ష్మీ నర్సింహ,శాంతి భద్రతల ఐజీ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




'పీఎం జేబు సంస్థగా నీతి ఆయోగ్'



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి జేబు సంస్థగా మారిందని ఏపీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు తుర్లపాటి కుటుంబరావు ఆరోపించారు. నీతి ఆయోగ్ వేస్ట్ అని, క్యాపిటల్ రీజియన్‌కు కేవలం రూ. 2500కోట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పడిన సరికొత్త వ్యవస్థ నీతిఆయోగ్ సోమవారం ఢిల్లీలో రాష్ట్రాల ప్రణాళికా సంఘాల ఉపాధ్యక్షులతో సమావేశమైంది. ఈ సమావేశానికి హాజరైన కుటుంబరావు మాట్లాడుతూ నీతి ఆయోగ్ డిసెంబర్ 2015లో రిపోర్టు ఇచ్చిందని, రాష్ట్రానికి న్యాయం చేయాలని చెప్పిందని, వెనుకబడిన ప్రాంతాలకు రావాల్సిన నిధులను కూడా వెనక్కు తీసుకున్నారని ఆరోపించారు.

కానీ కేంద్ర ఆర్థికశాఖ ఎందుకు నిధులు ఇవ్వలేదని, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ రాష్ట్ర సమస్యలు వచ్చినపుడు కేంద్రంతో సంబంధాలు సరిగ్గా లేని సమయంలో నీతి ఆయోగ్ కల్పించుకుని న్యాయం చేసేలా ప్రయత్నం చేస్తామని చెప్పినా ఫలితం లేదన్నారు.

1నుంచి కన్నన్ బ్రైడల్ కోచర్ ప్రదర్శన



అమరావతి, సూర్య ప్రతినిధి : కాంచీపురం క్వీన్, దక్షిణ భారతదేశపు సుప్రసిద్ధ వెడ్డింగ్ సిల్క్ శారీ డిజైనర్ బీనా కన్నన్ బ్రైడర్ కోచర్ ప్రదర్శన ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో బీనా కన్నన్ బ్రైడల్ కోచర్‌ను బంజారాహిల్స్ హయత్ ప్లేస్‌లో 1,2,3 తేదీల్లో జరగనుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీనాకన్నన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 8 నుంచి 10వరకు విజయవాడ ఎంజీరోడ్‌లోని గేట్‌వే హోటల్‌లో, ఫిబ్రవరి 15 నుంచి 17వరకు విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని గేట్‌వే హోటల్‌లో జరుగుతుందని చెప్పారు. 'శీష్ మహల్' నేపథ్యంతో చేయనున్న ఈ ప్రదర్శనలోని వస్త్రాలు టర్కిష్ కళాత్మకత ప్రభావంతో తీర్చిదిద్దినట్లు వివరించారు. రాయల్ జ్యుయలరీ నేపథ్యాలయిన జామావర్, మొఘల్, ఫ్లోరల్ సంప్రదాయాలతో రూపొందించిన కాంచీపురం చీరలు, అపెరల్స్, లెహంగాలు, గౌన్లు, లచాస్, అనార్కలి, జాకెట్లు వంటివి ఇందులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

'మళ్లీ మీరే రావాలి'

ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీలో కృతజ్ఞతలు తెలిపిన పింఛనుదారులు



అమరావతి, సూర్య ప్రతినిధి :ఎన్నిసమస్యలున్నా ప్రజలు ఇబ్బందులు పడకూడదని రాష్ట్రంలోని అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పేర్కొన్నారు. అదనపు పించనును పదిశాతం పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వంలో సుదీర్ఘంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పించనుదార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సచివాలయంలో కలిసి కృఎతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం లోటు బడ్జెట్ లో ఉన్నా ప్రభుత్వ పించానుదార్లు కష్టపడకూడదని అదనపు పించనును పదిశాతం పెంచామని తెలిపారు. "నావంతు శ్రద్ధతో పించనుదార్లను సంతృప్తి పరిచేలా అదనపు పించనును పెంచాను. అదే సందర్భంలో మీవంతు చర్యగా మా ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో సహకరించేలా ఓటు వేయాలి అని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఏపీ జీఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు , ఏపీ పించానుదార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడమల ఆల్ఫ్రెడ్ , పలు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శాలువలు కప్పి సన్మానించారు. "పొద్దున్న అమరావతిలో , మధ్యాహ్నం కడపలో , సాయంత్రం విశాఖ లో ప్రజలతో మమేకమవుతూ అలుపెరగకుండా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి మీరేనని పించనుదార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ప్రశంసించారు. "నిద్రహారాలు మాని ప్రజాసంక్షేమ పథకాల అమలుకు నిరంతరం కృషి చేస్తున్న మీకు మా ఆయుష్షు పోసుకుని జీవించాలని, వారు అభినందించారు. "మళ్ళీ మీరే రావాలి అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీలో పించనుదార్లు ఆకాంక్షించారు.

తలసరి ఆదాయంలో కృష్ణాజిల్లా ఫస్ట్



- జీడీడీపీ సాధనలోనూ రాష్ట్రంలో టాప్
- 2019-24 జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ విడుదల

వెలగపూడి, సచివాలయప్రతినిధి:2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,89,121 తలసరి ఆదాయంతో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ లక్ష్మీ కాంతం వెల్లడించారు.2019-24 కృష్ణాజిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సోమవారం సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,89,121 తలసరి ఆదాయంతో కృష్ణా జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి యనమలకు వివరించారు. అలాగే 2017-18లో రూ.97,089 కోట్ల జీడీడీపీతో కృష్ణాజిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 నాటికి ప్రస్తుత ధరల ప్రకారం కృష్ణా జిల్లా జీడీడీపీ రూ.2,55,064 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవడం ద్వారా తలసరి ఆదాయం రూ.4,73,307 కు చేరుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. ఆక్వా సాగులో 2016-17లో కృష్ణాజిల్లా 43 శాతం వృద్ధి సాధించిందని జిల్లా ఇన్చార్జి మంత్రి యనమలకు వివరించారు. పాల ఉత్పత్తిలో 2017- 8లో 15.63 లక్షల టన్నుల ఉత్పత్తితో జిల్లా గణనీయమైన ప్రగతి సాధించిందని కలెక్టర్ గుర్తుచేశారు.మాల్ న్యూట్రిషన్, ఎనీమియా నివారణలో జిల్లా మంచి పురోగతి సాధించిందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, చేపలపెంపకం, తయారీ రంగం, సేవల రంగాలను ప్రధాన గ్రోత్ ఇంజన్లుగా గుర్తించారు. డెయిరీ, చిన్న పరిశ్ర మలు, టూరిజం, చేతివృత్తులు, ఐటీ, జక్కంపూడి ఆర్థిక నగరం జెట్ సిటీ, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే లైన్ల డబ్లింగ్, మచిలీపట్నం ఓడరేవు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు కృష్ణా కలెక్టర్ లక్ష్మీకాంతం, మంత్రి యనమలకు వివరించారు. కృష్ణా జిల్లా విజన్, యాక్షన్ ప్రణాళిక విడుదల కార్యక్రమంలో జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ పాల్గొన్నారు. అనంతరం వచ్చే నెల 3,4 తేదీల్లో జరగనున్న కొండపల్లి ఉత్సవాల పోస్టర్, ఫిబ్రవరి 10న జరగ నున్న ఫెలికాన్ పక్షుల పండుగ పోస్టర్ లను మంత్రి యనమల రామకృష్ణుడు విడుదల చేశారు.



సంక్షేమ, అభివృద్ధి పథకాలు వేగవంతం చేయాలి

- సంపూర్ణంగా పేద ప్రజలకు అందించాలి
- అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందివ్వాలి
- పేదల సొంతఇంటి కల సాకారానికై మరో 60 వేల గృహాలు మంజూరు
- త్వరలో రామాయపట్నం పోర్టు, పేపర్ మిల్లు పనులు ప్రారంభం
- ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి పెరిగేలా పనిచేయాలి
- వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం

ఒంగోలు, సూర్యప్రతినిధి : రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను వేగవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలందరికి చేరే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 4 లక్షల గృహాలను ఫిబ్రవరి 2,3,4వ తేదీల్లో ఒకే రోజు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలందరికి గృహాలు మంజూరు చేయడానికి అదనంగా 60 వేల గృహాలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో చుక్కల భూములకు సంబంధించిన ధరఖాస్తులను అర్థవంతంగా పరిష్కరించాలని



అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద కరువు ప్రాంతాల్లో కూలీలకు 150 రోజులు పని దినాలు కల్పించాలని అధికారులను సిఎం ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద 500 కోట్ల రూపాయల లేబర్ కాంపోనెంట్, 1500 కోట్ల రూపాయలు మెటీరిల్ కాంపోనెంట్ నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తడి తీసుకువచ్చి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకాశం జిల్లాలో పరిశ్రమలు స్థాపనకు అనుకూలంగా ఉందని రామాయపట్నం ఓడరేవు, పేపర్ పరిశ్రమ, జిందాల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రకాశం జిల్లాలో భూమి కొనుగోలు పథకం క్రింద భూమి కొనుగోలు చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించడానికి టిడ్‌కో ద్వారా 17 కోట్లు మంజూరు చేయించవల్సిందగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. జిల్లాలో త్రాగు నీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా రవాణా చేసిన వాటికి సంబంధించి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, రాబోయే రోజుల్లో తాగు నీటి రవాణాకు ఇబ్బంది లేకుండా వెంటనే నిధులు మంజూరు చేయాలని సిఎం దృష్టికి తీసుకెళారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో తాగు నీటి అవసరాల కోసం 300 బోర్లు అవసరమని ప్రజా ప్రతినిధులు కోరారని వెంటనే మంజూరు చేయవల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. అట్లాగే ప్రకాశం జిల్లాలో 156 గ్రామ పంచాయితీల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో ఒంగోలు నుంచి రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు, జిల్లా సంయుక్త కలెక్టర్ యస్ నాగలక్ష్మీ, ట్రైనీ కలెక్టర్ నిశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట సుబ్బయ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ గోపాలరెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి ప్రసాదు, వ్యవసాయ శాఖ జేడి శ్రీరామ మూర్తి, డ్వామా పిడి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సిఈవో కైలాష్ గిరీశ్వర్, ఐసిడిఎస్ పిడి విశాలాక్షీ, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి రాజ్యలక్ష్మీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మీ సుధ, డిఆర్‌డిఏ పిడి నరసింహులు, సర్వశిక్షా అభియాన్ పివో వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.




సీఎంతో బేటి అయిన ఏపి జెఏసి అమరావతి ప్రతినిధులు



కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్,ఎన్నెమ్మార్ ఉద్యోగుల డిమాండ్లపై వినతి

అమరావతి, సూర్య ప్రతినిధి :ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఏపి జెఏసి అమరావతి ప్రతినిధులు సోమవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో భేటి అయ్యారు. కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్, ఎన్నెమ్మార్ ఉద్యోగుల డిమాండ్లను సీఎం దృాఎష్టికి తెచ్చారు. 19ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులు 29వేలమంది పనిచేస్తున్నారు. విద్యా, వైద్య, పంచా యితీ రాజ్,జలవనరుల శాఖలో ఉన్నారు. 180రోజుల మెటర్నటి లీవ్, డెత్ ఎక్స్ గ్రేషియా, హెల్త్ కార్డులు ఇవ్వాలన్న తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ విరమణ వయోపరిమితిని 58ఏళ్ల నుంచి 60ఏళ్లకు పెంచాలని కోరారు. డెత్ ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్‌లో లక్షా 80వేల మంది పనిచేస్తున్నారని వారందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఈ భేటిలో ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ఏపిజెఏసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టివి ఫణి పేర్రాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆల్ఫ్రెడ్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎస్. కొండయ్య, కృష్ణా జిల్లా జెఏసి అధ్యక్షుడు డి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

బస్సు ప్రమాదం క్షతగాత్రులను పరామర్శించిన చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ జి హైమావతి



మాచర్ల లో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో క్షతగాత్రులను పరామర్శించడం జరిగిందని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్ పర్సన్ జి హైమావతి తెలిపారు.సోమవారం గుంటూరు జిల్లా మాచర్లలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను ఆమె పరామర్శించారు. కార్పొరేట్ విద్యా సంస్థలో వారి స్కూల్స్ లో చదివే పిల్లల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపుతునారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో విధ్యార్థుల పట్ల ఒత్తిడి పెరుగుతుందని, ఆ ఒత్తిడికి తటుకోలేక ఆత్మ హత్యలకు పాల్పడటం దురదృష్ట కరమన్నారు. ప్రభుత్వంలోని అన్ని సమన్వయ శాఖలు ప్రత్యేక దృష్టి సారించి అటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాటశాలల నిర్వహణ, భవనాల నిర్వహణ, స్కూల్ బస్సుల నిర్వహణ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులు పూర్తి ఫిట్ నెస్ తో ఉంచాలన్నారు. విధ్యా శాఖ, రవాణా శాఖ ఈ తనిఖీల విషయంలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలన్నారు.ఆసుపత్రిని చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు పద్మలత తో కలసి సందర్శించారు. ఇటువంటి ఘటనల సమయంలో స్కూల్ యజమాన్యలే పూర్తి భాధ్యత వహించవలసి ఉంటుందని ఆమె తెలిపారు.

బడుగుల భగవంతుడు చంద్రబాబు



ఏపీ వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ బీటీ నాయుడు

వెలగపూడి, సచివాలయప్రతినిధి : రాజమహేంద్రవరంలో జరిగిన 'జయహో బీసీ' సభలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి రూ.3 వేల కోట్ల విలువైన వరాలు కురిపించిన సీఎం చంద్రబాబునాయుడు...బీసీల భగవంతుడిగా నిలిచారని ఏపీ వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ బీటీ నాయుడు కొనియాడారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జయహో బీసీ' సభ విజయవంతమైందన్నారు. 137 కులాల వారు ఈ సభకు హాజరయ్యారన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్ర బాబునాయుడు కురిపించిన వరాలకు భగవంతుడి దీవెనలు కూడా తోడై, నేడు రాష్ట్రమంతా వర్షాలు కురుస్తున్నాయన్నారు. అమరావతిలో 10 ఎకరాల్లో రూ.100 కోట్లతో బీసీ నాయకుడు జ్యోతిరావు పూలే స్మృతివనం నిర్మించనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిడం ఆనందకరమన్నారు. 11 ఫెడరేషన్ల కారణంగా బీసీలకు రుణాల మంజూరులో బ్యాంకుల లింకేజీ తప్పనిసరిగా మారిందన్నారు. దీనివల్ల రుణాల మంజూ రులో ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ వినతులను మన్నించిన సీఎం చంద్రబాబునాయుడు 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చనున్నట్లు ప్రకటించారని, త్వరలోనే దీనికి సంబంధించిన జీవోలు రానున్నాయని తెలిపారు. ఫెడరేషన్లు...కార్పొరేషన్లుగా మారడంతో బ్యాంకుల లింకేజీ కష్టాల తప్పు తాయని, దీనివల్ల లబ్ధిదారులకు ఎంతో మేలుకలుగుతుందన్నారు. వైఎస్ హయాంలో 11 ఫెడరేషన్లకు కేవలం రూ.384 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. సీఎం చంద్ర బాబునాయుడు రూ.1,184 కోట్లు బీసీల కోసం వెచ్చించారన్నారు. ఒక్కొక్క ఫెడరేషన్ కు వైఎస్ కేవలం రూ.3లక్షలు కేటాయిస్తే, సీఎం చంద్రబాబునాయుడు రూ.50 కోట్లు వరకూ వెచ్చించారన్నారు. కొత్తగా 37 కులాలకు కార్పొరేషన్లు కేటాయించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాది రిగా బీసీ సబ్‌ప్లాన్‌కూ చట్టబద్ధత కల్పించనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పడం గొప్ప విషయమన్నారు. ఎంబీసీల అభ్యున్నతికి రూ.00 కోట్లు కేటాయిస్తే, ఇప్పటికే రూ.90 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. బడుగులకు విదేశీ విద్య అందించాలన్న సమున్నత లక్ష్యంతో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. కొత్తగా 64 గురుకులాల ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. ఆదరణ పథకం ద్వారా బీసీలకు ఎంతో లబ్ధి కలుగుతోందన్నారు.



ప్రజల ఆశలు నెరవేరేనా?

కంప్యూటర్లు, టీవీలు, సెల్‌ఫోన్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాల ధరలు తగ్గనున్నాయా? ఆదాయపన్ను పరిమితిని మరి కొంత పెంచునున్నారా వడ్డీ రేట్లు పెంచి బ్యాంకుల అభివృాఎద్ధికి బాటలు వేస్తారా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయా మహిళలకు, చిన్నారులకు కొత్త పథకాలు ఏమైనా ప్రారంభిస్తారా ఉన్న పథకాలకు ఎన్ని నిధులు కేటాయిస్తారు.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఫిబ్రవరి 1న రానున్న కంద్ర బడ్జెట్. బడ్జెట్‌లో కేటాయింపులను బట్టే ఆయా రంగాలు ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. దీంతో 125 కోట్ల భారత ప్రజలు బడ్జెట్‌వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన అనుభవం చిదంబరానికి ఉంది. దీంతో బ్యాంకింగ్, పారిశ్రామిక రంగాలు ఆయనపై ఎక్కువ నమ్మకాన్ని పెట్టుకున్నారు. మరో వారం రోజుల్లో సాధారణ వార్షిక బడ్జెట్ పార్లమెంట్‌లోకి రానుంది.

- ఆదాయపు పన్ను పరిమితి పెంచే అవకాశం
- రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంపు
- కొత్తగా రైతులకు మేలు కలిగేలా ఓ పథకం
- యువతను ఆకర్షించేందుకూ తాయిలాలు
- కీలక ప్రకటన చేయనున్న పీయుష్ గోయల్
- బడ్జెట్‌కు తుదిరూపు సిద్ధం



వివిధ పన్నుల నుంచి వచ్చే ఆదాయం, ఆయా పథకాలకు అయ్యే ఖర్చుల వివరాల పట్టికే బడ్జెట్. ప్రతి సంవత్సరం మన దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ వార్షిక బడ్జెట్‌ను రూపొందిస్తుంది. దీనికి సెప్టెంబర్‌లో ఏర్పడ్డ కమిటీ రంగంలోకి దిగి తయారుచేయడం, కొత్త కేటాయింపులు, కోతలు జరుగుతాయి ఈ ప్రక్రియ పూర్తయి చివరికి ఫిబ్రవరి తొలి రోజున పార్లమెంట్‌కు చేరుతుంది. సామన్యుడికి సంబంధించి ధరల పెరుగుదల, పరిశ్రమలకు సంబంధించిన రాయితీ షేర్ మార్కెట్ హెచ్చుతగ్గులు పూర్తిగా బడ్జెట్ కేటాయింపులపైనే ఆధారపడి ఉంటాయి.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇరవైయేళ్లలో గణనీయమైన ప్రగతి సాధించింది. 2022 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ఓ ప్రబలశక్తిగా అవతరించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వేగాన్ని అందివుచ్చుకుని దేశ బడ్జెట్ ప్రవేశపెట్టే మేథావి లోతుగా తర్కించేవాడై ఉండాల్సి ఉంటుంది. గత సంవత్సరం బడ్జెట్‌ను అరుణ్ ముఖర్జీ సమర్పించారు. ఈ సంవత్సరం ఆయన స్థానంలో పీయుష్ గోయల్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే బంగారం దిగుమతి సుంకాలు, సిలిండర్ల కుదింపు, పెట్రో కంపెనీలకు మరిన్ని అధికారాలు ఇచ్చి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అరుణ్ జైట్లీకి గతంలో పలుమార్లు బడ్జెట్‌ను సమర్పించిన అనుభవం ఉండగా, కొన్ని రంగాలను అభివృద్ధి పథంలో పయనించేలా చేయడంలో ఆయన కృతకృత్యుడయ్యారు. ఇప్పుడు బడ్జెట్‌ను సమర్పించబోయేది పీయుష్ గోయల్. ప్రస్తుతం రైల్వే మంత్రిగా ఉన్న ఆయన, జైట్లీ బదులుగా ఆయన సూచనలు, సంప్రదింపుల మేరకు తయారైన బడ్జెట్‌ను పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నారు.

ఆర్థిక సంక్షోభం కారణంగా వృద్ధి రేటు పడిపోతూ వచ్చి నాలుగేళ్ల క్రితం ఎన్నడూ లేనంతగా 5.3 శాతానికి చేరి, ఆపై గత రెండేళ్లలో ఇది 7 శాతాన్ని అధిగమించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరింతగా పెరుగుతుందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఎంఎఫ్‌లు అంచనాలు వేశాయి. వృద్ధి రేటు ఇంకా పెరగాలంటే, మరిన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాల్సి ఉంది. ఇందులో పీయుష్ గోయల్ ఎంత వరకు సక్సెస్ అవుతారనే విషయంపై పరిశ్రమ, బ్యాంకింగ్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టే విషయంలో యుపిఏ విఫలమవుతోందనే ఆరోపణలున్నాయి.

రూపకల్పన

భారత రాజ్యాంగంలోని 112 ఆర్టికల్ ప్రకారం దేశ వార్షిక ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టాల్సింది రాష్ట్రపతి. కానీ, ఆర్టికల్ 77(3) ప్రకారం ఈ బాధ్యత అంతా కేంద్ర ఆర్థికశాఖ మంత్రిపై ఉంటుంది. ఆయనే వార్షిక ఆర్థిక నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ఇదే బడ్జెట్.

ఆర్థిక మంత్రి, ఆర్థిక మంత్రిత్వ శాఖ కలిసి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల బడ్జెట్‌కూ రూపకల్పన చేస్తారు. వీరికి ప్లానింగ్ కమిషన్, ది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, అడ్మినిస్ట్రేటివ్ మినిస్టర్స్ తగు సహకారం అందిస్తారు.

బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి చాలా రోజుల ముందే దాని రూపకల్పన ప్రారంభమవుతుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ నుంచి ఖర్చులను, నాన్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్, రెవెన్యూ టాక్స్ డిపార్ట్‌మెంట్‌ల నుంచి రాబడులను, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ ఎఫైర్స్ నుంచి లోటునూ తెలుసుకుంటారు.

సెప్టెంబర్‌లో ప్రారంభమైయ్యే ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, విభాగాలు, మంత్రిత్వ శాఖల వారీగా కేటాయింపులు చేసుకుంటూ వెళతారు.

బడ్జెట్ రూపకల్పనకు కొన్ని డ్యూడేట్స్ ఉంటాయి. ఆర్థికమంత్రిత్వ శాఖ తెలిపిన తేదీకి వాటిని అందించవలసిన బాధ్యత ఆయా విభాగాలపై ఉంటుంది.

బడ్జెట్ రూపకల్పన కోసం ఆ సంవత్సరం వివిధ వర్గాల ప్రజలు, వ్యాపార వర్గాలు, పరిశ్రమల విభాగాలన్నింటి నుంచి అనుకూల, ప్రతికూల అంశాలను పరిశీలించడం జరుగుతుంది.

అంతా సిద్ధమైన తరువాత బడ్జెట్ నాలుగైదు రోజుల ముందుగా ప్రింటింగ్ విభాగానికి చేరుతుంది. చాలా సీక్రెట్ జరిగే ప్రింటింగ్ అనంతరం పార్లమెంట్ ముందుకు వస్తుంది.



బడ్జెట్ ప్రతుల ముద్రణకు ముందు ఆర్థికమంత్రి పార్లమెంట్ నార్త్ బ్లాక్‌లో అధికారులకు, సిబ్బందికి స్వయంగా హల్వా వండి వడ్డిస్తారు. ఈ హల్వా తయారీ కార్యక్రమం తరువాత, అధికారులంతా ప్రింటింగ్ పనుల్లో నిమగ్నమవుతారు.

బడ్జెట్ విశేషాలు


- స్వాతంత్ర్యానంతరం 1947 నవంబర్ 26న ఆర్‌కె షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించారు.
- ఆ తరువాత ఫిబ్రవరి చివరి పనిదినాన బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది.
- 1958-59లో అప్పటి ఆర్థికమంత్రి టిటి కృష్ణమాచారి రాజీనామాతో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బడ్జెట్‌ను సమర్పించే బాధ్యతలు స్వీకరించారు.



- భారతదేశంలో అత్యధిక సార్లు (8) పార్లమెంట్‌కు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించిన మంత్రి మొరార్జీదేశాయ్.
- ఉపప్రధానిగా వుంటూ బడ్జెట్‌ను సమర్పించిన ఘనత కూడా ఆయనదే. తన వుట్టిన రోజు నాడు బడ్జెట్‌ను అందించింది ఆయనే.
- ఇండియాలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఒకే ఒక్క మహిళ ఇందిరా గాంధీ. మొరార్జీ దేశాయ్ రాజీనామా తరువాత ఆమె ఒకసారి బడ్జెట్‌ను సమర్పించారు.




- రాజ్యసభ సభ్యుడి హోదాలో 1982 నుంచి 85 మధ్య కాలంలో మూడు సార్లు ప్రణబ్ ముఖర్జీ బడ్జెట్‌ను అందించారు.
- విపి సింగ్ ప్రభుత్వం పతనమైన తరువాత 1987-88 బడ్జెట్‌ను రాజీవ్ గాంధీ అందించారు.
- దీంతో ప్రధానిగా వుంటూ బడ్జెట్‌ను సమర్పించిన ఒకే వంశంలో నెహ్రూ, ఇందిరలతో పాటు రాజీవ్ కూడా చేరారు.
- ఎటువంటి చర్చా లేకుండా బడ్జెట్ ఆమోదం పొందింది 1997-98లో. ఐకె గుజ్రాల్ ప్రభుత్వం పతనమైన తరువాత అంతకుముందు చిదంబరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఆమోదించేందుకు ప్రత్యేక సెషన్ నిర్వహించి చర్చ లేకుండా ఆమోదించారు.



- 2000 సంవత్సరం వరకూ ఫిబ్రవరి చివరి పనిదినాన సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభమయ్యేది. ఈ సంప్రదాయాన్ని వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మార్చింది.
- 2001 నుంచి ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించాలన్న నిర్ణణం తీసుకోగా, ఆ సంవత్సరం యశ్వంత్ సిన్హా ప్రతిపాదనలు అందించారు.



- ఇప్పటివరకూ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వారి సంఖ్య 24. పీయుష్ గోయల్ 25వ వారు కానున్నారు. లియాఖత్ అలీ ఖాన్ (స్వాతంత్ర్యం రాక పూర్వం), ఆర్ షణ్ముఖం చెట్టి, జాన్ మథాయ్, చింతామణి రావ్ దేశ్‌ముఖ్, టిటి కృాఎష్ణమాచారి, జవహర్‌లాల్ నెహ్రూ, మొరార్జి దేశాయ్, సుచీంద్ర చౌదరి, ఇందిరా గాంధీ, యశ్వంత్‌రావ్ చవాన్, సి సుబ్రమణియన్, రాజీవ్ గాంధీ, హెచ్‌ఎం పాటిల్, చౌదరి చరణ్ సింగ్, రామస్వామి వెంకటరామన్, ప్రణబ్ ముఖర్జీ, వీపీ సింగ్, యస్‌బి చవాన్, మధు దండావతే, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్, పి చిదంబరం, జస్వంత్ సింగ్, అరుణ్ జైట్లీ.



- మద్రాస్ యూనివర్శిటీలో విద్యాభ్యాసం చేసిన ఐదుగురు దేశానికి ఆర్థికమంత్రులుగా సేవలందించడం విశేషం.

బడ్జెట్ ఎందుకు?

ప్రణాళిక లేకుండా ఏ పని చేసినా ఆశించిన లక్ష్యాలను చేరలేము. అది ఇంటికే గాని, కంపెనీకే గాని, రాష్ట్రానికైనా, దేశానికైనా అనుకున్న ప్రగతి సాధించాలంటే బడ్జెట్ తప్పనిసరి. ఏ ఏ రంగాలు అభివృద్ధి చెందాల్సి ఉంది. ఆయా రంగాలకు నిధులు ఎంత మేరకు కేటాయిస్తాం. తద్వారా ఎంత ప్రగతి సాధిస్తాం.. వనరులను నియంత్రించడం, నిర్వహించాల్సి ప్రణాళికను అందరికీ అందేలా చూడడం, అందులో తీసుకున్న నిర్ణయాలను, లక్ష్యాలను చేరేలా చూడడం, ఆయా రంగాల్లో సాధించిన ప్రగతిని అంచనా వేయడానికి కూడా వీలుగా ఉంటుంది. బడ్జెట్‌పై ఆధారపడే దేశ ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది.

బడ్జెట్‌కు ఆమోదముద్ర ఇలా!

రాష్ట్రపతి నిర్దేశించిన రోజున పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. సౌలభ్యంగా ఉండేందుకు 1999 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి చివరి పనిదినాన ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. గత సంవత్సరం నుంచి ఈ సంప్రదాయం ఫిబ్రవరి 1కి మారింది. ఈ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభమవుతాయి.

లోక్‌సభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రెండు భాగాలుంటాయి. ఒక భాగం దేశ సాధారణ ఆర్థిక సర్వే కాగా, రెండోది పన్ను విధివిధానాలు. ఆర్థికమంత్రి ప్రసంగం అనంతరం రాజ్యసభ ముందుంచుతారు.

అప్పటికప్పుడు బడ్జెట్‌పై ఏ విధమైన చర్చలూ జరగవు. కొద్ది రోజుల తరువాత తిరిగి పార్లమెంట్ రెండు మూడు రోజులు సమావేశమై బడ్జెట్‌పై చర్చ జరువుతుంది. చివరి రోజు ఆర్థికమంత్రి సమాధానం ఉంటుంది.

చివరగా బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ రిపోర్టులను మంత్రిత్వ శాఖల వారీగా కేటాయింపులతో పార్లమెంట్ ముందుంచుతారు. ఓట్స్ ఆన్ డిమాండ్‌ణ చర్చలు జరుగుతాయి. బడ్జెట్ ప్రతిపాదనలపై, ఓట్ ఆన్ డిమాండ్లపై చర్చలన్నింటి





అదో రహస్య ప్రపంచం

బడ్జెట్ రూపకల్పన ఆసాంతం అత్యంత రహస్యంగా సాగుతుంది. ఎంపిక చేసిన కొందరు అధికారుల నేతత్వంలో అన్ని నెట్‌వర్క్ లింకులు కట్ చేయబడ్డ కంప్యూటర్లపై పని జరుగుతుంది. ఫిబ్రవరి చివరి వారంలోనే అన్ని ప్రతిపాదనలతో కూడిన బడ్జెట్ సిడి ముద్రణ కోసం పంపబడుతుంది. ముద్రణా కార్యాలయం న్యూఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్‌లోని నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో ఉంటుంది. ప్రింటింగ్ పనిలో కేంద్రీకతమైవున్న అందరు టెక్నికల్ అధికారులు, లీగల్ అధికారులు, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారులు, నార్త్‌బ్లాక్‌లో పనిచేసే అధికారులు, ఇతర సిబ్బంది అంతా ఎవరూ బయటకు వెళ్ళడానికి వీలు లేకుండా చేస్తారు. అక్కడే తిని, అక్కడే విశ్రమించే వీరంతా ఆర్థికమంత్రి లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరమే బయటకు వస్తారు. వీరి అందరి సెల్‌ఫోన్‌లూ జామ్ చేయబడతాయి. కేవలం 10 నిమిషాల ముందు మాత్రమే మంత్రివర్గ సహచరులకు ఈ బడ్జెట్ కాపీ అందుతుంది.

మిస్టర్ వాల్మీకి మొదలైంది



ఫి దా', 'తొలిప్రేమ', 'అంతరిక్షం', 'ఎఫ్2' వంటి విభిన్న చిత్రాలతో ఘనవిజయాలు అందుకున్న మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోగా 14 రీల్స్ ప్లస్ పతాకంపై పవర్‌ఫుల్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న భారీ చిత్రం 'వాల్మీకి'. ఈ చిత్రం జనవరి 27న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వరుణ్‌తేజ్‌పై చిత్రీకరించిన ఫస్ట్‌షాట్‌కు నిహారిక కొణిదెల క్లాప్ నివ్వగా, రామ్ బొబ్బ కెమెరా స్విచ్చాన్ చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ ఫస్ట్ షాట్‌ను డైరెక్ట్ చేశారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే తెలియజేస్తారు. ఈ చిత్రానికి సంగీతం: రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంకా బోస్, కథ: కార్తీక్ సుబ్బరాజ్, స్క్రీన్‌ప్లే: మధు, చైతన్య, ఆర్ట్: అవినాష్ కొల్ల, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, మాటలు-దర్శకత్వం: హరీష్ శంకర్!!

నిధి నిక్షేపాలపై కన్నేశాడా?





ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని-డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఇస్మార్ట్ శంకర్ చిత్రం ఇటీవలే ప్రారంభం అయ్యింది.. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నిధి అగర్వాల్‌ని ఎంపిక చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. అందం అభినయంతో ఆకట్టుకున్న నిధి అగర్వాల్‌కి తెలుగులో ఇది మూడో సినిమా. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరణ జరుపుకుంటుండగా.. రియల్ సతీష్ ఈ యాక్షన్ ఎపిసోడ్‌కి కొరియోగ్రఫీ చేస్తున్నాడు. త్వరలో నిధి అగర్వాల్ షూటింగ్‌లో పాల్గొననుంది. పునీత్ ఇస్సార్, సత్య దేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి మరియు గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తుండగా, మణిశర్మ సంగీతం సమకూరుస్తున్నారు. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాని మేలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు!!

యుద్ధం నడుస్తూనే ఉంది





మణికర్ణిక పేరుతో విడుదలైన రాణి లక్ష్మీభాయ్ మిశ్రమ స్పందన తెచ్చుకున్నప్పటికీ.. కలెక్షన్ల పరంగా బాగానే దూసుకుపోతోంది. ప్రస్తుతం లభ్యమవుతున్న సమాచారం ప్రకారం ఈ చిత్ర నిర్మాత సహా కొనుగోలుదారులంతా మంచి లాభాలు పొందబోతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో 100 కోట్ల క్లబ్బులోనూ చేరే అవకాశముందని ట్రేడ్ పండిట్స్ చెబుతున్నారు.

అయితే ఈ సినిమాకి సంబంధించిన వివాదం మాత్రం ఇంకా నడుస్తూనే ఉంది. తను దర్శకత్వం వహించిన సినిమాకి కంగనా రనౌత్ తన పేరు ఎలా వేసుకుంటుందని క్రిష్ ప్రశ్నిస్తున్నారు. 95 శాతం షూటింగ్ పూర్తి చేశాక.. కారణాంతరాల వల్ల జాప్యం జరుగుతుండడంతో.. తాను ఎన్టీఆర్ బయోపిక్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టానని, నా డైరెక్షన్ టీమ్‌తో ప్యాచ్ వర్క్ చేయించి, ఆ రషెస్ నాకు చూపిస్తానని చెప్పిన కంగనా.. సోనూసూద్ మీద ద్వేషంతో.. సినిమాలో అతను చాలా డామినేట్ చేసేస్తున్నాడనే ఈర్ష్యతో, అతని స్థానంలో మరో నటుడితో క్లోజప్స్ షూట్ చేయించిందని క్రిష్ ఆరోపిస్తున్నారు.

దీనిపై కంగనా ఇంకా స్పందించకపోయినా.. ఆమె చెల్లెలు రంగోలి మాత్రం క్రిష్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. సరే, సినిమా మొత్తం నువ్వే డైరెక్ట్ చేశావు. సినిమా సూపర్ హిట్టయ్యింది. ఈ విజయాన్ని మా అక్కను ఆస్వాదించనివ్వు.. అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తోంది!!

ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు



తొలి చిత్రం 'తొలిప్రేమ'తో సూపర్‌హిట్ సాధించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ అక్కినేని కథానాయకుడుగా తెరకెక్కిన రొమాంటిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై భారీ నిర్మాత బివిఎస్‌ఎన్.ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై హిట్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరితో ఇంటర్వ్యూ విశేషాలు...

-ఆడియెన్స్ కేరింతల మధ్య మెయిన్ థియేటర్‌లో సినిమా చూశాను. చాలా బాగా అనిపించింది. మిస్టర్ మజ్నులో అఖిల్‌లా ఉండలేం. అలాంటి లార్జర్ దేన్ లైఫ్. అలాంటి ధైర్యం నాకు లేదు. 'ప్రేమనగర్‌లో నాగేశ్వరరావుగారిలోని ఓ క్యూని బేస్ చేసుకుని అఖిల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసుకున్నాను. మజ్ను అంటే శాడ్ ఎండింగ్ ఉంటాయి.

- మజ్ను అంటే చామర్.. పొయెట్. ఆయన జీవితం చివరకు విషాదంతో ముగిసింది. కానీ మన సినిమా విషయానికి వచ్చేసరికి అఖిల్ ప్లే చేసిన విక్కీ క్యారెక్టర్ కూడా చామర్. పాత్రలో చిన్న నాటీని యాడ్ చేయడానికి, విషాదంగా ఉండదు అని చెప్పడానికే టైటిల్ ముందు మిస్టర్ అని ఫిక్స్ చేశాం.

-నన్ను నమ్మిన వాళ్లలో అఖిల్, ప్రసాద్‌గారు.. అలాగే టీంలో తమన్, జార్జ్ అందరూ సినిమాను నమ్మారు. నాగార్జునగారు ఈ సినిమాకు తొలి ఆడియెన్. ఆయన కథ విన్న తర్వాత మళ్లీ ఎప్పుడూ సినిమా గురించి ఏమీ అడగలేదు. సినిమా పూర్తైన తర్వాత ఆయన సినిమా చూపించమని అన్నారు. చూసిన తర్వాత రిలాక్స్‌గా ముందుకెళ్ళండి అని అన్నారాయన. ఓ పబ్ సీన్‌ను రీషూట్ చేయమని సలహా ఇచ్చారు. ఆయన సలహా సినిమాకు ఎంతో హెల్ప్ అయ్యింది.

-నేను అనుకున్న దాని కన్నా అఖిల్ 50 శాతం ఎక్కువే చేశాడు. తనకెకెప్పుడూ ఇలా చేయాలని నేనెప్పుడూ చెప్పలేదు. తను సీన్‌లో ఎమోషన్ ఏంటి? అని అడిగి దాని ప్రకారం చేసుకుంటూ వెళ్లిపోయేవాడు. తన నటన నా ఊహ కన్నా ఓ స్టెప్ బాగానే ఉండేది. నిధి అగర్వాల్‌తో పనిచేసేటప్పుడు నాకు అంత కష్టమనిపించలేదు. తెలుగు అర్థం చేసుకునేది. ఎక్కడా తను డైలాగ్ మీద ఫోకస్ పెట్టి ఎక్స్‌ప్రెషన్‌ను మిస్ చేయలేదు. నిజంగా ఫీలై చేసినట్టే చేసింది. తమన్ ఈ సినిమాకు న్యాయం చేశాడు. సాంగ్స్ అద్భుతంగా ఇచ్చాడు. బ్యాగ్రౌండ్ స్కోర్‌తో సీన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాడు.

-బాపినీడుతో నేను రైటర్ కాక ముందు నుండి పరిచయం ఉంది. తొలిప్రేమ నుండి నాకు బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారితో పరిచయమైంది. ఇప్పుడు బాపి కంటే బివిఎస్‌ఎన్. ప్రసాద్‌గారితో మంచి అనుబంధం ఉంది. ఈ బ్యానర్‌లో సినిమా ఉంటుంది కానీ.. ఎప్పుడు ఉంటుందో ఇప్పుడే చెప్పలేను. రెండు, మూడు కథలను సిద్ధం చేస్తున్నాను. మైత్రీ మూవీస్‌లో ఓ సినిమా కమిట్‌మెంట్ ఉంది!!

కనికరించండి

కన్ను కొట్టమని కండిషన్ పెట్టకండి



సైలెంట్‌గా కన్నుగీటి ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. జస్ట్ 30 సెకన్ల ప్రోమోతో ప్రపంచం మొత్తం పాపులర్ అయ్యింది. అలాంటి ప్రియా వారియర్‌కు ఇప్పుడు కష్టాలు మొదలయ్యాయి. ఎక్కడికి వెళ్లినా జనాలు సెలబ్రిటీలు కన్ను కొట్టమనే అడుగుతున్నారట. దీంతో కన్ను కొట్టి కొట్టి తన కళ్లు పోయేలా ఉన్నాయని బాధపడుతుంది. మొన్నటికి మొన్నలవర్స్ డే ఆడియో ఫంక్షన్‌కి వచ్చినప్పుడు కూడా అల్లు అర్జున్‌ని చూసి కన్నుకొట్టింది. తన సిగ్నేచర్ మూమెంట్‌తో అందర్నీ అలరించింది. సెలబ్రిటీలు కాబట్టి.. తన సినిమా ఆడియో పంక్షన్ కాబట్టి తప్పదు. కానీ ఎక్కడికి వెళ్లినా ఇలా కన్ను కొట్టమని జనాలు తెగ ఇబ్బంది పెట్టేస్తున్నారు. దీంతో.. ప్రియా వారియర్‌కు కోపం వచ్చింది. ఇప్పటికే ఏ సారువాడు అడిగినా కాదనకుండా కొన్ని వేలసార్లు కన్ను కొట్టి ఉంటాను. ఇంక నన్ను వదిలెయ్యండి అంటూ వయ్యారాలు పోతోందంట ఈ మలయాళీ ముద్దుగుమ్మ!!

సకల కళావల్లభుడు వచ్చేస్తున్నాడు



తనిష్క్ రెడ్డి హీరోగా మేఘ్లా ముక్తా హీరోయిన్‌గా బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహ ఫిలింస్, దీపాల ఆర్ట్స్ పతాకంపై అనిల్, త్రినాథ్, కిషోర్, శ్రీకాంత్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం సకలకళావల్లభుడు. శివగణేష్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 1న విడుదల కానుంది.

చిత్ర నిర్మాతలు అనిల్, త్రినాథ్, కిషోర్, శ్రీకాంత్ మాట్లాడుతూ.. అవుట్ అండ్ అవుట్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రానికి కథ, కథనాలు హైలెట్‌గా నిలుస్తాయి. అలాగే ఇంటర్వెల్ సన్నివేశం ఉత్కంఠకు గురి చేస్తుంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ.. అన్నారు.

చిత్ర దర్శకుడు శివ గణేష్ మాట్లాడుతూ.. ఒక హిట్ చిత్రానికి కావలసిన ఎలిమెంట్స్ అన్ని ఈ చిత్రానికి కుదిరాయి.ధర్మేంద్ర ఎడిటింగ్, అజయ్ పట్నాయక్ సంగీతం, హీరో తనిష్క్ రెడ్డి, హీరోయిన్ మేఘ్లా ముక్తా పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటుంది. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ పృథ్వి, జీవాల కామెడీ సన్నివేశాలు. ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.. అన్నారు!!

మన్నించమంటున్నాడు



శ్రీదేవి ప్రసన్న మూవీస్ బ్యానర్‌పై దర్శకుడు రాఘవ్ ఓంకార్ శశిధర్ రూపొందించిన సరికొత్త షార్ట్ ఫిలిం 'నన్ను క్షమించండి'. గతంలో ఇదే బ్యానర్‌పై రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన 'లడ్డు' ఏ స్వీట్ మెమరీ మంచి ప్రేక్షకాదరణతో పాటు 28 ఇంటర్నేషనల్ అవార్డులు, 3 కేటగిరీల్లో 4 నంది పురస్కారాలు లభించాయి.

పి.కృష్ణకాంత్, రాఘవ్ ఓంకార్ శశిధర్ సంయుక్తంగా నిర్మించిన 'నన్ను క్షమించండి' షార్ట్ ఫిలింకి సునీల్ కశ్యప్ సంగీతాన్ని అందించగా.. శేఖర్ గంగనమోని సినిమాటోగ్రఫి అందించారు. ఈ 'నన్ను క్షమించండి' ప్రీమియర్‌షో ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది.

దర్శకుడు శశిధర్ మాట్లాడుతూ.. నా దర్శకత్వంలో వచ్చిన లడ్డు షార్ట్ ఫిల్మ్‌కి చాలా అవార్డులు వచ్చాయి. మంచి పేరొచ్చింది. దాంతో ఇక షార్ట్ ఫిల్మ్ చేయొద్దు అనుకున్నా. కానీ కృష్ణకాంత్ కోసం మళ్లీ నన్ను క్షమించండి షార్ట్ ఫిల్మ్ చేశాను. చాలా మంది నన్ను క్షమించండి కోసం కేవలం నాకోసం కష్టపడ్డారు. అందరికీ థాంక్స్.. అన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్మాత రాజ్ కందుకూరి, రచయిత లక్ష్మి భూపాల్, షార్ట్ ఫిల్మ్ నటుడు, నిర్మాత కృష్ణకాంత్, నటీనటులు హీరో సాగర్, రవి వర్మ, సుధీర్ బాబు, అస్మిత, గిరిధర్, తాగుబోతు రమేష్, కర్రా నాగేష్, డా.శ్రీనివాసరావు పసువులేటి, పాల్గొన్నారు!!

అందరి మనసులు దోచుకుంటారా?



శేఖర్ మూవీస్ బ్యానర్‌పై చంద్రశేఖర్ ఎస్.నిర్మించిన చిత్రం ఈ 2 మనసులు. ఆది పినిశెట్టి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం లవ్ అండ్ ఫ్యామిలీ, సెంటిమెంట్‌తో తెరకెక్కుతుంది. రవిచంద్ర, సుమయ కథానాయకులుగా పరిచమవుతున్నారు. ఈ చిత్ర షూటింగ్ 70శాతం పూర్తిచేసుకుంది. చివరి షెడ్యూల్ ఫిబ్రవరిలో పూర్తి చేసుకుని సమ్మర్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫిలింఛాంబర్‌లో టీజర్ మరియు సాంగ్‌ను విడుదల చేశారు.

చిత్ర దర్శకుడు ఆది పినిశెట్టి మాట్లాడుతూ... స్క్రిప్ట్ విషయంలో నా తమ్ముడు సత్య నాకు చాలా సపోర్ట్ చేశారు. మమ్మల్ని నమ్మి మాకు ఈ అవకాశం ఇచ్చిన మా ప్రొడ్యూసర్ చంద్రశేఖర్‌గారికి రుణపడి ఉంటాము... అన్నారు.

ప్రొడ్యూసర్ చంద్రశేఖర్ ఎస్. మాట్లాడుతూ.. సినిమా చాలా బాగా వచ్చింది. ఎప్పటికైనా ఇది చాలా పెద్ద బ్యానర్ అవుతుందని ఆశిస్తున్నాను.. అన్నారు.

హీరో రవిచంద్ర మాట్లాడుతూ... ఈ మధ్య వచ్చిన లవ్‌స్టోరీస్‌కి చాలా భిన్నంగా ఉంటుంది ఈ చిత్రం. మా డైరెక్టర్ ఆదిగారు అంతా దగ్గరుండి చెప్పి చేయించుకున్నారు.. అన్నారు!!

లక్ష్యసాధన కోసం చౌర్యం



అతని పేరు గోవిందు. ఫన్నీ దొంగ. అతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఏం చేశాడన్నది తెలుసుకోవాలంటే వజ్ర కవచధర గోవింద సినిమా చూడాల్సిందే అని అంటున్నారు సప్తగిరి. స్టార్ కమెడియన్ సప్తగిరి ఫన్నీ దొంగగా నటిస్తున్న సినిమా వజ్ర కవచరధర గోవింద. ఈ సినిమాకు అరుణ్ పవార్ దర్శకత్వం వహిస్తున్నారు. శివ శివమ్ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి ఈ చిత్రాన్నినిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది.

వైభవీ జోషీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: జి టి ఆర్ మహేంద్ర, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సలాన బాలగోపాలరావు!!



- కర్నాటక పీసీసీ చీఫ్‌పై ట్విట్టర్‌లో అనుచిత వ్యాఖ్యలు
- భార్య మతాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు

కేంద్ర మంత్రి హెగ్డే నోటి దురుసు

బెంగళూరు: కేంద్ర మంత్రి, బీజేపీ నేత అనంత్ కుమార్ హెగ్డే మరో వివాదంలో చిక్కుకున్నారు. గతంలో చేసిన ఓ అభ్యంతరకరమైన కామెంట్‌ను సమర్థించుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ నేత గుండూరావ్ వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావించారు. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు కేంద్ర మంత్రిపై దుమ్మెత్తి పోస్తున్నారు. తాజ్‌మహల్‌ను షాజహాన్ నిర్మించలేదనీ, అది మంది రమని నిన్న నోటికి పనిచెప్పిన హెగ్డే ఈరోజు మరోసారి రెచ్చిపోయారు. కర్ణాటకలోని కొడగు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. హిందూ మహిళలకు ఎవరి చెయ్యి అయినా తాకితే అది ఇక ఉండకూడదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.దీంతో కర్ణాటక పీసీసీ చీఫ్ దినేశ్ గుండూ రావు స్పందిస్తూ.. మీరు కేంద్ర మంత్రి అయ్యింది ఇందుకేనా? కర్ణాటక అభివృద్ధికి మీరు ఏం చేశారు? మంత్రి బాధ్యతలు స్వీకరించాక ఏం సాధించారు? నిజంగా ఓ కేంద్రమంత్రి నుంచి ఇలాంటి మాటలు వినాల్సి రావడం సిగ్గుచేటు. ఇలాంటి వ్యక్తులు మంత్రులుగా, పార్లమెంటు సభ్యు లుగా ఎన్నికవడం నిజంగానే బాధాకరమని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌తో ఆగ్రహానికి లోనయిన హెగ్డే వెంటనే బదులిస్తూ..నేను దినేశ్ గుండూరావ్ ప్రశ్నలకు తప్పకుండా సమాధానం ఇస్తా. కానీ ముందుగా గుండూరావ్ ఎవరితో కలిసి ఏం విజయాలు సాధించారో చెప్పాలి. నాకు తెలిసినంత వరకూ ఆయన ఓ ముస్లిం మహిళ వెనుక పరుగెత్తిన వ్యక్తి మాత్రమే అని వ్యాఖ్యలు చేశారు.

హావ్వ.. ఇదేమిటి సిద్దూ?

- బహిరంగ సమావేశంలో అనుచిత ప్రవర్తన
- మైక్‌తోపాటు మహిళ చున్నీని గుంజిన వైనం
- కర్నాటక మాజీ సీఎం అనుచిత ప్రవర్తనపై సర్వత్రా నిరసన
- కన్నెర్ర చేసిన జాతీయ మహిళా కమిషన్

మైసూర్: పరిస్థితి ఎలాంటిదైనా అణచుకోలేని కోపం అనర్థాలకు దారి తీస్తుంది. ఇప్పుడు అలాంటి పరిస్థితే కాంగ్రెస్ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఎదురైంది. మైసూరులో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ఓ మహిళ మాట్లాడిన తీరుకు సహనం కోల్పోయిన సిద్ధరామయ్య ఆమె వద్ద ఉన్న మైక్‌ను వేగంగా లాక్కొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మైక్‌తోపాటు ఆ మహిళ చున్నీ కూడా వచ్చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో పలు టీవీ ఛానళ్లలో ప్రసారం కావడంతో వైరల్‌గా మారింది. ఆ మహిళ పట్ల సిద్ధరామయ్య దారుణంగా ప్రవర్తించారని పలువురు మండిపడుతున్నారు. సిద్ధ రామయ్య, మరి కొందరు నాయకులు సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓ మహిళ అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. మైక్ లాక్కొన్న తర్వాత కూడా జరిగిన తప్పిదాన్ని గ్రహించకుండా, వెంటనే ఆమెను అక్కడి నుంచి వెళ్లిపొమ్మంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన నియోజకవర్గంలో అభివృద్ధి సక్రమంగా జరగడం లేదంటూ ఆమె సిద్ధూకు ఫిర్యాదు చేయడమే ఈ పరిస్థితికి కారణం.కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళ పట్ల అవమానకర రీతిలో ప్రవర్తించిన ఆయనపై కేసు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కర్ణాటక పోలీసులను కోరింది. పెద్దపెద్ద పదవులను అనుభవించిన వారు మహిళల పట్ల ప్రవర్తించే తీరు ఇదేనా? అని ప్రశ్నించింది.

చెడు ఉద్దేశం లేదు: సిద్ధరామయ్య

తాను ఓ మహిళతో దురుసుగా ప్రవర్తించానని వస్తున్న విమర్శలపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఆ మహిళ తన సోదరిలాంటిదని, ఇందులో చెడు ఉద్దేశం లేదని ఆయన అన్నారు. ఓ జాతీయ మీడియాతో ఆయన ఈ విషయంపై మాట్లాడుతూ... మా పార్టీ కార్యకర్త అయిన ఆమె చాలా సేపు ఆపకుండా మాట్లాడుతుండడంతో నేను అడ్డుకోవాలని చూశాను. దీంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇది అనుకోకుండా జరిగింది. ఇందులో ఎటువంటి చెడు ఉద్దేశం లేదు. ఆమె నాకు 15 ఏళ్లుగా తెలుసు. ఆమె నా సోదరివంటిది అని ఆయన వివరణ ఇచ్చారు.

నాకు ఎటువంటి అభ్యంతరాలు లేవు

సిద్ధరామయ్య తీరుపై జమాలా స్పందిస్తూ తనకు ఈ ఘటనపై తనకు ఎటువంటి అభ్యంతరాలు లేవని చెప్పారు. ఆయన గతంలో ఓ గొప్ప ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. నేనే ఓ విషయంలో ఆవేదనకు గురై ఆయన ముందు దురుసుగా మాట్లాడాను. ఓ మాజీ ముఖ్యమంత్రితో నేను అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ఆయన ముందు ఉన్న బల్లను నేను చేతితో కొట్టినందుకే ఆయనకు నాపై కోపం వచ్చింది అని వ్యాఖ్యానించారు.



రాహుల్ గాంధీ స్పందించాలి..

సిద్ధరామయ్య ప్రవర్తనపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించి, దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ డిమాండ్ చేశారు. ఆమెపై సిద్ధరామయ్య ప్రవర్తించిన తీరు నేరపూరిత చర్య అని, మహిళలపై కాంగ్రెస్ నేతల తీరు ఇలా ఉంటుందని విమర్శించారు. ఓ కుటుంబానికి (గాంధీ-నెహ్రూ) చెందిన మహిళలను మాత్రమే వారు గౌరవిస్తారని వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్య తీరుపై పలువురు భాజపా నేతలు విమర్శలు చేస్తున్నారు.

లండన్‌లో భారత జాతీయ పతాకం దహనంపై బ్రిటన్ ప్రభుత్వ విచారం



లండన్: రిపబ్లిక్ డే నాడు లండన్‌లో భారత జాతీయ పతాకానికి అవమానం జరిగింది. కొందరు వేర్పాటువాదులు మన జాతీయ పతాకాన్ని లండన్‌లోని భారతీయ హైకమిషన్ కార్యాలయం వద్ద దహనం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై బ్రిటన్ ప్రభుత్వం విచారం వ్యక్తం చేసింది. భారత పతాకాన్ని దహనం చేసిన ఘట నతో ఆవేదన చెందుతున్నామని చెప్పింది. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ప్రకటించింది.యావత్ భారతదేశం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ... బ్రిటీష్ సిక్కు, కశ్మీరీ వేర్పాటు సంస్థలకు చెందిన వారు లండన్ లోని ఇండియా హౌస్ వద్ద నిరసన ప్రదర్శనను నిర్వహించారు. భారత్‌కు, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో జాతీయ జెండాను దహనం చేశారు.

చిప్పతో అడుక్కుంటున్నట్లు మోడీ ఫోటో మార్ఫింగ్

మధురై: ప్రధాని మోదీ చేతిలో చిప్పతో అడుక్కుంటున్నట్టు ఫొటోను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పెట్టిన ఎండీఎంకే నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు శిర్కాళి పట్టణానికి చెందిన ఎండీఎంకే నేత సత్యరాజ్ అలియాస్ బాలు ఈ ఫోటోను మార్ఫింగ్ చేశారు. అతనిపై స్థానిక బీజేపీ నేత స్వామినాథన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సత్యరాజ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు నేడు కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన కోర్టు అతన్ని జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించింది. జనవరి 26న మధురై పర్యటనకు మోదీ రావడాన్ని డీఎండీకే కార్యకర్తలు నిరసించారు. ఈ సందర్భంగా ఫేస్ బుక్ లో సత్యరాజ్ ఈ ఫొటోను అప్ లోడ్ చేశారు.

అప్పరసు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య పురస్కారం

న్యూఢిల్లీ: పాలమూరు జిల్లాకు చెందిన కవి అప్పరసు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్‌దేవ్ రాసిన కవితలను 'గుప్పెడు సూర్యుడు', మరి కొన్నికవితలు పేరిట తెలుగులో అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ సోమవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. భారతీయ స్త్రీ ఎదుర్కొనే సామాజిక అన్యాయం, సుఖ దుఃఖాలతోపాటు దేశ విభజన సమయంలో తన తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రి మానసిక వేదన ఈ కవితల్లో వ్యక్తీకరించారని, కృష్ణారావు తెలుగులో వాటిని అద్భుతంగా అనువ దించారని సాహిత్య అకాడమీ ప్రశంసాపత్రంలో పేర్కొంది.

పాఠశాలల్లో సంస్కృత శ్లోకాలపై అభ్యంతరం...



న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులు సంస్కృతం, హిందీ శ్లోకాలను పఠించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులను శాస్త్రీయంగా తీర్చిదిద్దవలసిన విద్యాలయాల్లో దేవుడిపై ఆధారపడే తత్వాన్ని పెంపొందిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై జబల్‌పూర్‌వాసి, న్యాయవాది వీణాయక్ షా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు చేపట్టింది.జస్టిస్ రోహింటన్ ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ రిట్‌పై విచారణ జరిపింది. ఇది చాలా కీలకాంశమని, దీనిపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరపాలని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తరవున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.'అసతోమా సద్గమయ..' అనే సంస్కృత శ్లోకాన్ని పాఠశాలల్లో ఉదయంపూట పఠించడమంటే అందరికీ మత బోధ చేస్తున్నట్లు కాదని తుషార్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇది సార్వజనీన వాస్తవమని, అన్ని గ్రంథాలు, అన్ని మతాలు అంగీకరించినదేనని తెలిపారు. క్రైస్తవ పాఠశాలల్లో 'ఆనెస్టీ ఈజ్ ద బెస్ట్ పాలసీ..' అని చెబుతారని, అది మతపరమైనదా? అని అడిగారు.దీనిపై జస్టిస్ నారిమన్ మాట్లాడుతూ 'అసతోమా సద్గమయ' అనేది నేరుగా ఉపనిషత్తుల నుంచి వచ్చిందని చెప్పారు. దీనిపై తుషార్ స్పందిస్తూ సుప్రీంకోర్టు అధికారిక లోగోలో 'యతో ధర్మస్తతోజయ..' అని ఉంటుందని, ధర్మం ఉన్న చోటే విజయం ఉంటుందని దీని అర్థమని తెలిపారు. దీనిలో మతపరమైన అంశం ఏదీ లేదన్నారు.అయితే ఈ వివాదాన్ని విస్తృత ధర్మాసనం విచారించవలసిందేనని జస్టిస్ నారిమన్ చెప్పారు. ఈ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కి నివేదించారు.

ఉద్యోగులకు విధులపై ఆంక్షలు

- వరుసగా మూడేళ్లు పనిచేసి ఉంటే దూరం
- ఒకే జిల్లాలో మూడేళ్లు పనిచేసినా అంతే
- డీఈవో, ఆర్వో, ఏఆర్వో, ఎస్‌ఐలకూ నిబంధనలు
- ఈసీ కీలక ఆదేశాలు.. రాష్ట్రాలకు లేఖలు



న్యూఢిల్లీ: త్వరలో లోక్‌సభతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల సంఘం ప్రధాన అధికారులకు, ఆయా రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాసింది. పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారుల బదలీలు, నియామకాల విషయంలో స్పష్టమైన సూచనలు చేసింది. అధికారులకు సొంత జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వరాదని ఈసీ సూచించింది.గత నాలుగేళ్లలో వరుసగా మూడేళ్లపాటు పనిచేసిన జిల్లాల్లో ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించరాదని తన లేఖలో పేర్కొంది. 2019 మార్చి 31 వరకు ఒకే జిల్లాలో పదవీకాలం మూడేళ్ల పూర్తవ్వనున్న ఉద్యోగులకు సదరు జిల్లాలో పోస్టింగ్ ఇవ్వరాదని స్పష్టంచేసింది. 2017 మే 31కి ముందు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన జిల్లాల్లో.. డీఈవో, ఆర్వో, ఏఆర్వో, ఎస్సైలకు తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వరాదని సూచించింది. 2019లో లోక్‌సభతోపాటు ఏపీ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ఈ లేఖలు రాసింది.

ఒకే రాహుల్, ఒకే ప్రియాంక : అమిత్ షా ఎద్దేవా



న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు అమిత్ షా కాంగ్రెస్ అగ్ర నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనలో సోమవారం జరిగిన ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌కు సంక్షిప్త రూపం ఓఆర్‌ఓపీకి కొత్త వివరణ ఇచ్చారు. ఓఆర్‌ఓపీ అంటే ఓన్లీ రాహుల్, ఓన్లీ ప్రియాంక అని చెప్పారు.బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైనికులకు వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను అమలు చేశారని అమిత్ షా చెప్పారు. మోదీ మన జవాన్లకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ ఇస్తే, కాంగ్రెస్ మాత్రం ఓన్లీ రాహుల్, ఓన్లీ ప్రియాంకను ఇచ్చిందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవలే ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను తూర్పు ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. రాహుల్, ప్రియాంక వచ్చే నెల 4న కుంభ మేళాలో పాల్గొంటారని, అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడతారని సమాచారం.

మీ పద్ధతి అస్సలు బాగోలేదు

నా గురించి దుష్ప్రచారం చేస్తున్నారు : తులసి గబ్బార్డ్



వాషింగ్టన్: మతాన్ని కారణంగా చూపి తనను ఎన్నికల్లో ఓడించాలని కొంతమంది వ్యక్తులు, మీడియా సంస్థలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్న తులసి గబ్బార్డ్ ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతస్తురాలినైన కారణంగా తనను, తన మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగడం సరికాదని హితవు పలికారు. భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసినవుడు దిగిన ఫొటోలను ఆధారంగా చూపి నేను కేవలం ఒక మతానికి మాత్రమే విలువనిస్తానని దుష్ప్రచారం చేస్తున్న వాళ్లు.. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు మరికొంత మంది నా సహసభ్యులు కూడా మోదీని కలిసిన విషయాన్ని గుర్తించాలి. మత దురభిమానం గల వ్యక్తిగా నన్ను చిత్రీకరించే మీ పద్ధతి అస్సలు బాగోలేదు అంటూ ప్రత్యర్థులను విమర్శించారు.

ఎవరైనా బాధితులే కదా

ఈరోజు హిందువుని లక్ష్యంగా చేసుకున్నారు. రేపు ముస్లిం లేదా యూదు అమెరికన్లు, ఆఫ్రికన్ అమెరికన్లని లక్ష్యంగా చేసుకుంటారు. అయినా నేను భయపడను. కాంగ్రెస్ సభ్యురాలిగా ఎన్నికైన తొలి హిందూ వ్యక్తిగా నేను గర్వపడతున్నాను. అలాగే అగ్రరాజ్య అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న తొలి హిందువుగా కూడా ఆనందపడుతున్నాను. అయితే ఈ విషయం కొంతమందికి నచ్చడం లేదు. దేశం పట్ల నా బాధ్యత గురించి ప్రశ్నించాలి గానీ నా మతం గురించి కాదు. చెత్త రాజకీయాలు వద్దు. ఇతర నాయకుల వలె నాకు ద్వంద్వ విధానాలు చేతకావు. ఎందుకంటే నేను హిందువును. అయినా నిజమైన అమెరికన్లు మతం, వర్గం, లింగ భేదాలను అనుసరించి ఓటు వేయరు అంటూ తులసి వ్యాఖ్యానించారు. ఇతర దేశాలతో దౌత్య సంబంధాలు మెరుగుపరచుకోవడం కోసం నాయకులతో చర్చలు జరపడం అతి సాధారణ విషయమని గుర్తించకపోవడం విచారకరమన్నారు. కాగా అమెరికా అధ్యక్ష పదవి కోసం బరిలో దిగే తొలి హిందువుగా తులసి చరిత్రకెక్కనున్నారు. అలాగే 2020 ఎన్నికల్లో గెలుపొందితే ఈ పదవి దక్కించుకున్న తొలి మహిళగా.. అత్యంత పిన్న వయస్సులో అగ్రరాజ్య పీఠాన్ని అధిరోహించిన వ్యక్తిగా... ఇలా పలు రికార్డులు ఆమె సొంతమవుతాయి. అమెరికన్ సమోవా సంతతికి చెందిన తులసి.. 2002లో హవాయి స్టేట్ లెజిస్లేటివ్‌గా ఎన్నియ్యారు. తద్వారా అత్యంత పిన్న వయస్సు(21)లో ఈ పదవి అలంకరించిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. ఇక ప్రస్తుతం ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ నుంచి మొత్తం 12 మంది అధ్యక్ష పదవికి పోటీ పడనున్నట్లు అంచనా. ఎలిజబెత్ వారెన్, కిర్‌స్టెన్ గిల్లిబ్రాండ్, తులసీ గబ్బార్డ్, కమలా హ్యారిస్‌లు పోటీ విషయమై ప్రకటన చేయడంతో ట్రంప్‌పై పోటీకి ఎవరు నిలుస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. వీరిలో ఎవరు గెలిచినా అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టే తొలి మహిళగా చరిత్ర సృష్టిస్తారు.

మీరేం ఒరగబెట్టారు

- గడ్కరీ వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఉద్దేశించే
- 'గరీబీ హఠావో' నినాదాన్ని ప్రస్తావించిన బీజేపీ



న్యూఢిల్లీ: కలల్లో విహరింపజేసి, వాటిని సాకారం చేయడంలో విఫలమైన వారిని ప్రజలు చితగ్గొడతారంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సొంత పార్టీ నేతలను ఉద్దేశించే గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ సహా పలు పార్టీలు విమర్శించాయి. అయితే దీనిపై బీజేపీ స్పందిస్తూ కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టింది. తమ పార్టీపై కాదని, కాంగ్రెస్‌ను ఉద్దేశించే గడ్కరీ మాట్లాడారని స్పష్టం చేసింది. 'నితిన్ గడ్కరీ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ దాని నుంచి రాజకీయ లబ్ది పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. కానీ గడ్కరీ కాంగ్రెస్ పార్టీని ఉద్దేశిస్తూ ఆ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ గతంలో గరీబీ హఠావో(పేదరికాన్ని నిర్మూలిద్దాం) అనే నినాదాన్ని ఇచ్చింది. కానీ పేదరికాన్ని నిర్మూలించేందుకు ఆ పార్టీ ఏమీ చేయలేదు. ఇప్పుడు రాహుల్‌గాంధీ కూడా అలాంటి హామీలే ఇస్తున్నారు. వారిని ఉద్దేశించే గడ్కరీ ఆ వ్యాఖ్యలు చేశారు' అని బీజేపీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు సోమవారం మీడియాతో అన్నారు.గడ్కరీ నిన్న ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నేను కేవలం మాటలు చెప్పేవాడిని కాను. ఏం చెప్పానో అది 100 శాతం నెరవేరుస్తా. కలల్లో విహరింపజేసి, వాటిని సాకారం చేయడంలో విఫలమైన వారిని ప్రజలు చితగ్గొడతారు అని అన్నారు. గడ్కరీ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి వారు చాలామంది బీజేపీ నుంచి వస్తారు అని విమర్శించింది. అటు మజ్లీస్ నేత, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. 'ప్రధాని గారు.. గడ్కరీ మిమ్మల్ని అద్దంలో చూపిస్తున్నారు. అది కూడా చాలా సూక్ష్మంగా ..' అంటూ ఎద్దేవా చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గడ్కరీ సొంత పార్టీ నేతలపైనే విమర్శలు చేస్తూ వార్తల్లో నిలిచారు. ఆ మధ్య ఓటమితోపాటు వైఫల్యాలనూ అంగీకరించే ధోరణి పార్టీ నాయకత్వానికి ఉండాలంటూ గడ్కరీ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల గణతంత్ర వేడుకల్లో గడ్కరీ.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పక్కనే కూర్చోవడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

తలకు ముసుగు ధరించేది లేదన్న వధువు రణరంగంగా మారిన కల్యాణ మండపం

భోపాల్: పెళ్లిలో చీర చెంగుతో తలను కప్పుకోవడానికి వధువు నిరాకరించడంతో మండపంలోనే వధూవరుల కుటుంబాలు కలబడ్డాయి. ఇరు కుటుంబాల మధ్య భారీ ఫైట్ జరిగింది. చివరికి పెళ్లి నిలిచిపోయింది. మధ్యప్రదేశ్‌లోని రాట్లాంలో జరిగిందీ షాకింగ్ ఘటన.వర్ష సోనావా-వల్లభ్ పంచోలీ వివాహానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు పెద్ద ఎత్తున కల్యాణ మండపానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పెళ్లి కూతురు ఈవినింగ్ గౌన్ ధరించి ఉండడాన్ని చూసిన వల్లభ్ తరవు బంధువులు చీర కట్టుకుని చక్కగా తలను కప్పుకోవాలని వర్షను కోరారు. అందుకు ఆమె నిరాకరించింది.తాను ఎటువంటి దుస్తులు వేసుకోవాలో వారు ఆదేశించడం ఏమిటంటూ మండిపడింది. దీంతో ఇరు వర్గాల మధ్య చిన్నగా వాగ్వివాదం ప్రారంభమైంది. అది క్రమంగా పెరిగి పెద్దదై ఘర్షణకు దారి తీసింది. అంతే.. విచక్షణ కోల్పోయిన ఇరు వర్గాలు దాడికి దిగాయి. అప్పటి వరకు పెళ్లి సందడితో కళకళలాడిన కల్యాణ మండపం ఒక్కసారిగా భీకర యుద్ధ రంగంగా మారిపోయింది. రెండు కుటుంబాలు వెనక్కి తగ్గకపోవడంతో స్పందించిన వరుడు తన కుటుంబ సభ్యులు, బంధువులను తీసుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వధువు తరవు వారిపై ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు ఇరు కుటుంబాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. మూడు గంటలపాటు చర్చలు జరిపారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పెళ్లిని రద్దు చేసుకోవడానికే ఇరు కుటుంబాలు మొగ్గు చూపడంతో పోలీసులు చేతులెత్తేశారు. చివరికి పెళ్లి రద్దు చేసుకుని ఇరు కుటుంబాలు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.కొసమెరుపు ఏమిటంటే.. వధూవరులిద్దరూ ఉన్నత విద్యావంతులు కావడం. వరుడు వల్లభ్ సివిల్ ఇంజినీర్ కాగా, వధువు వర్ష ప్రభుత్వ ఉద్యోగి.



ఏటీఎంలో చిరుతపులి కూన

పట్టుకుని అడవిలో వదిలేసిన అధికారులు

మండి(హిమాచల్ ప్రదేశ్): దారి తప్పి ఊర్లోకి వచ్చిన ఓ చిరుతవులి పిల్ల చలికి తట్టుకోలేకపోయింది. అటూ ఇటూ చూసి ఎదురుగా కనిపించిన ఏటీఎం సెంటర్‌లోకి దూరింది. కాస్త వెచ్చగా ఉండడంతో అక్కడే సెటిలైపోయింది. అక్కడ పులి కూన ఉందని తెలియని ఓ వ్యక్తి డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లి దానిని చూసి హడలిపోయాడు. గుండెలు అరచేతితో పట్టుకుని భయంతో పరుగులు తీశాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లా తుంగ్ ప్రాంతంలో ఆదివారం జరిగిందీ ఘటన.సదరు వ్యక్తి కేకలు వేస్తూ పరుగులు పెట్టడంతో ఆరా తీసిన స్థానికులు ఏటీఎంకు చేరుకుని లోపలున్న చిరుత పిల్లను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. చివరికి ఓ టాక్సీ డ్రైవర్ సాహసం చేసి ఏటీఎం నుంచి దానిని బయటకు తీశాడు. అతడి చేతుల నుంచి తప్పించుకున్న అది అక్కడే ఉన్న ఓ వాహనం కిందికి వెళ్లి నక్కింది. దీంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారొచ్చి దానిని పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. చిరుత పిల్ల ఏటీఎంలో దూరడంపై స్థానికులు మాట్లాడుతూ.. చలికి తట్టుకోలేకే అది అందులో దూరినట్టు చెప్పారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు మారకపోతే

దిగిపోవడానికి సిద్ధం : కర్నాటక సీఎం

- సిద్ధరామయ్య వర్గం వ్యాఖ్యలపై కుమారస్వామి ఆగ్రహం
- సంకీర్ణ సర్కార్‌లో ఇవి మామూలేనన్న దేవెగౌడ

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోకపోతే తాను ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని కర్ణాటక సీఎం కుమారస్వామి హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం నేపథ్యంలో సీఎంగా ఉన్న జేడీఎస్ నేత కుమారస్వామికి రకరకాల సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ నేత, మంత్రి సి.పుట్టరంగ శెట్టి మాట్లాడుతూ.. తనకు మాత్రం ఇంకా సిద్ధరామయ్యనే ముఖ్యమంత్రి అన్నారు. సిద్ధరామయ్య కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి. పుట్టరంగ వ్యాఖ్యలపై కుమారస్వామి స్పందించారు. కాంగ్రెస్ నేతలు హద్దులు దాటుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిపై కాంగ్రెస్ నేతలు జాగ్రత్తగా ఉండాలని..

ఈ అంశాలకు తాను బాధ్యుడిని కానని స్పష్టం చేశారు. వాళ్లు ఇంకా ఇలాంటివి కొనసాగించాలనుకుంటే మాత్రం.. తాను పదవి నుంచి దిగిపోవడానికైనా సిద్ధమని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు వాళ్ల ఎమ్మెల్యేలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. కాగా సిద్ధరామయ్య క్యాంపునకు చెందిన ఎమ్మెల్యేలు కుమారస్వామిపై విమర్శలు చేస్తున్నారు. సిద్ధరామయ్య మరో ఐదేళ్లు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని మరో కాంగ్రెస్ నేత ఎస్‌టీ సోమశేఖర్ అన్నారు. సిద్ధరామయ్య కూడా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాజకీయ ప్రత్యర్థులు తనను గెలవకుండా చేశారని, తాను మరో పర్యాయం అధికారంలోకి వచ్చి ఉంటే ఎన్నో అభివృద్ధి పనులు పూర్తిచేసేవాడినని చెప్పుకొచ్చారు. ఇలాంటి



వ్యాఖ్యల పట్ల కుమారస్వామి ఆగ్రహంగా ఉన్నారు. కాగా కుమారస్వామి తండ్రి మాజీ ప్రధాని దేవెగౌడ మాత్రం.. సంకీర్ణ ప్రభుత్వంలో ఇలాంటివి సాధారణమేనని, దీనిపై తాను స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. ఇటీవల కర్ణాటకలో ఎమ్మెల్యేల అదృశ్యం, రిసార్టు రాజకీయాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

బుకర్ ప్రైజ్‌కు మ్యాన్ గ్రూప్ గుడ్‌బై

లండన్: ఆంగ్ల నవలారంగంలో బ్రిటన్ అందించే అత్యున్నత పురస్కారం మ్యాన్ బుకర్ ప్రైజ్ పేరు మారనుంది. బుకర్ ప్రైజ్‌కు 18 ఏళ్లుగా స్పాన్సర్ కొనసాగుతున్న హెడ్జ్ సంస్థ మ్యాన్ గ్రూప్ ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపింది. అత్యుత్తమ ఆంగ్ల నవలలకు ఏటా ఈ అవార్డు కింద 50వేల బ్రిటిష్ పౌండ్ల(రూ.46.79 లక్షలు) బహుమతిగా అందజేస్తున్నారు. బ్రిటన్ రచయిత సెబాస్టియన్ ఫాల్క్స్ గతేడాది మ్యాన్ గ్రూప్‌ను ప్రజలకు శత్రువుగా అభివర్ణించారు. అంతేకాకుండా కామన్‌వెల్త్ దేశాల రచయితలకే పరిమితమైన ఈ అవార్డును 2014లో మిగిలిన దేశాలకు విస్తరించడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పాన్సర్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించింది. దీనివల్ల ఏటా రూ.14.97 కోట్ల ఆర్థిక సాయాన్ని బుకర్ సంస్థ కోల్పోనుంది. 1969 నుంచి 2002 వరకూ బుకర్ అవార్డుకు మెక్‌కెన్నెల్ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించింది. అప్పట్లో 21 వేల పౌండ్లుగా ఉన్న బహుమతిని 2002లో మ్యాన్ గ్రూప్ 50 వేల పౌండ్లకు పెంచింది.

హార్థిక్, రాహుల్‌లకు అవకాశముంది: రాహుల్ ద్రవిడ్

న్యూఢిల్లీ: కాఫీ విత్ కరణ్ అనే టీవీ షోలో.. మహిళల పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసి.. టీం ఇండియా ఆటగాళ్లు హార్థిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లు నిషేధానికి గురైన విషయం తెలిసిందే. అయితే వీరిద్దరు బీసీసీఐ, సీఓఏ ముందు బేషరతుగా క్షమాపణ చెప్పడంతో వీరిపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేశారు. ఈ క్రమంలో హార్థిక్ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లగా.. రాహుల్ ఇక్కడే ఇండియా-ఏ జట్టు తరఫున ఆడుతున్నాడు. అయితే ఈ వివాదంపై టీం ఇండియా క్రికెట్ దిగ్గజం, ఇండియా-ఏ, అండర్-19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ స్పందించారు. కేఎల్ రాహుల్, హార్థిక్ పాండ్యాలకు తమ తప్పులు సరిదిద్దుకొనేందుకు ఇంకా అవకాశం ఉందని ఆయన తెలిపారు. వాళ్లిద్దరికీ ఇంకా అదర్శప్రాయంగా మారేందుకు ఇంకా అవకాశం ఉంది. క్రికెట్‌లో వాళ్లు నిజాయితీగా ఆడితే ప్రేక్షకులు వాళ్లను క్షమిస్తారు అని ద్రవిడ్ అభిప్రాయపడ్డారు. కాగా సుప్రీంకోసం నియమిత సీఓఏ ఈ కేసు కోసం ప్రత్యేకంగా అంబుడ్స్‌మెన్‌ను నియమించనుంది. దీనిపై అంబుడ్స్‌మెన్ సమర్పించే నివేదిక ఆధారంగా వీరిద్దరి భవితవ్యం తేలనుంది.



కివీస్‌పై ఇండియా ఘన విజయం

మౌంట్ మాంగనుయ్: కోహ్లీసేనకు తిరుగులేదు. న్యూజిలాండ్‌పై వరుసగా మూడో వన్డే గెలిచింది. ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. ముందు బౌలర్లు.. తర్వాత బ్యాట్స్‌మన్ సమష్టిగా రాణించారు. నిలకడతో అదరగొట్టారు. దెబ్బకు కివీస్ చేసేదేమీ లేక డీలా పడిపోయింది. ఒకప్పుడు ఆసీస్, కివీస్ పరిస్థితుల్లో మ్యాచ్‌లు ఆడాలంటే టీమిండియా చెమటోడ్చాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఒకవైపు పేస్. మరోవైపు మణికట్టు మాయ. భీకరమైన టాప్, మిడిలార్డర్. అందుకే భారత్ వరుసగా రెండో వన్డే సిరీస్‌ను గెలిచింది. స్మిత్, వార్నర్ లేని ఆసీస్‌పై సునాయాసంగా గెలిచిందన్న మాటలకు ఘాటు సమాధానం చెప్పింది కోహ్లీసేన. నిలకడకు పేరైన పటిష్ఠ న్యూజిలాండ్ జట్టుపై జైత్రయాత్ర కొనసాగించింది. ఇక విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. 63 వన్డేలకు సారథ్యం వహించగా 47 మ్యాచుల్లో జట్టును గెలిపించాడు. క్లైవ్‌లాయిడ్, రికీ పాంటింగ్ 50 వన్డే విజయాల రికార్డుకు చేరువలో నిలిచాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియాకు శుభారంభమే లభించింది. ఓపెనర్ శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, పోటీ పడి ఆడారు. కాగా, జట్టు స్కోరు 39 వద్ద గబ్బర్‌ను బౌల్ట్ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన టీమిండియా సారథి విరాట్ కోహ్లీ మరోసారి తన అందమైన ఆటను ప్రదర్శించాడు. సమయోచిత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆచితూచి ఆడుతూనే సొగసైన కవర్‌డ్రైవ్‌లు ఆడాడు. అతడికి తోడుగా రోహిత్ శర్మ అప్పుడప్పుడు భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం అందించారు. క్రీజులో కుదురుకున్న ఈ జోడీని రోహిత్‌శర్మను ఔట్ చేయడం ద్వారా శాంట్నర్ విడదీశాడు. అప్పుడు స్కోరు 152. మరికాసేపటికే కోహ్లీని బౌల్ట్ పెవిలియన్ పంపించాడు. అప్పటికే చేయాల్సిన రన్‌రేట్ తక్కువగా ఉండటంతో భారత్ విజయం సాధించేందుకు కష్టపడలేదు. అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్ పోటీపడి ఆడారు. నువ్వానేనా అన్నట్టు బౌండరీలు బాదేశారు. నాలుగో వికెట్‌కు 77 పరుగుల అజేయ భాగస్వామ్యం అందించారు. దీంతో కోహ్లీసేన 43 ఓవర్లకే ఛేదన పూర్తిచేసింది. 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. షమికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు ఆదిలోనే దెబ్బకొట్టారు. మార్టిన్ గప్తిల్ (13), కొలిన్ మన్రో (7), కేన్ విలియమ్సన్ (28) జట్టు స్కోరు 59 లోపే పెవిలియన్ చేరారు. ఈ క్రమంలో టామ్ లేథమ్‌తో కలిసి సీనియర్ ఆటగాడు రాస్ టేలర్ చెలరేగాడు. శతకానికి చేరువయ్యాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 119 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆచితూచి ఆడుతోనూ చూడచక్కని షాట్లతో విరుచుకుపడ్డారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని లేథమ్‌ను ఔట్ చేయడం ద్వారా చాహల్ విడదీశాడు. అప్పుడు జట్టు స్కోరు 178. ఒక వైపు వికెట్లు పడుతున్న టేలర్ ప్రతిఘటించాడు. 222 పరుగుల వద్ద షమి అతడిని పెవిలియన్ పంపించాడు. కివీస్ 243 పరుగులకు ఆలౌటైంది. షమి 3, భువి, చాహల్, పాండ్య తలో రెండు వికెట్లు పడగొట్టారు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలో టీమిండియా బ్యాట్స్‌మెన్ అదరగొడుతున్నారు. ఈ క్రమంలో ఓపెనర్ రోహిత్ శర్మ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. రోహిత్‌కిది తన కెరీర్‌లో 39వ అర్ధశతకం. మరో ఎండ్‌లో







- అదరగొట్టిన కోహ్లీ-శర్మ బ్యాటింగ్ విన్యాసం
- రోహిత్ శర్మ అర్ధ శతకం
- హార్దిక్ పాండ్య అద్భుతమైన క్యాచ్
- ఇక హాయిగా విశ్రమిస్తా: కోహ్లి
- పాండ్యాపై కోహ్లి ప్రశంసలు
- ధావన్ త్రోపై పాండ్యా అసహనం

ఉన్న సారథి విరాట్ కోహ్లీతో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తున్నాడు. కోహ్లీ సైతం అర్ధశతకానికి చేరువలో ఉన్నారు. క్రీజులో ఉన్న రోహిత్(51), కోహ్లీ(37) కలిసి 79 పరుగుల భాగస్వామ్యాన్ని జట్టుకు అందించారు. 23 ఓవర్లలో టీమిండియా ఒక వికెట్ కోల్పోయి 118 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య స్పైడర్ మ్యాన్ అవతారం ఎత్తి అద్భుతంగా క్యాచ్ పట్టాడు. సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత పాండ్య ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే. విజయ్ శంకర్ స్థానంలో పాండ్య జట్టులోకి వచ్చాడు. మ్యాచ్‌లో భాగంగా కివీస్ ఓపెనర్లను పెవిలియన్ చేర్చిన కోహ్లీసేన వన్‌డౌన్ బ్యాట్స్‌మన్, ఆతిథ్య జట్టు సారథి కేన్ విలియమ్సన్‌పై దృష్టి పెట్టింది. రాస్ టేలర్‌తో కలిసి నిలకడగా ఆడుతున్న విలియమ్సన్‌ను చాహల్ పెవిలియన్ చేర్చాడు. 17 ఓవర్లో చాహల్ బౌలింగ్‌లో విలియమ్సన్ భారీ షాట్‌కు యత్నించాడు. అయితే ఈ బంతిని పాండ్య గాల్లోకి ఎగిరి అద్భుతంగా క్యాచ్ పట్టాడు. దీంతో కివీస్ సారథి జోరుకు బ్రేక్ పడింది. పాండ్య అద్భుత ప్రదర్శనను అభిమానులు మెచ్చుకుంటు కామెంట్లు పెడుతున్నారు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేస్తుందన్న విశ్వాసాన్ని కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యక్తం చేశాడు. వన్డే సిరీస్ గెలవడంతో సంతోషంగా బ్రేక్ తీసుకుంటానని చెప్పాడు.

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను 3-0తో గెలిచాం: కోహ్లీ

కివీస్‌తో మూడో వన్డే ముగిసిన తర్వాత కోహ్లీ మీడియాతో మాట్లాడుతూ... చివరి రెండు వన్డేల్లోనూ మేము విజయం



సాధిస్తాం. చాలా రోజుల నుంచి బ్రేక్ తీసుకోలేదు. ఆస్ట్రేలియా పర్యటనతో ఊపిరి సలపకుండా గడిపాం. అందుకే విరామం తీసుకుంటున్నాను. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను 3-0తో గెలిచాం కాబట్టి సంతోషంగా బ్రేక్ తీసుకుంటా. విరామ సమయాన్ని బాగా గడుపుతాను. ఎవరో ఒకరు మన స్థానాన్ని భర్తీ చేస్తారు. మనం ఉన్నా లేకున్నా ఆట కొనసాగుతుందని అన్నాడు. సెలెక్టర్లు విశ్రాంతి కల్పించడంతో చివరి రెండు వన్డేలకు కోహ్లీ అందుబాటులో ఉండడం లేదు. న్యూజిలాండ్‌లో వన్డే సిరీస్ గెలవడం పట్ల విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. సమిష్టిగా రాణించి విజయాన్ని అందుకున్నామన్నాడు. మూడో వన్డే చివర్లలో అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్ బాగా బ్యాటింగ్ చేశారని ప్రశంసించాడు. డ్రెసింగ్ రూములో కూర్చుని ప్రతి పరుగుకు కేరింతలు కొట్టామన్నాడు. ఆటగాళ్లు అందరూ తమ ప్రతిభపై నమ్మకం ఉంచి, దాన్ని మైదానంలో ప్రదర్శించడంతో విజయాలు దక్కాయని విశ్లేషించాడు. కాగా, చివరి రెండు వన్డేలకు కోహ్లీ స్థానంలో భారత జట్టుకు కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. తద్వారా రెండు వన్డేలు మిగిలి ఉండగానే కోహ్లీ సేన 3-0 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

హార్థిక్ రాకతో జట్టులో సమతౌల్యం

మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన కెప్టెన్ కోహ్లీ... ఇది జట్టు సభ్యుల సమిష్టి విజయమని కొనియాడాడు. ఈ క్రమంలో సస్పెన్షన్ అనంతరం మూడో వన్డే ద్వారా రీ ఎంట్రీ ఇచ్చిన ఆల్‌రౌండర్ హార్థిక్ పాండ్యాపై ప్రశంసలు కురిపించాడు. హార్థిక్ రాకతో జట్టులో సమతౌల్యం ఏర్పడింది. తను తల దించుకునే ఉన్నాడు. కానీ జట్టుకు కావాల్సిందే మిటో తనకు తెలుసు. అందుకే ఆటపై దృష్టి పెట్టాడు. తన బాధ్యత నెరవేర్చాడు. ఈరోజు తన ఆట తీరు అద్భుతం. అతడి రాక సంతోషాన్నిచ్చింది. అని వాఖ్యానించాడు. అదేవిధంగా శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్ వంటి యువ ఆటగాళ్లు జట్టుతో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నాడు. శుభ్‌మన్ ప్రతిభావంతుడైన ఆటగాడు. నెట్స్‌లో తను ప్రాక్టీస్ చేసే తీరు అద్భుతం. నేను తన వయస్సులో ఉన్నప్పుడు.. అందులో కనీసం పదో శాతం కూడా అలా ఆడలేదు అంటూ ప్రశంసించాడు. యువ ఆటగాళ్లకు సరైన ప్రాతినిథ్యం కల్పించి వారి సేవలను చక్కగా వినియోగించుకుంటామని పేర్కొన్నాడు. కాగా టీవీ షోలో మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న హార్థిక్ పాండ్యా మౌంట్ మాంగనీ వన్డే ద్వారా రీఎంట్రీ ఇచ్చాడు. అద్భుతమైన క్యాచ్‌తో కివీస్ కెప్టెన్ విలియమ్సన్‌ను పెవిలియన్‌కు చేర్చి పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. చహల్ వేసిన 17వ ఓవర్ తొలి బంతిని విలియమ్సన్ ముందుకొచ్చి షాట్ ఆడగా.. ఫార్వార్డ్ ఫీల్డింగ్‌లో ఉన్న పాండ్యా సూపర్ డైవ్‌తో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. బాధ్యతాయుతంగా ఆడుతున్న విలియమ్సన్(28) అవుట్ కావడంతో కివీస్ విజయావకాశాలు దెబ్బతిన్నాయి. ఇక ఈ మ్యాచ్‌లో మెరుపు ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్న పాండ్యా రెండు వికెట్లు తీశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా సహనం కోల్పోయాడు. శిఖర్ ధావన్ త్రోను సరిగా వేయకపోవడంతో హార్దిక్ అసహనం వ్యక్తం చేశాడు. నిషేధం అనంతరం జట్టులో చేరిన పాండ్యాకు కివీస్‌తో మూడో వన్డేలో చోటు దక్కింది. గత రెండు వన్డేల్లోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ స్థానంలో హార్దిక్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా అటు బౌలింగ్‌లోనూ ఇటు ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. చహల్ వేసిన 17వ ఓవర్ తొలి బంతిని కివీస్ కెప్టెన్ విలియమ్సన్ ముందుకొచ్చి షాట్ ఆడగా.. ఫార్వార్డ్ ఫీల్డింగ్ ఉన్న పాండ్యా సూపర్ డైవ్‌తో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. రెప్పపాటులోనే పాండ్యా సూపర్ క్యాచ్ అందుకోవడంతో విలియమ్సన్(28) నిరాశగా పెవిలియన్ చేరాడు. ఇక బౌలింగ్‌లోనూ రాణించి రెండు రెండు వికెట్లు సాధించాడు. కాగా, న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా 14వ ఓవర్ వేస్తున్న సమయంలో శిఖర్ ధావన్ సరిగా త్రో చేయకపోవడంతో అతనిపై అసహనం వ్యక్తం చేశాడు. ఆ ఓవర్ రెండో బంతిని రాస్ టేలర్ మిడ్ వికెట్ దిశగా కొట్టాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ ఫీల్డర్లు ఎవరూ లేకపోవడంతో సింగిల్ పూర్తి చేసుకున్న టేలర్.. రెండో పరుగు కోసం యత్నించాడు. అయితే బంతిపైకి వేగంగా పరుగెత్తుకొచ్చిన శిఖర్ ధావన్ బంతిని అందుకున్నాడు. బంతిని అందుకున్న తడువుగా బ్యాడ్ త్రో చేశాడు. అటు బౌలర్‌కి కాకుండా ఇటు కీపర్‌కి కాకుండా పిచ్ మధ్యలోకి విసిరాడు. దీనిని అదనుగా భావించిన రాస్ టేలర్ రెండో పరుగుని కూడా పూర్తి చేశాడు. తన బౌలింగ్‌లో అదనంగా మరో పరుగు రావడంతో సహనం కోల్పోయిన హార్దిక్ పాండ్యా... కమాన్ యార్ అంటూ అసంతృప్తి వ్యక్తం చేశాడు. దీనికి సంబంధించి వీడియో నెట్టింట్లో వైరల్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.





అంబటి రాయుడి బౌలింగ్‌పై ఐసీసీ వేటు

- అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్‌పై నిషేధం
- బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు
- బౌలింగ్ యాక్షన్ పరీక్షకు హాజరుకు ఆదేశం
- నిర్ణీత గడువులో హాజరు కాకపోవడంతో ఐసీసీ చర్యలు
- దేశవాళీ క్రికెట్‌లో బౌలింగ్ కొనసాగించే అవకాశం
- టీమిండియా మిడిలార్డర్‌లో కీలక క్రికెటర్

న్యూఢిల్లీ: భారత ఆటగాడు అంబటి రాయుడి బౌలింగ్‌పై ఐసీసీ నిషేధం విధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా అతనిపై వేటు వేసింది. రాయుడి బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన పరీక్షకు హాజరుకావాల్సిందిగా ఐసీసీ ఆదేశించింది. అయితే నిర్ణీత 14 రోజుల్లో అతను హాజరుకాకపోవడంతో ఐసీసీ చర్యలకు ఉపక్రమించింది. ఐసీసీ నిబంధనల్లోని 4.2 క్లాజ్ ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయకుండా అతనిపై నిషేధం విధించింది. రాయుడు బౌలింగ్ శైలిని పరిశీలించి.. సక్రమంగానే బౌలింగ్ చేస్తున్నాడని నిర్ధారించే వరకూ ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. సిడ్నీలో ఈ నెల 13న ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో అంబటి రాయుడి బౌలింగ్ శైలిపై ఫిర్యాదు అందింది. అయితే బీసీసీఐ నిబంధనల ప్రకారం దేశవాళీ క్రికెట్‌లో అతను బౌలింగ్ కొనసాగించే అవకాశముంది.అంతర్జాతీయ క్రికెట్లో బౌలింగ్ వేయకుండా అంబటి రాయుడిపై ఐసీసీ నిషేధం విధించింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో రాయుడు బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఈ విషయం ఐసీసీకి చేరింది. వెంటనే స్పందించిన క్రికెట్ కౌన్సిల్.. అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ కొనసాగించాలంటే 14 రోజుల వ్యవధిలో నిర్దేశించిన టెస్టుకి హాజరు కావాలని రాయుణ్ని ఆదేశించింది. కానీ గడువులోగా రాయుడు బౌలింగ్ యాక్షన్ టెస్టుకు హాజరుకాలేదు. దీంతో బౌలింగ్ చేసేందుకు వీల్లేకుండా ఐసీసీ రాయుడిపై సస్పెన్షన్ విధించింది. ఐసీసీ నిబంధనల్లో 4.2 క్లాజ్ ప్రకారం సస్పెన్షన్ వెంటనే అమల్లోకి వస్తుందని కౌన్సిల్ తెలిపింది. బౌలింగ్ యాక్షన్ టెస్టుకి హాజరై మోచేతిని నిబంధనలకు అనుగుణంగానే వంచుతాన్నడాని రూఢీ అయ్యేంత వరకూ రాయుడిపై వేటు కొనసాగనుంది. దేశవాళీ క్రికెట్లో మాత్రం బీసీసీఐ అనుమతితో అంబటి రాయుడు బౌలింగ్ చేయొచ్చని ఐసీసీ వివరణ ఇచ్చింది. తెలుగు క్రికెటర్ అయిన రాయుడు టీమిండియా మిడిలాడర్డర్లో కీలకంగా మారాడు. అంబటి రాయుడు చాలా అరుదుగా బౌలింగ్ చేస్తుంటాడు. 49 వన్డేల్లో ఇప్పటి వరకూ 121 బంతులు మాత్రమే వేసిన రాయుడు.. మూడు వికెట్లు పడగొట్టాడు. వన్డేల్లో 9సార్లు మాత్రమే బౌలింగ్ చేసిన అంబటి.. అంతర్జాతీయ టీ20ల్లో ఒక్కసారి కూడా బౌలింగ్‌కు దిగలేదు.

ఈ ధోనీకి ఏమైంది?



- గాయం కారణంగా తుది జట్టులో స్థానం కోల్పోయిన వైనం
- 2013 తరువాత ఇలా జరగడం తొలిసారి
- భారత్ జట్టులో పెరిగిన ఆందోళన
- 2018లో పేలవ ఫామ్‌తో విమర్శలు
- ఆస్ట్రేలియాపై హ్యాట్రిక్ అర్ధశతకాలతో ఫామ్‌లోకి

న్యూఢిల్లీ:భారత జట్టులోకి 2004లో అరంగేట్రం చేసిన మహేంద్రసింగ్ ధోనీ.. గాయం కారణంగా తుది జట్టులో లేకుండా బెంచ్‌పై కూర్చోవడం ఇది మూడోసారి కాగా.. 2013 తర్వాత ఇదే తొలిసారి. భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఎంత ఫిట్‌గా ఉంటాడో..? అందరికీ తెలిసిందే. 37ఏళ్ల వయసులోనూ యువ ఆటగాళ్లతో పోటీపడుతూ పరుగులు సాధిస్తున్న ఈ ఫినిషర్.. వికెట్ల వెనుక మెరుపు వేగంతో స్టంపౌట్స్ చేస్తూ అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాడు. అలాంటి ధోనీ తొడ కండరాల గాయం కారణంగా న్యూజిలాండ్‌తో సోమవారంనాటి మూడో వన్డేకి దూరమవడం భారత్ జట్టులో కంగారు పెంచుతోంది. వన్డే ప్రపంచకప్ ముంగిట.. దాదాపు ఆరేళ్ల తర్వాత మళ్లీ అదే గాయం బారిన ధోనీ పడటమే ఆ కంగారుకి కారణం. 12 ఏళ్ల క్రితం 2007లో దక్షిణాఫ్రికా, ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లకి జ్వరం కారణంగా తుది జట్టులో ధోనీ చోటు కోల్పోయాడు. ఆ తర్వాత మళ్లీ 2013లో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో మూడు వన్డేలకి తొడ కండరాల గాయం కారణంగా దూరమయ్యాడు. తాజాగా మళ్లీ అదే గాయంతో తాజాగా వన్డే టీమ్‌లో చోటు కోల్పోయాడు. 2018లో పేలవ ఫామ్‌తో విమర్శలు ఎదుర్కొన్న ధోనీ.. ఈ ఏడాది ఆస్ట్రేలియాపై హ్యాట్రిక్ అర్ధశతకాలతో ఫామ్ అందుకున్నాడు. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ వికెట్ కీపర్‌గా, ఫినిషర్‌గా ఈ మాజీ కెప్టెన్ సత్తాచాటుతున్నాడు. మే నెలలో ఇంగ్లాండ్ వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో.. ధోనీ గాయంతో సాహసాలు చేయకూడదని టీమిండియా భావిస్తోంది. తాజా మ్యాచ్‌లో ధోనీ స్థానంలో దినేశ్ కార్తీక్ వికెట్ కీపర్‌గా తుది జట్టులోకి వచ్చాడు.

దక్షిణాదిలో పాగాకు బీజేపీ యత్నం

- 50 సీట్లను దక్కించుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు
- దక్షిణాది రాజకీయ పరిస్థితులు బీజెపికి అనుకూలం?
- కర్నాటకలో యడ్యూరప్ప సారథ్యంలో పార్టీ బలోపేతం
- శబరిమల వివాదంతో బీజేపీకి సానుకూల పరిస్థితులు
- చంద్రబాబుపై ప్రజలలో ఏర్పడిన వ్యతిరేకత బీజేపీకి అనుకూలం?



(సెంట్రల్ డెస్క్, సూర్య) రాబోయే లోక్‌సభ ఎన్నికలలో దక్షిణాది రాష్ట్రాలలో సుమారు 50 సీట్లను దక్కించుకోవాలని బీజెపి నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. 2014 ఎన్నికలలో లభించిన సీట్లకన్నా దాదాపు రెట్టింపు సీట్లు సాధించాలని ప్రయత్నిస్తోంది. హిందీ రాష్ట్రాలలో తగ్గగలవని భావిస్తున్న సీట్లను పశ్చిమ బెంగాల్, ఒడిశాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలలో భర్తీ చేసుకోవాలని గత మూడేళ్ళుగా బిజెపి అధ్యక్షుడు అమిత్ షా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం దక్షిణాదిన నెలకొన్న రాజకీయ పరిస్థితులు బిజెపికి అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. బీజేపీ అంచనాల ప్రకారం కర్ణాటకలో మొత్తం 28 సీట్లలో 25 సీట్లను, ఆంధ్రప్రదేశ్, కేరళలో 5 నుండి 7 సీట్ల చొప్పున, తమిళనాడులో 10 సీట్ల వరకు గెల్చుకొనే ప్రయత్నం చేస్తున్నది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో అతిపెద్ద పార్టీగా గెలుపొంది, మెజారిటీకి ఏడెనిమిది సీట్లకు తక్కువ మాత్రమే ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోవడం ఒక విధంగా ఇప్పుడు మేలు కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలోని లొసుగులు బీజేపీ పట్ల వరప్రసాదంగా మారనున్నాయి. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బి ఎస్ యడ్యూరప్ప రాష్ట్రం అంతా సుడిగాలి పర్యటనలు నిర్వహిస్తూ లోక్ సభ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో పనిచేసిన పార్టీ యంత్రంగం ఇంకా పటిష్టంగా ఉండటం కలసి వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రతీ నియోజకవర్గానికి ఇన్ ఛార్జ్ లను నియమించారు. గెలుపు కోసం ప్రస్తుత ఎంపీలలో కొందరికి సీట్లు రాకపోవచ్చని భావిస్తున్నారు. కర్ణాటకలో ప్రజాదరణతో యడ్యూరప్పతో పోటీ పడగల నేత మరో పార్టీలో లేరు. ఆయనకు ఇక్కడ బలంగావున్న లింగాయత్ లలో మంచి పలుకుబడి ఉండడంతో పాటు వొకలింగాలు, కుర్బాలు, బ్రాహ్మణులు, ఓబిసి, ఎస్సీలలో సైతం మంచి పట్టు ఏర్పడింది. కేరళలో శబరిమల వివాదం బీజేపీపై కేరళవ్యాప్తంగా సానుకూల పరిస్థితులు నెలకొనేటట్లు చేస్తున్నాయి. దీంతో తిరువనంతపురం, త్రిసూర్, పాలక్కాడ్, అత్తింగాళ్ వంటి నియోజకవర్గాలలో మంచి పట్టు ఏర్పడింది. 5 నుండి 7 స్థానాలలో గెలుపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇక దక్షిణాదిన అత్యధికంగా 39 సీట్లు ఉన్న తమిళనాడుపై బిజెపి ప్రత్యేక వ్యూహం అనుసరిస్తుంది. గత ఎన్నికలలో పీఎంకే, ఎండీఎంకే వంటి పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బిజెపి, పీఎంకే చేరి ఒక సీట్లలో గెలుపొందారు. ఈ పర్యాయం అన్నాడీఎంకే చివరకు బిజెపితో పొత్తు ఏర్పాటు చేసుకోక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. అన్నాడీఎంకే లోని రెండు వైరి వర్గాలను దగ్గరచేర్చి, ప్రభుత్వం సుస్థిరంగా ఉండేటట్లు చేయడంలో బీజేపీ కీలక పాత్ర వహించింది. అన్నాడీఎంకేతో పాటు మరి కొన్ని చిన్న చిన్న పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి 10కి పైగా సీట్లు గెలుపొందాలని బీజేపీ ప్రయత్నాలు సాగిస్తోంది. తమిళనాడు, కేరళలో కలిపి 59 లోక్ సభ సీట్లు ఉన్నాయి. వీటిలో మూడోవంతు సీట్లపై బీజేపీ నేతలు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ లో 1999 నాటి పరిస్థితులు ఇప్పుడు నెలకొన్నట్లు బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆ ఎన్నికలలో వాజపేయి ప్రభావంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి సొంతంగా 7 లోక్ సభ స్థానాలను గెలుపొందింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రజలలో ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవాలని బిజెపి నాయకత్వం ప్రయత్నం చేస్తున్నది. జనవరి 1 నుండి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చేపడుతున్న బస్సు యాత్ర ద్వారా ఏపీ అభివృద్ధికి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని చేస్తున్న ప్రయత్నం మంచి ఫలితం ఇవ్వగలదని భావిస్తున్నారు. పైగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకివస్తూ ఉండటం బిజెపికి అనుకూలంగా మారగలదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఇక తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్ సభ నాటికి పూర్తిగా భిన్నంగా ఉండగలవని అనుకుంటున్నారు. ప్రధాని మోడీపై గల ప్రజాదరణ రెండు తెలుగు రాష్ట్రాలలో చెక్కు చెదరలేదని, కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం ఏర్పడటం కోసం ప్రజలు ఓటు వేస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో సగం సీట్లలో బిజెపి బలమైన పోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·